




www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★


90 వసంతాల నవయువకుడు రస్కిన్ బాండ్

నేటి నుంచి టెట్ పరీక్షలు

హరిత నిర్మాణాలకు ప్రభుత్వ ప్రోత్సాహం


వార్తలు లోపలిపేజీల్లో



సోమవారం | 20-05-2024 | కరీంనగర్ | సంపుటి 07, సంచిక: 169   Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar   పేజీలు: 8+8 | వెల రూ. 5.00




## నికోబార్ దీవులను తాకిన 'నైరుతి'

### మే 31 నాటికి కేరళలోకి ప్రవేశించనున్న రుతుపవనాలు..

**న్యూఢిల్లీ :** భారతదేశ వ్యవసాయ ఆధారిత ఆర్థిక వ్యవస్థకు జీవనాడి అయిన నైరుతి రుతుపవనాలు ఆదివారం దేశంలోని దక్షిణ ప్రాంతమైన నికోబార్ దీవులను తాకినట్లు భారత వాతావరణ శాఖ (ఐఎండి) తెలిపింది. ఈ సీజన్‌లో వర్షాలు సాధారణం కంటే ఎక్కువగానే కురుస్తాయని ఐఎండి పేర్కొన్న విషయం విదితమే. లా నిని కారణంగా ఏర్పడిన పరిస్థితులతో పసిఫిక్ సముద్రం చల్లబడటం వల్ల ఈ ఏడాది మంచి వర్షాలు కురిస్తాయని తెలిపింది. ఈ క్రమంలోనే నైరుతి రుతుపవనాలు నికోబార్ దీవులకు చేరుకున్నాయని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. ఆదివారం మాల్దీవులు, కొమోరిన్ ప్రాంతం, దక్షిణ బంగాళాఖాతం, తరువాయి 2లో

## కేబినెట్ భేటీకి షరతులతో 'ఇసి గ్రీన్‌సిగ్నల్'

● నేడు మంత్రివర్గ సమావేశం ● రైతు రుణమాఫీ, హైదరాబాద్ ఉమ్మడి రాజధాని అంశాలపై చర్చించవద్దని ఇసి సూచన ● ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములైన అధికారులెవరినీ సమావేశానికి ఆహ్వానించవద్దని ఆదేశం




ప్రజాపక్షం / హైదరాబాద్

కేంద్ర ఎన్నికల కమిషన్ అనుమతివ్వడంతో రాష్ట్ర మంత్రివర్గ సమావేశాన్ని ఈ నెల 20వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు సచివాలయంలో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదివారం అత్యవసర నోట్ జారీ చేశారు. తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం నిర్వహణకు కేంద్ర ఎన్నికల కమిషన్ (ఇసి) షరతులతో కూడిన అనుమతి ఆదివారం ఇచ్చింది. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడే జూన్ 4లోపు చేయాల్సిన అత్యవసర విషయాలు, నిర్ణీత గడువులోగా అమలు తరువాయి 2లో

# ఎల్లో అలర్ట్

బలహీనపడిన ఉపరితల ఆవర్తనం

రాష్ట్రంలో పలుచోట్ల వర్షాలు

మరో మూడు రోజులు కూడా...

వికారాబాద్ జిల్లాలో పిడుగుపాటుకు ముగ్గురు మృతి




ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర వ్యాప్తంగా గత మూడు రోజుల నుంచి వర్షాలు కురుస్తున్నాయి. పలుచోట్ల ఐకెపి మార్కెట్లలో ధాన్యం తడుస్తుండగా, మామిడికాయలు నేలరాలాయి. తాజాగా ఆదివారంనాడు పిడుగు పడి ముగ్గురు మృత్యువాత పడ్డారు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా యాలాల మండలంలో జరిగాయి. జిల్లాలో రెండు చోట్ల పిడుగులు పడిన ఘటనలో ముగ్గురు మరణించారు. మృతి చెందిన వారిలో ఇద్దరు యాలా మండలం జంటుపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్, లక్ష్మ ణప్పగా గుర్తించారు. మరొకరు ఇదే మండలంలోని బెన్నూరు గ్రామానికి చెందిన వెంకప్ప మృతి చెందారు. కాగా రాగల మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ఛత్తీస్‌గఢ్ నుంచి తెలంగాణ, రాయలసీమ మీదుగా కర్ణాటక వరకు కొనసాగిన ఉపరితల ఆవర్తనం బలహీనపడిందన్నారు. దీనితో కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయన్నారు. తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని, మరికొన్ని చోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించారు. ఈ మేరకు పలు జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేశామన్నారు. ఆదివారం కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, సిద్దిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, మెదక్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో గంటకు 30–40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయన్నారు. ఉరుములు, మెరుపులతో వర్షాలు కురిసే అవకాశాలున్నాయన్నారు. ఈ నెల 20న, తరువాయి 2లో

# 6 రాష్ట్రాలు, 2 యుటిలు

## 49 నియోజకవర్గాల్లో నేడు ఐదవ విడత పోలింగ్

### 695 మంది అభ్యర్థుల భవితవ్యాన్ని ఇవిఎంలలో నిక్షిప్తం చేయనున్న ఓటర్లు

### బరిలో ప్రతిపక్షాలకు చెందిన ప్రముఖ నేతలు, కేంద్రమంత్రులు





**న్యూఢిల్లీ :** లోక్‌సభ ఎన్నికల ఐదో విడత పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. సోమవారం 6 రాష్ట్రాలు, 2 కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 49 నియోజకవర్గాల్లో పోలింగ్ జరగనుంది. ఇందుకోసం కేంద్ర ఎన్నికల సంఘం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. ఐదో విడతలో ఉత్తర్‌ప్రదేశ్‌లో 14 లోక్‌సభ స్థానాలకు పోలింగ్ జరగనుంది. మహారాష్ట్రలో 13, బీహార్‌లో 5, జమ్ము కశ్మీర్, లఢఖ్‌లో చెరొకటి, జార్ఖండ్ 3, ఒడిశా 5, బంగాల్‌లో 7 లోక్‌సభ స్థానాల్లో ఓటింగ్ జరగనుంది. ఈ నియోజకవర్గాల్లో పోటీలో ఉన్న 695 మంది అభ్యర్థుల భవితవ్యాన్ని ఓటర్లు ఇవిఎంలలో నిక్షిప్తం చేయనున్నారు. ఐదో విడతలో పలువురు కేంద్ర మంత్రులు, ప్రతిపక్ష పార్టీలకు చెందిన ప్రముఖ నేతలు బరిలో ఉన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, బిజెపి అగ్ర నాయకులు రాజ్‌నాథ్ సింగ్, స్మృతి ఇరానీ, రాజీవ్ ప్రతాప్ రూడీ, పీయూష్ గోయల్, ఎల్‌జెపి అధినేత చిరాగ్ పాసవాన్ సహా పలువురు అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. రాహుల్ గాంధీ ఉత్తర్‌ప్రదేశ్‌లో కాంగ్రెస్‌కు కంచుకోటగా భావించే రాయ్‌బరేలీలో పోటీ చేస్తున్నారు. 1999 నుంచి అక్కడ హస్తం పార్టీ అభ్యర్థులే విజయం సాధిస్తూ వచ్చారు. 2004 నుంచి 2024 వరకూ రాయ్‌బరేలీ నుంచి ప్రాతినిథ్యం వహించిన సోనియాగాంధీ ఈసారి రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఫలితంగా ఆ స్థానంలో ఆమె కుమారుడు రాహుల్ పోటీకి దిగారు. వయనాడ్ సిట్టింగ్ ఎంపి అయిన రాహుల్ అక్కడి నుంచి రెండోసారి బరిలో ఉన్నారు. బిజెపి సీనియర్ నేత, రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ లక్నో నుంచి మూడోసారి పోటీ చేస్తున్నారు. 2014, 2019 ఎన్నికల్లో విజయభేరి మోగించారు. సమాజ్‌వాదీ పార్టీకి చెందిన రవిదాస్ మెహ్రోత్రా రాజ్‌నాథ్‌తో తలపడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ మరో కంచుకోట అయిన అమేథీని 2019 ఎన్నికల్లో బద్దలుకొట్టిన తరువాయి 2లో



## పాల్ కోసం పోలీసుల గాలింపు..

### ఎపి, తెలంగాణలో కేసులు నమోదు

ప్రజాపక్షం/హైదరాబాద్

ఎంఎల్‌ఎ, ఎంపి టికెట్లు ఇప్పిస్తానని రూ.కోట్లలో డబ్బులు దండుకున్న ప్రజాశాంతి వ్యవస్థాపక అధ్యక్షుడు కెఎ పాల్‌పై ఆంధ్రప్రదేశ్‌లో కూడా చీటింగ్ కేసులు నమోదయ్యాయి. ఎల్‌బినగర్ అసెంబ్లీ నియోజక వర్గానికి సంబంధించి ప్రజాశాంతి పార్టీ తరపున ఎంఎల్‌ఎ టికెట్ ఇస్తానని రూ.57 లక్షలు ఇచ్చి మోసపోయిన జిల్లెలగూడకు చెందిన వస్త్ర వ్యాపారి కిరణ్‌కుమార్ రెండు రోజుల క్రితం పంజగుట్ట పోలీసు స్టేషన్‌లో చీటింగ్ కేసు తరువాయి 2లో







## అఫ్గాన్‌లో ఆగని వరదలు

### 47 మంది మృతి



అఫ్గానిస్థాన్‌ను అకస్మిక వరదలు ముంచెత్తుతున్నాయి. ఇటీవల కాలంలో అకాల వర్షాలు, వరదల కారణంగా వందలాది మంది మృతి చెందారు. వేల సంఖ్యలో గాయపడ్డారు. ఆస్తి నష్టం కూడా ఎక్కువగానే ఉంది. పలు ప్రాంతాల్లో ఇళ్లు పాక్షికంగా లేదా పూర్తిగా ధ్వంసమయ్యాయి. రోడ్డు కొట్టుకుపోయాయి. పంట పొలాల్లోకి వరద నీరు చేరాయి. నగరాలు, పట్టణాల్లో రోడ్లు, ఆవాస ప్రాంతాలు మోకాలిలోతు నీళ్లలో చిక్కుకున్నాయి. కమ్యూనికేషన్ వ్యవస్థ దెబ్బతిన్నది. ఈ సమస్యలతో అల్లాడుతున్న అఫ్గాన్‌లో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షాల కారణంగా ఆదివారం తెల్లవారు జామున ఫర్యాబ్ ప్రావీన్స్‌ను ఆకస్మిక వరదలు ముంచెత్తాయి. దీనితో గత మూడు రోజుల్లో మృతుల సంఖ్య 47కు చేరిందని అధికారులు ప్రకటించారు. గత నెల వరదల్లో మొత్తం 70 మంది మృతి చెందారు. ఆర్థికంగా అంతంత మాత్రంగానే ఉన్న అఫ్గాన్ ఈ తాజా ఉపద్రవం సృష్టించిన నష్టం నుంచి బయటపడేందుకు ప్రపంచ దేశాల మద్దతు కోరుతున్నది.

## ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీంరైసీ హెలికాప్టర్‌కు ప్రమాదం



**దుబాయ్:** ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ ప్రయాణిస్తున్న హెలికాప్టర్ ప్రమాదానికి గురైంది. రాజధాని టెహ్రాన్‌కు 600 కిలోమీటర్ల దూరంలో ఉన్న జోల్ఫా నగరం సమీపంలో ఈ ఘటన జరిగింది. ఆ దేశ అధికారిక మీడియా ఈ విషయాన్ని ప్రకటించింది. అయితే, ప్రస్తుతం అధ్యక్షుడి పరిస్థితి ఎలా ఉందనే విషయంపై ఎలాంటి సమాచారం వెల్లడించలేదు. ప్రమాద స్థలానికి చేరుకునేందుకు సహాయక బృందాలు ప్రయత్నిస్తున్నాయని ఇరాన్ అధికారిక మీడియా తెలిపింది. అయితే, ప్రతికూల వాతావరణం ఇందుకు అవరోధంగా మారిందని చెప్పింది. ఆ ప్రాంతంలో భారీ వర్షం కురుస్తోందని, గాలులు వీస్తున్నాయని పేర్కొంది. ఇబ్రహీం రైసీ(63) ఆదివారం అజర్‌బైజాన్ పర్యటనకు వెళ్లారు. అరస్ నదిపై రెండు దేశాలు కలిసి నిర్మించిన డ్యామ్‌ను ఆయన అజర్‌బైజాన్ అధ్యక్షుడు ఇల్హాం అలియేవ్‌తో కలిసి ప్రారంభించాలన్నది ప్రణాళిక. అయితే, ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ ప్రయాణిస్తున్న హెలికాప్టర్ అనూహ్యంగా ప్రమాదానికి గురైంది.

# ప్రచండ విశ్వాస పరీక్ష నేడే






ప్రచండగా అందరికీ సుపరిచితులైన నేపాల్ ప్రధాని పుష్ప కమల్ దహాల్ సోమవారం విశ్వాస పరీక్షను ఎదుర్కోనున్నారు. కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ నేపాల్ (మావోయిస్టు సెంటర్) అధినేతగా, వామపక్ష భావజాలం ఉన్న నాయకుడిగా పేరు సంపాదించిన ప్రపంచ 2022 డిసెంబర్ 25న నేపాల్ ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ మూడు పర్యాయాలు ఆయన విశ్వాస పరీక్షను సమర్థంగా ఎదుర్కొన్నారు. కాగా, హోం మంత్రి రబిల మిచానే అక్రమాలకు పాల్పడ్డారని, సహకార నిధులను దుర్వినియోగం చేశారని ప్రధాన ప్రతిపక్షమైన నేపాలీ కాంగ్రెస్ డిమాండ్ చేస్తున్నది. మంత్రిని వెంటనే తొలగించి,విచారణజరిపించాలని కోరుతున్నది. నేపాలీ కాంగ్రెస్ చేసిన ఆరోపణలను ప్రచండ సంకీర్ణ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న జనతా సమాజ్‌బాది పార్టీ (జెఎస్‌పి) కూడా తీవ్రంగా పరిగణించింది. ఈ అంశంపైనే ప్రచండతో విభేదిస్తూ, గత వారం న మద్దతును ఉపసంహరించుకోవడంతో, నిబంధనలను అనుసరించి ప్రచండ మరోసారి విశ్వాస పరీక్షకు సిద్ధంకాక తప్పలేదు. సోమవారం హౌస్ ఆఫ్ రిప్రజెంటిటివ్స్‌లో ప్రవేశ పెట్టే విశ్వాస పరీక్షను సులభంగానే నెగ్గుతానని ప్రచండ ధీమా వ్యక్తం చేస్తున్నారు. మొత్తం మీద సుమారు ఏడాదిన్నరకాలంలో నాలుగోసారి చట్టసభలో విశ్వాస పరీక్షను ఎదుర్కోవాల్సి రావడం నేపాల్‌లో నెలకొన్న రాజకీయ అనిశ్చితికి అద్దం పడుతున్నది.

## కాంగోలో కాల్పుల కలకలం



కాంగో రాజధాని కిన్హాసాలో కాల్పుల ఘటన కలకలం రేపింది. ఆదివారం తెల్లవారు జామున కాల్పులు చోటు చేసుకున్నాయని, ఈ ఘటనలో ముగ్గురు మృతి చెందారని సైనిక ఉన్నతాధికారులు ప్రకటించారు. ప్రభుత్వాన్ని కూల్చేందుకు జరిగిన కుట్రగా ఈ ఘటనను వారు అభివర్ణించారు. అయితే, భద్రతా దళాలు ఆ ప్రయత్నాలను సమర్థంగా తిప్పికొట్టాయని పేర్కొన్నారు. ఇలావుంటే, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం సివిలియన్లు, మిలటరీ దుస్తుల్లో ఉన్న వ్యక్తుల మధ్య కాల్పులు చోటు చేసుకున్నాయి. కాంగో సమాఖ్య నేషనల్ అసెంబ్లీ సభ్యుడు మిచెల్ మోటో ముహిమా ఇంటిపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేశారని, భద్రతా దళాలు అడ్డుకున్నాయి. అయితే, దాడికి పాల్పడిన వారి వివరాలనుగానీ, మృతులు ఎవరనే విషయాన్నిగానీ కాంగో అధికారులు వెల్లడించలేదు. ప్రభుత్వాన్ని కూల్చివేసే కుట్రను భగ్నం చేశామని మాత్రమే ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో అంతకు మించి సమాచారం ఇవ్వలేమని స్పష్టం చేశారు.

# గాజాపై తాజా దాడులు



అంతర్జాతీయ సమాజంతోపాటు, తన మంత్రివర్గంలోని కొంత మంది సభ్యులు కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నప్పటికీ, గాజాపై దాడులను కొనసాగించాలని ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహు పట్టుదలతో ఉన్నట్టు కనిపిస్తున్నది. సెంట్రల్ గాజాలోని డెర్ అల్ బలా నగరం సమీపంలో ఇజ్రాయెల్ జరిపిన తాజా దాడుల్లో కనీసం 20 మంది మృతి చెందారు. వీరిలో మహిళలు, పిల్లలు ఎక్కువ మంది ఉన్నట్టు సమాచారం. రఫా నగరాన్ని ఇప్పటికే దారుణంగా దెబ్బతీసి, లక్షలాది మందిని నిరాశ్రయులను చేసిన ఇజ్రాయెల్ దళాలు, సెంట్రల్ గాజాలోనూ మారణకాండ సృష్టిస్తున్నాయి. పాలస్తీనాపై యుద్ధ మొదలుపెట్టి ఎనిమిది నెలలు గడుస్తున్నప్పటికీ, సాధించింది ఏమిటని ఇజ్రాయెల్ మంత్రి బెన్నీ గాన్జ్ నిలదీస్తున్నారు. గాజా యుద్ధం అనంతరం తీసుకోబోయే చర్యలపై స్పష్టతనివ్వాలని ప్రధాని నెతన్యాహును డిమాండ్ చేస్తున్నారు. జూన్ 8వ తేదీలోగా వివరాలు, విస్పష్టమైన ప్రణాళికను ఇవ్వకపోతే, మంత్రివర్గం నుంచి వైదొలగుతానని హెచ్చరిస్తున్నారు. సొంత కేబినెట్‌లోనే వ్యతిరేకత పెరగడంతో నెతన్యాహు తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటున్నట్టు సమాచారం. సాధ్యమైనంత త్వరగా యుద్ధాన్ని ముగించకపోతే, అంతర్జాతీయ సమాజంతోపాటు, దేశంలో.. సొంత పార్టీ నుంచే వ్యతిరేకత తప్పకపోవచ్చన్నది బహిరంగ రహస్యం. పాలస్తీనాను ప్రపంచ చిత్ర పటం నుంచి తొలగించాలన్న లక్ష్యంతో యుద్ధాన్ని కొనసాగిస్తున్న నెతన్యాహు ఒంటరిగా మిగిలిపోయే రోజు ఎంతో దూరంలో లేదు.

## యుకె ప్రధాని సునాక్‌పై ఒత్తిడి



ఆర్థికాభివృద్ధి మందగించడం నుంచి యువతకు ఉద్యోగావకాశాల వరకూ అనేక విషయాల్లో యునైటెడ్ కింగ్డమ్ (యుకె) ప్రధాని రిషి సునాక్‌పై రోజురోజుకూ ఒత్తిడి తీవ్రత పెరుగుతున్నది. ఆయన సమస్యల జాబితాలో 'గ్రాడ్యుయేట్ రూట్ స్కీమ్' కొత్తగా చేరింది. బ్రిటన్‌లో చదువుతున్న విద్యార్థులు తమతమ కోర్సులు పూర్తయిన తర్వాత, రెండేళ్లపాటు యుకెలో ఉండేలా ఈ పథకాన్ని 2021లో ప్రారంభించారు. అప్పటి నుంచి ఎక్కువ మంది భారతీయ విద్యార్థులే ఈ పథకాన్ని ఉపయోగించుకుంటున్నారు. కాగా, విద్యాభ్యాసం ముగిసిన తర్వాత కూడా రెండేళ్లు బ్రిటన్‌లోనే ఉండే అవకాశం కల్పించడం వల్ల సమస్యలు ఎదురవుతున్నాయని, ముఖ్యంగా ఉద్యోగ కల్పనలో గందరగోళ పరిస్థితులు ఎదురవుతున్నాయని కన్జర్వేటివ్ పార్టీకి చెందిన ఒక వర్గం సునాక్‌ను హెచ్చరిస్తున్నది. దీనితో ఈ పథకాన్ని నియంత్రించడం లేదా పూర్తిగా రద్దు చేయడంపై ప్రభుత్వం కసరత్తు చేస్తున్నదని ఆయన ప్రకటించడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఈ నిర్ణయాన్ని కన్జర్వేటివ్ పార్టీలోనే మరో వర్గం వ్యతిరేకిస్తున్నది. సునాక్ తీసుకుంటున్న ప్రతి నిర్ణయాన్ని తప్పుపడుతున్న ప్రతిపక్ష లేబర్ పార్టీ, 'గ్రాడ్యుయేట్ రూట్ స్కీమ్'లో మార్పులు లేదా రద్దును తిరస్కరిస్తున్నది. ఈ విధానం వల్లే యుకెలోని విశ్వవిద్యాలయాలు ఆర్థికంగా పుంజుకుంటున్నాయని, ఇప్పుడిప్పుడు నిలదొక్కుకుంటున్న వాటిని తిరిగి సమస్యల్లోకి నెట్టడం సరికాదని వ్యాఖ్యానిస్తున్నది. దీనితో అన్ని రకాలుగా ఒత్తిడికి లోనవుతున్న సునాక్ ఈ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది ఆసక్తి రేపుతున్నది.

## 'ఇసి గ్రీన్‌సిగ్నల్' (మొదటి పేజీ తరువాయి)

చేయగల అంశాలను మాత్రమే చర్చించాలని, రైతు రుణమాఫీ, హైదరాబాద్ ఉమ్మడి రాజధాని అంశాలపై చర్చించవద్దని పేర్కొంది. అదే విధంగా ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములైన రాష్ట్ర అధికారులెవరినీ మంత్రివర్గ సమావేశానికి ఆహ్వానించవద్దని ఇసి ఆదేశించింది. కాగా రాష్ట్ర సచివాలయంలో శనివారం జరగాల్సిన మంత్రిమండలి సమావేశం వాయిదా పడిన విషయం తెలిసిందే.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు శనివారం సమావేశంలో పాల్గొనేందుకు సచివాలయానికి వచ్చి మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు ఎదురు చూసినా ఇసి నుంచి అనుమతి రాలేదు. దీంతో రాత్రి 7 గంటలకు సమావేశం వాయిదా వేసి వెళ్లిపోయారు. రైతు రుణమాఫీ, ధాన్యం కొనుగోళ్లు, ఖరీఫ్ పంటల ప్రణాళిక, రైతులకు సంబంధించిన పలు కీలకమైన విషయాలు, జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాల నిర్వహణ, రాష్ట్రం ఏర్పడి పదేళ్లు పూర్తవుతుండగా పునర్విభజన చట్టంలో ఇప్పటివరకు ఎపి, తెలంగాణల మధ్య పెండింగ్‌లో ఉన్న అంశాలను మంత్రిమండలి భేటీలో చర్చించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. కానీ, ఇసి తాజా ఆదేశాలతో పలు అంశాలపై చర్చ ఉండబోదని తెలుస్తోంది.

## ఎల్లో అలర్ట్ (మొదటి పేజీ తరువాయి)

21న తేలికపాటి నుంచి మోస్తరు వర్షాపాతం నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. 22న భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో వర్షాపాతం నమోదయ్యే అవకాశం ఉందన్నారు. 23న ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్ వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉందని చెప్పారు.

**హైదరాబాద్ ప్రాంతాల్లో కురిసిన వర్షం**

హైదరాబాద్ నగరంలోని పలు చోట్ల ఆదివారం కురిసింది. అమీర్ పేట్, ఎస్‌ఆర్ నగర్, సనత్ నగర్, పంజాగుట్ట, సోమాజిగూడ, బేగంపేట, ఎర్రగడ్డ, బాలా నగర్, బోయిన్‌పల్లి, ఫతేనగర్ ప్రాంతాల్లో చిరు జల్లులు కురిశాయి. దీంతో లోతట్టు ప్రాంతాలకు భారీగా వరద నీరు వచ్చి నీటితో నిండిపోయాయి. మరో వైపు వర్షం కారణంగా అనేక ప్రాంతాల్లో ట్రాఫిక్ స్తంభించిపోయింది. వర్షాల కారణంగా చాలా చోట్ల రోడ్లు చెరువులుగా మారడంతో పాటు డ్రెయిన్లు నీటితో నిండిపోయాయి. దీనితో వాహనదారులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిహెచ్‌ఎంసి అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ప్రధానంగా లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు.

## నికోబార్ దీవులను తాకిన 'నైరుతి'

(మొదటి పేజీ తరువాయి)

నికోబార్ దీవులు, దక్షిణ అండమాన్ సముద్రంలోని కొన్ని ప్రాంతాలకు ముందస్తుగా నైరుతి రుతుపవనాలు చేరుకున్నాయని వాతావరణ అధికారులు తెలిపారు. దీంతో మే 31 నాటికి రుతుపవనాలు కేరళకు చేరుకునే అవకాశం ఉందన్నారు. గత 150 ఏళ్లలో కేరళలో రుతుపవనాల ఆగమన తేదీల్లో చాలా తేడాలు ఉన్నాయి. 1918 సంవత్సరంలో రుతుపవనాలు మొదటగా మే 11వ తేదీన వచ్చాయి. అయితే 1972లో ఆలస్యంగా జూన్ 18న కేరళను తాకాయి. గతేడాది జూన్ 8న రుతుపవనాలు కేరళకు చేరుకున్నాయి. 2022లో మే 29న, 2021లో జూన్ 3న, 2020లో జూన్ 1న కేరళకు చేరుకున్నాయి. భారత ఆర్థిక వ్యవస్థ వ్యవసాయ ఆధారితమైనది కాబట్టి రుతుపవనాల ఆధారంగా దేశంలో పంటలు పండిస్తారు. ప్రస్తుతం దేశంలోని చాలా ప్రాంతాలు తీవ్రమైన వేడిని ఎదుర్కొంటున్నాయి. పలు ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రత 48 డిగ్రీల సెల్సియస్‌కు చేరుకుంది. దీంతో జనజీవనం అస్తవ్యస్తంగా తయారైంది. ఈ ఏడాది ఏప్రిల్‌లోనే దక్షిణ భారతదేశంలో వేడిగాలులు మొదలయ్యాయి. విపరీతమైన వేడి కారణంగా పవర్ గ్రిడ్‌పై ఒత్తిడి పెరిగి నీటి వనరులు కూడా ఎండిపోతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో భారతదేశంలో రుతుపవనాల ముందస్తు ఆగమనం గొప్ప ఉపశమనమని చెప్పవచ్చు. భారతదేశ వ్యవసాయంలో 52 శాతం వర్షంపైనే ఆధారపడి ఉంది. ఈ క్రమంలో ఖరీఫ్ పంటకు జూన్, జులైలో రుతుపవనాల వర్షాలు కూడా చాలా అవసరం.

# నేటి నుంచి టిఎస్ టెట్ పరీక్షలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టిఎస్ టెట్ ) పరీక్షలు సోమవారం ప్రారంభం కానున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 2,86,386 మంది టెట్ పరీక్షలు రాయనున్నారు. పరీక్షలు మే 20న (సోమవారం) ప్రారంభమై జూన్ 2తో ముగియనున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 80 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా ఇందులో మేడ్చల్‌లో అత్యధికంగా25 కేంద్రాలు ఉండగా, ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, నల్లగొండ, సంగారెడ్డి, వరంగల్ జిల్లాలో ఒకే పరీక్ష కేంద్రం ఉన్నది. పరీక్ష కేంద్రం స్థాయి పర్యవేక్షకులను ఏర్పాటు చేశారు. కాగా వరంగల్‌నల్లగొండ, ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గ ఎంఎల్‌సి ఎన్నిక నేపథ్యంలో ఈ నెల 27న పరీక్ష లేకుండా షెడ్యూల్ ను రూపొందించారు. పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. టెట్ పరీక్ష మొదటి పేపర్‌కు రాష్ట్ర వ్యాప్తంగా 99,958 మంది,పేపర్ 2లో 1,86,428 మంది దరఖాస్తు చేసుకున్నారు.టెట్ పరీక్షలు ఉదయం 9గంటల నుండి 11:30గంటల వరకు, మధ్యాహ్నం 2గంటల నుంచి 4:30 గంటల వరకు రెండు సెషన్‌లలో నిర్వహిస్తారు.

**జిల్లాల వారీగా పరీక్ష కేంద్రాల సంఖ్య :**

ఆదిలాబాద్ 1,భద్రాద్రి కొత్తగూడెం1హన్మకొండ4, హైదరాబాద్2,కరీంనగర్8, ఖమ్మం8, మహబూబ్‌నగర్2, మేడ్చల్ 25, నల్లగొండ1, నిజామాబాద్2, పెద్దపల్లి3, రంగారెడ్డి 17, సంగారెడ్డి 1, సిద్ధిపేట2, సూర్యాపేట 2, వరంగల్1 పరీక్ష కేంద్రాలు.

| క్ర.సంఖ్య | తేదీ | పేపర్ /సబ్జెక్ట్ |
|---|---|---|
| 01. | మే 20 | మ్యాథ్స్ అండ్ సైన్స్ సేషన్ 1 |
| 02. | మే 20 | మ్యాథ్స్ అండ్ సైన్స్ సేషన్2 |
| 03. | మే 21 | మ్యాథ్స్ అండ్ సైన్స్ సేషన్ 1 |
| 04. | మే 21 | మ్యాథ్స్ అండ్ సైన్స్ సేషన్2 |
| 05. | మే 22 | మ్యాథ్స్ అండ్ సైన్స్ సేషన్ 1 |
| 06. | మే 22 | మ్యాథ్స్ అండ్ సైన్స్ సేషన్ 2 |
| 07. | మే 24(మైనర్ మీడియం) | సోషల్ సేషన్1 |
| 08. | మే 24 | సోషల్ సేషన్2 |
| 09. | మే 28 | సోషల్ సేషన్1 |
| 10. | మే 28 | సోషల్ సేషన్2 |
| 11. | మే 29 | సోషల్ సేషన్1 |
| 12. | మే 29 | సోషల్ సేషన్2 |
| 13. | మే 30 | పేపర్ 1 సేషన్1 |
| 14. | మే 30 | పేపర్ 1 సేషన్2 |
| 15. | మే31 | పేపర్1 సేషన్ 1 |
| 16. | మే 31 | పేపర్1సేషన్ 2 |
| 17. | జూన్ 1(మైనర్ మీడియం) | మ్యాథ్స్ అండ్ సైన్స్ సేషన్ 1 |
| 18. | జూన్ 1(మైనర్ మీడియం) | మ్యాథ్స్ అండ్ సైన్స్ సేషన్ 2 |
| 19. | జూన్ 2 | పేపర్1 సేషన్ 1 |
| 20. | జూన్ 2 | పేపర్1 సేషన్ 2 |

## విరుచుకుపడ్డ ఎక్సైజ్ అధికారులు

### సారా తయారీ బెల్లం స్వాధీనం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** నాటుసారా తయారీ కేంద్రాలపై ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆదివారం విరుచుకుపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా చేసిన దాడుల్లో రూ.25 లక్షల విలువైన సారా తయారీ బెల్లంను స్వాధీనం చేసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధాయానికి గండికొడుతున్న నాటుసారాను మూడు నెలల్లో నిర్మూలించాలని ఎక్సైజ్ కమిషనర్ శ్రీధర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వి.బి.కమలాసన్‌రెడ్డిలు రెండు రోజుల క్రితం జరిగిన రాష్ట్రస్థాయి అధికారుల సమావేశంలో ఆదేశించిన విషయం తెలిసిందే. దీంతో అన్ని జిల్లాల ఎక్సైజ్ అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ మేరకు 24 గంటల వ్యవధిలో మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి తదితర ప్రాంతాల్లో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించి రూ.25 లక్షల విలువైన సారా తయారీ ముడి పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. సారా తయారీ ముడి సరుకు మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాల నుంచి తెలంగాణలోకి అక్రమంగా సరఫరా జరుగుతుంది. వీటిపై అధికారులు దృష్టి సారించి వరుస దాడులు నిర్వహించారు. అసిస్టెంట్ కమిషనర్ విజయ భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దాడుల్లో నలుగురిని అరెస్టు చేసి మూడు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ అధికారులు ఎస్ ప్రదీప్ రావు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ దాడులు పట్ల ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ కమలహాసన్ రెడ్డి అధికారులకు అభినందనలు తెలిపారు. ఇదే తీరులో అన్ని జిల్లాల్లో ముందుకు సాగి మూడు నెలల్లో నాటుసారాను అంతం చేయాలనే లక్ష్యాన్ని చేరుకోవాలని పిలుపునిచ్చారు.

## 2 యుటిలు

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ రెండోసారి అక్కడి నుంచి పోటీలో ఉన్నారు. గాంధీ కుటుంబానికి సన్నిహితునిగా ముద్రపడిన కిషోరీలాల్ శర్మ ఈసారి కాంగ్రెస్ తరపున ఆమేథీలో పోటీ చేస్తున్నారు. బిఎస్‌పి నుంచి నన్హే సింగ్ చౌహాన్ బరిలో ఉన్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని కైసర్‌గంజ్‌లో ఈసారి డబ్ల్యుఎఫ్ఐ మాజీ చీఫ్ బ్రిజ్‌భూషణ్ కుమారుడు కరణ్ భూషణ్ బిజెపి తరపున పోటీ చేస్తున్నారు. 2014, 2019 ఎన్నికల్లో బ్రిజ్‌భూషణ్ విజయం సాధించినప్పటికీ లైంగిక వేధింపుల ఆరోపణలు రావటం వల్ల బిజెపి ఆయనను పక్కనపెట్టింది. ఎస్‌పి తరపున రామ్‌భగత్, బిఎస్‌పి నుంచి నరేంద్రపాండే బరిలో ఉన్నారు. ఆర్‌జెడి అధినేత, బీహార్ మాజీ సిఎం లాలుప్రసాద్ కుమార్తె రోహిణి ఆచార్య సరన్ లోక్‌సభ స్థానం నుంచి బరిలో ఉన్నారు. 2014, 2019 ఎన్నికల్లో ఇక్కడి నుంచి గెలుపొందిన బిజెపి అభ్యర్థి రాజీవ్ ప్రతాప్ రూడీతో ఆమె తలపడుతున్నారు. లోక్ జనశక్తి పార్టీ (ఎల్‌జెపి) అధ్యక్షుడు చిరాగ్ పాశ్వాన్ హాజీపుర్ నుంచి బరిలోకి దిగారు. గత రెండు ఎన్నికల్లో ఇక్కడ ఎల్‌జెపి అభ్యర్థులే విజయభేరీ మోగించారు. ఆర్‌జెడి నుంచి చంద్రరామ్ చిరాగ్‌తో పోటీపడుతున్నారు.

**అందరి చూపు నార్త్ ముంబయి వైపు**

ఐదో విడతలో అందరి దృష్టిని ఆకర్షిస్తున్న మరో నియోజకవర్గం నార్త్ ముంబయి. బిజెపికి కంచుకోటగా భావించే ఈ స్థానంలో కేంద్రమంత్రి పియూష్ గోయల్ బరిలో ఉన్నారు. గత రెండు ఎన్నికల్లో గోపాల్ శెట్టి కమలం పార్టీ తరపున గెలుపొందారు. కాంగ్రెస్ తరపున భూషణ్ పాటిల్ పోటీ చేస్తున్నారు. ముంబయి నార్త్ సెంట్రల్‌లో బిజెపి నుంచి ప్రముఖ లాయర్ ఉజ్వల్ నిఖమ్ బరిలో ఉన్నారు. కాంగ్రెస్ తరపున వర్ష గైక్వాడ ఆయనతో తలపడుతున్నారు. నేషనల్ కాన్ఫరెన్స్ ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లా జమ్ముకశ్మీర్‌లోని బారాముల్లా నుంచి పోటీ చేస్తున్నారు. జమ్ముకశ్మీర్ పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి ఫయాజ్ అహ్మద్ మీర్ అబ్దుల్లాకు పోటీగా బరిలో నిలిచారు. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ఇప్పటి వరకు 379 లోక్‌సభ స్థానాల్లో పూర్తయింది. ఐదో విడతలో 49 నియోజక వర్గాలకు సోమవారం పోలింగ్ జరగనుంది. ఆరో విడత ఈనెల 25న, ఏడో విడత పోలింగ్ జూన్ ఒకటిన జరగనుండగా జూన్ 4న ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి.

**అర్బన్ ఓటర్లు– ఆ అపవాదును తొలగించండి**

గత ఎన్నికల్లో ముంబయి, థాణె, లక్నో నగరవాసులు ఓటింగ్ పట్ల ఉదాసీనత కనబర్చారని ఎన్నికల సంఘం(ఇసి) పేర్కొంది. సోమవారం పోలింగ్‌లో ఈ ప్రాంతాలకు చెందిన పౌరులు ఎక్కువ సంఖ్యలో ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించింది. అలా అర్బన్ ఓటర్లపై ఉన్న అపవాదును చెరిపివేయాలని కోరింది. మే 3న జరిగిన రెండో దశ పోలింగ్‌లో మెట్రోపాలిటన్ నగరాల్లో ఓటింగ్ నిరాశ కలిగించిందని ఇసి తెలిపింది.




## అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలి

### జస్టిస్ చంద్రకుమార్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అకాల వర్షాల వల్ల పంటలన్ని తీవ్రంగా దెబ్బతిన్నడంతో నష్టపోయిన రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలని మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ రైతు సంక్షేమ సమితి ఆధ్వర్యంలో ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ వర్షాల కారణంగా తడిసి ధాన్యాన్ని ప్రభుత్వం పూర్తి మద్దతు ధరకు కొనుగోలు చేయాలని కోరారు.అదేవిధంగా నష్టపోయిన ప్రతి పంటకు రైతులకు భీమా కంపెనీల నుండి పరిహారం ఇప్పించాలన్నారు. రైతుల తమ ధాన్యాన్ని ఐకెపి సెంటర్లకు తీసుకువచ్చేందుకు రవాణ సౌకర్యాం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సెంటర్లో ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర జాప్యం జరుగుతుండడంతో అక్కడ కనీస సౌకర్యాలు లేక రైతుల కష్టాలు వర్ణాతీతంగా ఉన్నాయని ఈ సమస్యలన్నింటిని వెంటనే పరిష్కరించాలని జస్టిస్ చంద్ర కుమార్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మీడియా సమావేశం లో తెలంగాణ రైతు సంక్షేమ సమితి నాయకులు వొంగురు నర్సింహా, మెడిభావి ప్రభు, పృథ్వీరాజ్ యాదవ్, తెలంగాణ విఠల్ తదితరులు పాల్గొన్నారు.

## పాల్ కోసం పోలీసుల గాలింపు..

(మొదటి పేజీ తరువాయి)

నమోదు చేయించిన విషయం తెలిసిందే. తెలంగాణతో పాటు పాల్‌పై ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఇలాంటి కేసులు నమోదయ్యాయని పోలీసుల దర్యాప్తులో తేలింది. అతని కోసం ఎపి, తెలంగాణ పోలీసులు గాలిస్తున్నారు. ఎంఎల్‌ఎ టికెట్లు ఇప్పిస్తానని రూ.కోట్లలో దండుకుని అజ్ఞాతంలోకి వెళ్లిన ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు కెఎ పాల్ కోసం పంజగుట్ట పోలీసులతో పాటు ఎపి పోలీసులు కూడా గాలిస్తున్నారు. పంజగుట్టలోని ఆఫీసర్స్‌కాలనీలో ఉన్న అతని కార్యాలయంతో పాటు ఇంటికి వెళ్లిన పోలీసులకు అతని ఆచూకీ లభించలేదు. కిరణ్‌కుమార్ లాగా మరికొందరు కూడా ఇదే పద్దతిలో మోసపోయారని పోలీసుల దర్యాప్తులో తేలిపోవడంతో అతని కోసం పోలీసులు గాలిస్తున్నారు. పోలీసులు కెఎ పాల్‌కు చెందిన బ్యాంక్ ఖాతాతో పాటు ప్రజాశాంతి పార్టీ బ్యాంక్ ఖాతాలను కూడా గుర్తించారు. అలాగే అతను ఉపయోగించిన బినామి వ్యక్తుల ఖాతాలను సైతం గుర్తించిన పోలీసులు బ్యాంక్ అధికారులతో మాట్లాడి వివరాలు తెప్పించుకుంటున్నారు. అయితే బ్యాంక్ ఖాతాలలో ఉన్న నగదును కెఎ పాల్ గతంలోనే విత్ డ్రా చేసినట్లు తెలుస్తుంది. అతని బ్యాంక్ ఖాతాలను ఫ్రీజ్ చేసేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు. పాల్‌ను పట్టుకునేందుకు ప్రత్యేక పోలీసు టీంను ఏర్పాటు చేశారు. ఈ పోలీసు బృందం ఒకటి ఆంధ్రప్రదేశ్‌కు కూడా వెళ్లి అతని కోసం ఆరా తీస్తున్నట్లు తెలిసింది.

**అభ్యర్థికి రూ.2 కోట్లు టోకరా...**

తిరుపతి ఎంఎల్‌ఎ టికెట్ ఇస్తానని తిరుపతిలోని ఓ దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడి నుంచి కెఎ పాల్ రూ.2 కోట్లు తీసుకున్నాడు. సదరు బాధితుడు విజవాడ పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదు కూడా చేశాడు. ఇక కొత్తగూడెం జిల్లాకు చెందిన చక్రవర్తి కూడా ఇదే పద్దతిలో పాల్ చేతిలో మోసపోయాడు. తనకు ఖమ్మం పార్లమెంట్ సీటు ఇస్తానని రూ.25 లక్షలు తీసుకుని మోసగించాడని చక్రవర్తి పేర్కొన్నారు. ఇదే పద్దతిలో వైజాగ్‌కు చెందిన హేమలత కూడా అక్కడి ఎంఎల్‌ఎ టికెట్ ఇస్తానని నమ్మించి రూ.20 లక్షలు తీసుకున్నట్లు బాధితురాలు వాపోయింది.



# 18వ లోక్‌సభ ఎన్నికల సమరం 2024

| పోలింగ్ | ఏప్రిల్ 19 | ఏప్రిల్ 26 | మే 7 | మే 13 | మే 20 | మే 25 | జూన్ 1 | ఓట్ల లెక్కింపు |
|---|---|---|---|---|---|---|---|---|
| సీట్లు | 102 | 89 | 94 | 96 | 49 | 57 | 57 | జూన్ 4 |

## 'ఇండియా' కూటమికే ఆధిక్యం!



ఏడు విడతల్లో జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా, ఇప్పటికే పూర్తయిన నాలుగు దశల్లో పోలింగ్ సరళి ప్రతిపక్ష 'ఇండియా' కూటమికే అనుకూలంగా ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. పలువురు రాజకీయ నాయకులు కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నారు. ఈ కారణంగానే ప్రధాని మోదీ ఆందోళనతో ఉన్నారని, ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని విమర్శలు కూడా ఉన్నాయి. సమాజ్‌వాది పార్టీ (ఎస్‌పి) చీఫ్ అఖిలేష్ యాదవ్ ఆదివారం లక్నోలో మాట్లాడుతూ, మొదటి నాలుగు దశల పోలింగ్‌ను ప్రస్తావించారు. 'ఇండియా' కూటమికే ప్రజలు మద్దతు ప్రకటించారని ఓటింగ్ సరళి స్పష్టం చేస్తున్నదని అన్నారు. ఉత్తరప్రదేశ్‌లో కూటమి హవా నడుస్తున్నదని, ఇక్కడ అత్యధిక సీట్లు గెలుస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. బిజెపికి ఎదురుదెబ్బ తప్పదని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీ, పార్టీ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ, డిఎంకె అధ్యక్షుడు, తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తదితరులు కూడా ఇదే వాదన వినిపిస్తున్నారు. మొదటి నాలుగు దశల పోలింగ్‌ను గమనించిన తర్వాత ప్రధాని మోదీతోపాటు బిజెపి శ్రేణులకు కూడా ఓటమి భయం పట్టుకుందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. సోమవారం ఐదో విడత పోలింగ్ జరగనున్న నేపథ్యంలో, ఓటింగ్ శాతంపై అంతా ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. పోలింగ్ సరళితో ఎవరికి పరిస్థితి అనుకూలంగా ఉందో అంచనా వేయవచ్చని నిపుణులు అంటున్నారు. ఎగ్జిట్ పోల్స్ కూడా పోలింగ్ తీరుతెన్నులు, ఓటింగ్ శాతం ఆధారంగానే ఏ పార్టీకి ఎన్ని సీట్లు లభిస్తాయన్నది అంచనా వేస్తాయి.

## అమృతపాల్ సింగ్‌కు 'మైక్'



పంజాబ్‌లోని ఖదూర్ సాహెబ్ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా లోక్‌సభకు పోటీ చేస్తున్న రాడికల్ బోధకుడు అమృతపాల్ సింగ్‌కు మైక్ గుర్తు లభించింది. 'వారిస్ పంజాబ్‌దే' సంస్థ చీఫ్‌గా వ్యవహరించిన అమృతపాల్ సింగ్ భద్రతా చట్టం కింద అస్సాంలోని దిబ్రూగఢ్ జైలులో ఉన్నాడు. కాగా, ఫరీద్‌కోట్ (రిజర్వ్) నియోజకవర్గం నుంచి ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తున్న సరబ్జీత్ సింగ్ ఖల్సాకు 'గన్న కిసాన్' (చెరకు రైతు) ఎన్నికల గుర్తును కేటాయించారు. అతను దివంగత ప్రధాని ఇందిరా గాంధీ హంతకుల్లో ఒకరైన బియాంత్ సింగ్ కుమారుడు. ఇందిరకు అంగరక్షకులుగా ఉన్న బియాంత్ సింగ్, సత్వంత్ సింగ్ ఆమెను 1984, అక్టోబర్ 31న ఆమె నివాసంలోనే హత్య చేసిన విషయం తెలిసిందే. అనంతరం కోర్టు తీర్పు మేరకు వీరిని ఉరితీశారు. కాగా, పంజాబ్‌లోని 13 లోక్‌సభ స్థానాలకు పోటీ చేస్తున్న 328 మంది అభ్యర్థులకు భారత ఎన్నికల సంఘం సూచనల మేరకు జిల్లా ఎన్నికల అధికారులు ఎన్నికల చిహ్నాలను కేటాయించినట్టు పంజాబ్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ (సిఇఒ) సిబిన్ ఆదివారం తెలిపారు. స్వతంత్ర అభ్యర్థులకు కేటాయించిన ఎన్నికల గుర్తులలో హార్మోనియం, డంబెల్స్, ఆపిల్, పటకారు, హాకీ స్టిక్, బాల్, స్టూల్, షిప్, గ్యాస్ సిలిండర్, బ్యాటరీ టార్చ్, అల్మిరా, కంప్యూటర్, బ్యాట్స్మన్, బ్యాట్, ట్రక్, మంచం, కాలీఫ్లవర్, పెట్రోల్ పంప్, టెలివిజన్, ల్యాప్‌టాప్, ఆటో రిక్షా, ప్రెజర్ కుక్కర్, ప్లాస్టరింగ్ ట్రోవెల్, ఫ్లూట్, డైమండ్, రోడ్ రోలర్, లెటర్‌బాక్స్, చిమ్నీ, కుట్టు యంత్రం వంటివి ఉన్నాయి. గురుదాస్‌పూర్‌లో 14 మంది ఇండిపెండెంట్లు సహా 26 మంది అభ్యర్థులు పోటీపడుతున్నారు. అమృత్‌సర్‌లో బరిలో ఉన్న 30 మందిలో 18 మంది స్వతంత్రులు. ఖదూర్ సాహెబ్ స్థానంలో 27 మంది అభ్యర్థులకు గాను 18 మంది స్వతంత్రులు పోటీలో ఉన్నారు. జలంధర్‌లో 20 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటుండగా, వారిలో ఎనిమిది మంది స్వతంత్రులు ఉన్నారు. అదే విధంగా హోషియార్‌పూర్‌లో నలుగురు స్వతంత్రులసహా మొత్తం 16 మంది అభ్యర్థులు ఉన్నారు. ఆనంద్‌పూర్ సాహిబ్‌లో 28 మంది అభ్యర్థులకుగాను 13 మంది స్వతంత్రులు, లూథియానాలో 43 మంది అభ్యర్థుల్లో 26 మంది స్వతంత్రులు ఉన్నారు. ఫతేఘర్ సాహెబ్‌లో మొత్తం 14 మంది అభ్యర్థుల్లో ఏడుగురు స్వతంత్రులు, ఫరీద్‌కోట్‌లో మొత్తం 28 మంది అభ్యర్థుల్లో 12 మంది స్వతంత్రులు. ఫిరోజ్‌పూర్ నుంచి 17 మంది స్వతంత్ర అభ్యర్థులసహా మొత్తం 29 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. భటిండాలో 18 మంది అభ్యర్థులు ఉండగా, వారిలో ఎనిమిది మంది స్వతంత్రులు ఉన్నారు. అదే విధంగా సంగ్రూర్‌లో 23 మంది అభ్యర్థులు పోటీలో ఉంటే, వారిలో తొమ్మిది మంది స్వతంత్రులు. పాటియాలాలో 15 (మొత్తం 26) మంది పోటీలో ఉన్నారు. పంజాబ్‌లో మొత్తం 13 లోక్‌సభ స్థానాలకు జూన్ ఒకటిన పోలింగ్ జరుగుతుంది.

## ముస్లింలపై బిజెపి కక్ష?



ముస్లింలపై బిజెపి కక్ష కట్టిందా? ఉద్దేశపూర్వకంగానే విమర్శలు చేస్తూ, సార్వత్రిక ఎన్నికల్లో హిందూ ఓటర్లకు గాలం వేస్తున్నదా? ఈ ప్రశ్నలకు అవుననే సమాధానమిస్తున్నారు పలువురు ప్రతిపక్ష నాయకులు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా నుంచి మొదలు పెడితే, కింది స్థా యి నాయకుడి వరకూ బిజెపికి శ్రేణులు ము స్లిం వ్యతిరేక ప్రచారంలో నిమగ్నమయ్యారని సిపిఎం ఆరోపించడమేగాక, భారత ఎన్నికల కమిషన్ (ఇసిఐ)కి ఫిర్యాదు కూడా చేసింది. దేశ సమైక్యతను దెబ్బ తీసే విధంగా జరుగుతున్న ఇలాంటి ప్రచారాన్ని వెంటనే అడ్డుకోవాలని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరీ కోరారు. ఎన్నికల సమయంలో జరుగుతున్న ర్యాలీలు, సభల్లో బిజెపి నాయకులు మూకుమ్మడిగా ముస్లింలపై విమర్శలు గుప్పిస్తున్న విషయం తెలిసిందే. వారి నుంచి హిం దువులకు ప్రమాదం పొంచి ఉందనే అభిప్రాయాన్ని వ్యాప్తి చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఒకవేళ ప్రతిపక్ష 'ఇండియా' కూటమి అధికారంలోకి వస్తే, దేశ సంపద, ఆదాయంలో అత్యధిక భాగం ముస్లింలకే వె ళుతుందని, చివరికి హిందూ మహిళలు తాళిబొట్లను కూడా వారి కోసం ఇవ్వాల్సి వస్తుందని ప్రధాని మోదీ విమర్శలు గుప్పించారు. 'ఎక్కువ మంది పిల్లలు ఉన్నవారు' అంటూ ముస్లింలను కించపరిచారు. బిజెపి మరోసారి అధికారంలోకి వస్తుందని, అప్పుడు ముస్లిం రిజర్వేషన్లను ఎత్తివేస్తామని అమిత్ షా పదేపదే అంటున్నారు. ఆదివారం జంషెడ్‌పూర్ లో జరిగిన ర్యాలీలో ఆయన మాట్లాడుతూ అయోధ్య రామ మందిరంలో విగ్రహ ప్రతిష్టాపనకు కాంగ్రెస్, సమాజ్‌వాది పార్టీ నాయకు లు హాజరుకాకపోవడాన్ని ప్రస్తావిస్తూ, వారికి ముస్లిం ఓటు బ్యాంకు పోతుందేమోనన్న భయం ఉందని ఆరోపించారు. హిందువులు దితీయ శ్రేణి పౌరులుగా మారిపోతారన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. బిజెపి నేతలు చేస్తున్న ఇలాంటి వ్యాఖ్యలు, ప్రకటనలతో ముస్లింల పట్ల వ్యతిరేకత పెరిగిపోయే ప్రమాదం ఉంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో, ప్రత్యేకించి లౌకిక రాజ్యంలో మతపరమైన వ్యాఖ్యలు, విద్వేషపూర్తి వ్యాఖ్యానాలు నిషిద్ధం. బిజెపి నేతల తీరుపై సిపిఎం చేసిన ఫిర్యాదును ఇసిఐ సీరియస్‌గా తీసుకోవాలి. నామమాత్రపు చర్యలతో సరిపుచ్చకుండా, నిబంధనలను అనుసరించి కఠినంగా వ్యవహరించాలి. అప్పుడే దేశంలో ప్రజాస్వామ్య మనుగడ సాధ్యమవుతుంది.

## ఖర్గే ఫొటోలకు నల్ల ఇంకు..



పశ్చిమ బెంగాల్‌లో రాష్ట్ర కాంగ్రెస్‌కు, పార్టీ అధినాయకత్వానికి మధ్య అభిప్రాయభేదాలు పెరుగుతున్నట్టు కనిపిస్తున్నది. తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) అధినేత్రి, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు అధీర్ రంజన్ చౌదరి విమర్శించిన విషయం తెలిసిందే. 'ఇండియా' కూటమి గెలిస్తే, ప్రభుత్వంలో చేరకుండా, బయట నుంచి మద్దతునిస్తామని మమత ప్రకటించడాన్ని కూడా ఆయన తప్పుపట్టారు. అయితే, అది చౌదరి వ్యక్తిగత అభిప్రాయమని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే స్పష్టం చేయడంపై, పశ్చిమ బెంగాల్‌లో పార్టీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఈ క్రమంలోనే కోల్‌కతాలోని పార్టీ కార్యాలయం పెట్టిన హోర్డింగ్స్‌లో ఖర్గే ఫొటోలకు కొంత మంది గుర్తుతెలియని వ్యక్తులు నల్ల ఇంకు పులిమారు. అంతేగాక, ఒక పోస్టర్‌పై 'తృణమూల్ కాంగ్రెస్ ఏజెంట్' అంటూ ఖర్గే ఫొకో కింద రాశారు. ఇంతకీ ఇది కాంగ్రెస్ కార్యకర్తలు చేసిన పనా లేక టిఎంసి లేదా బిజెపి వర్గాలు ఆ పార్టీలో విభేదాలు సృష్టించేందుకు చేసిన ప్రయత్నమా అన్న అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

## మాటకు మాట..



ఎన్నికల వేళ, రాజకీయ నేతల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. ముఖ్యంగా బిజెపి, కాంగ్రెస్ నాయకులు నవ్వా? నేనా? అన్న చందంగా మారింది. ప్రత్యేకించి, ఐదో విడతలో పోలింగ్‌కు వెళుతున్న అమేథీ, రాయ్‌బరేలీ నియోజకవర్గాల్లో నేతలు మాటకు మాట అనుకుంటూ, ఎన్నికల వేడిని పెంచుతున్నారు. ఇటీవల రాయ్‌బరేలీలో జరిగిన ఒక భారీ ర్యాలీలో పాల్గొన్న బిజెపి సీనియర్ నాయకుడు, కేంద్ర హోం మంత్రి అమిత్ షా మాట్లాడుతూ గాంధీ కుటుంబానికి ఎన్నికల సమయంలోనే అమేథీ, రాయ్‌బరేలీ గుర్తుకొస్తాయని విమర్శించారు. గత ఎన్నికల్లో రాయ్‌బరేలీ నుంచి గెలిచిన సోనియా గాంధీ తిరిగి అటువైపు చూడలేదని ధ్వజమెత్తారు. అంతకు ముందు అమేథీ నియోజకవర్గానికి ప్రాతినిథ్యం వహించినప్పుడు రాహుల్ గాంధీ కూడా నియోజకవర్గానికి వచ్చిన దాఖలాలు లేవు అన్నారు. 'గత ఎన్నికల్లో రాయ్‌బరేలీ నుంచి గెలిచిన సోనియా, ఆమె కుటుంబ సభ్యులు ఎన్నిసార్లు ఇక్కడికి వచ్చారు?' అని ప్రశ్నించారు. 'సోనియాకు ఆరోగ్య సమస్యలు ఉన్నాయి. కానీ, రాహుల్, ప్రియాంకలకు ఏమైంది? కొన్నేళ్లుగా ఇక్కడ అనేక దురదృష్టకరమైన ఘటలు జరిగినప్పుడు కూడా వారు స్పందించలేదు' అంటూ ధ్వజమెత్తారు. థాయిలాండ్‌కు వెళ్లేందుకు సమయం ఉన్న ప్రియాంకకు, రాయ్‌బరేలీకి రావడానికి లేదా? అని అడిగారు. ఈ వ్యాఖ్యలకు ప్రియాంక అంతే ఘాటుగా సమాధానమిచ్చారు. 'ప్రతిపక్ష పార్టీల నాయకులు, ముఖ్యంగా మహిళల కార్యకలాపాలను అమిత్ షా పర్యవేస్తున్నారు' అని మండిపడ్డారు. ఎవరు, ఎప్పుడు, ఎక్కడ ఉంటారు? ఏం చేస్తారు? అనే వివరాలు సేకరించడమే పనిగా పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. తాను థాయిలాండ్ వెళ్లిన మాట వాస్తవమేనని అన్నారు. తన కుమార్తెను చూసేందుకు వెళ్లానని, అయితే, ఆ విషయం అమిత్ షాకు ఎలా తెలిసిందో అర్థం కావడం లేదని అన్నారు. తన వ్యక్తిగత అంశాల్లో జోక్యం చేసుకోవడం ఎందుకని ప్రియాంక ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలకి వస్తే, దేశ ఆదాయం, సంపదను 'ఎక్కువ మంది పిల్లలు ఉండే' ముస్లిం మైనారిటీలకు దోచిపెడుతుందని, చివరికి హిందూ మహిళలు మంగళ సూత్రాలు కూడా అమ్ముకోవాల్సి వస్తుందని ప్రధాని నరేంద్ర మోడీ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఈ అంశాన్ని పలు సమావేశాల్లో లేవనెత్తి, ప్రధానిపై విమర్శలు గుప్పించారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో ప్రధాని వివరణ రూపంలో సవరణ చేసుకోక తప్పలేదు. తాను అధిక సంతానం గురించి మాట్లాడినట్టు చెప్పారు. ముఉస్లింల పేరును ఎక్కడా ప్రస్తావించలేదన్నది ఆయన వివరణ సారాంశం. ఏదిఏమైనా, ఏడు దశల్లో జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల్లో ఇప్పటికే నాలుగు విడతల పోలింగ్ పూర్తి కాగా, మిగతా మూడు పర్యాయాలు జరగాల్సి ఉంది. దాదాపు అన్ని పార్టీల నాయకులు విమర్శలు, ప్రతివిమర్శల్లో మునిగితేలుతున్నారు.

## 'ఇందూరు'నేతల్లో క్రాస్ ఓటింగ్ భయం

### మైనారిటీలు, రైతులు, మెజారిటీ మహిళలు 'చేతి'కి చిక్కారని ఆశా!

**ప్రజాపక్షం / జగిత్యాల ప్రతినిధి :** నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో పోటీచేసిన జాతీయ పార్టీల అభ్యర్థిలకు క్రాస్ ఓటింగ్ భయం పట్టుకుంది. అయితే క్రాస్ ఓటింగ్ మాకే కలిసి వస్తుందన్న ధీమాతో ఇరు పార్టీల నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్న.. లోలోపల మాత్రం ఎవరి కొంప ముంచనుందోనని ఆందోళనలో ఉన్నారు. బిజెపి నుండి సిట్టింగ్ ఎంపి ధర్మపురి అర్వింద్, కాంగ్రెస్ నుంచి పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి, బిఆర్ఎస్ నుంచి బాజిరెడ్డి గోవర్ధన్‌లు పోటీపడ్డారు. అయితే వీరు ముగ్గురు మొన్నటి శాసనసభ ఎన్నికల్లో పోటీచేసి ఓడినవారే కావడం మూడు పార్టీల నుంచి రాజకీయ ఉద్దండులనే పోటీలో నిలిపాయి. ఇంత వరకు భాగానే ఉన్నా రాష్ట్రంలో బిఆర్ఎస్ అధికారం కోల్పోవడం, అవినీతి, అక్రమాలు ఒక్కొక్కటి బయటపడడంతో పాటు నిజామాబాద్ జిల్లాలో అన్ని తానై చక్రం తిప్పిన ఇందూరు మాజీ ఎంపి, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత లిక్కర్ కేసులో జైలుకెళ్లడం వంటివి కలిసిరాకపోవడం మూలంగా ఈ నెల 13న జరిగిన పోలింగులో బారాస ఎలాగూ ఒడిపోతామని చేతులెత్తేయగా కాంగ్రెస్, బిజెపి మధ్య పోటీ నెలకొనగా ఎలాగూ కాంగ్రెస్‌ను నిలువరించేందుకే చివరి నిమిషంలో బిజెపికి అమ్ముడుపోయి క్రాస్ ఓటింగ్ చేశారని కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నారు. ఇక్కడ మైనార్టీలు, రైతులు, గల్ఫ్ కార్మికుల కుటుంబాలు, బీడీ కార్మికులతో పాటు మహిళలు ఎక్కువ సంఖ్యలో పోలింగులో పాల్గొనగా మహిళల ఓట్లే గెలుపు, ఓటమికి కీలకంగా మారనున్నాయి. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని 7అసెంబ్లీ సెగ్మెంట్లలో17 లక్షలకు. పైగా ఓటర్లు ఉండగా12 లక్షలకు పైగా ఓట్లు పొలయ్యాయి. ఇందులో 6.5 లక్షలకు పైగా మహిళలు ఓటు వేయగా పురుషులు 5.5లక్షల మంది ఓటింగులో పాల్గొనగా సుమారు లక్ష ఓట్లకు పైగా మహిళలు ఓటుహక్కు వినియోగించుకున్నారు. అయితే యువత, మహిళలు 'కాపు' సామాజిక వర్గం, పసుపు బోర్డు ప్రకటనతో రైతులు, రామ మందిర నిర్మాణంతో మెజార్టీ హిందువులు బిజెపికి మొగ్గు చూపారని, అలాగే బారాస క్రాస్ ఓటింగ్ బిజెపికి అనుకూలించిందని బిజెపి అభ్యర్థి, నాయకులు గెలుపుపై ధీమాను వ్యక్తం చేస్తున్నారు. పార్టీ నాయకులతో పోలింగ్ సరళి, సమీక్షలు చేసి రెండవసారి అర్వింద్ గెలుపు ఖాయమని బిజెపి శ్రేణులు అంచనాకు వచ్చారు. ఎస్సి, ఎస్టీ, క్రిస్టియన్లు, ఇతర సామాజిక వర్గాల ఓట్లు మాకంటే మాకని బిజెపి, కాంగ్రెస్ నేతలు లెక్కలు వేసుకుంటున్నారు.ఈ పార్లమెంట్ పరిధిలో మూతపడ్డ ముత్యంపేట చక్కెర ఫ్యాక్టరీని పునఃప్రారంభం చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కమిటీ వేసి, బకాయిలను విడుదల చేయడంతో రైతులు కాంగ్రెస్ వైపు మొగ్గుచూపరని ఆ పార్టీ నాయకులు భావిస్తున్నారు. గల్ఫ్ కార్మికులను బిజెపి, బారాస ప్రభుత్వాలు పట్టించుకోలేదని రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక గల్ఫ్‌లో చనిపోయిన కుటుంబాలకు 5లక్షలు ఇవ్వడం, గల్ఫ్ బోర్డు ఏర్పాటు చేయడం, బీడీ కార్మికులకు కటాఫ్ లేకుండా కొత్తగా పీఎఫ్ ఉన్న 4 వేల పింఛన్ ఇస్తామని,3 వేలు మంజూరు పెంచడం వంటి హామీలు 'చేతు'కు కలిసి వచ్చాయని ,మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 500.లకే సిలిండర్ ఇస్తున్నామని, మహాలక్ష్మి కింద పింఛన్ కు అర్హతలేని వారికి 2500 ఇస్తామన్న మాకే వేశారంటూ కాంగ్రెస్ నేతలు లెక్కలు వేసుకుంటున్నా రు. అలాగే ఇక్కడ మైనార్టీ ఓట్లు ఈసారి కీలకంగా మారనున్నాయి. బిజెపి హిందువాదాన్ని తెరపైకి తేవడంతో కాంగ్రెస్ పార్టీకే మైనార్టీలు ఓట్లు వేశారని కాంగ్రెస్ భావిస్తోంది.అయితే బారాస అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అనుభవమున్న నాయుడితో పాటు కాపు సామాజిక వర్గానికి చెందిన బలమైన నాయకుడే అయినప్పటికీ రాష్ట్రంలో అధికారం కోల్పోవడం, ఎమ్మెల్సీ కవిత లిక్కర్ కేసులో జైలుకు వెళ్లడం, ఈపార్టీ ఓట్లు క్రాస్ కావడం వంటి కారణాలు బారసాను వెనుకంజలో పడేశాయి. జూన్, 4 వరకు వేచి చూడాల్సిందే మరి.

## పట్టభద్రుల ఆశయాలు, హక్కుల కోసం పనిచేస్తాం

### నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీర్మాన్ మల్లన్న, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేటప్రతినిధి:** మొదటిసారిగా కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ జెండా ఎగురవేస్తామని నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీర్మాన్ మల్లన్న, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సుమంగళి ఫంక్షన్ హాల్‌లో శాసనమండలి పట్టభద్రుల ఎన్నికల సమావేశంలో మాట్లాడారు. గత పది సంవత్సరాల కాలంలో ప్రజలను హింస్తిస్తున్న ప్రభుత్వ పాలకులపై కొట్లాడి ప్రభుత్వాన్ని గద్దె దించేవరకు పోరాడిన వ్యక్తిని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసిన ప్రతిసారి మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి వెన్నుతట్టి నిలిచారన్నారు. ఇప్పుడు జరిగేది మేధావుల ఎన్నిక కాబట్టి రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లు రద్దు చేసే పార్టీ వాళ్లు వస్తున్నారు, మరో పక్క అదే పార్టీకి సపోర్టు చేసే పార్టీ వాళ్లు వస్తున్నారు. తస్మాత్ జాగ్రత్త అలాం టి వాళ్లకు తగిన గుణ పాఠం చెప్పాలన్నారు. ఇండియా కూటమి రాజ్యాంగా న్ని, పేదప్రజలను రక్షించే కూటమని, సూర్యాపేటలో వార్ వన్‌సైడ్ మాత్రమే ఉండాలని కోరారు. కెసిఆర్ మీద ప్రజల కోసం కోట్లాడితే నా కుటుంబంపైన చిత్రహింసలు గురిచేసారన్నారు. ఈరోజు అదే పరిస్థితి కెసిఆర్ కుమార్తెకు రా లేదా అని హెచ్చరించారు. ఇదే సూర్యాపేటలో మంత్రి రెండు డిసిఎంలలో జ నాలను పంపించి నా ఆఫీస్‌పై దాడి చేయించారు. అలాంటి వాళ్లను శ్రీకృష్ణ జన్మభూమికి పంపించే రోజులు దగ్గరపడ్డాయని గుర్తించుకోవాలన్నారు. కెసిఆర్ ఉద్యోగులకు 317 జీవో తీసుకవచ్చి భార్యాపిల్లల్ని దూరం చేశారు. గత ప్రభుత్వం వేసిన నోటిఫికేషన్‌లలో గ్రూప్ 1,2,4, ఎస్‌ఎస్‌సి, ఇంజనీరింగ్ కోర్సులలో అన్నింట్లో స్కాములు జరిగాయని, 30వేల ఉద్యోగాలు కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ఆర్డర్ కాపీ ఇచ్చి సీట్లో కూర్చోబెట్టిన ఘనత కాంగ్రెస్ పార్టీకి ఉందన్నారు. ఉద్యోగుల సిపిఎస్ విధానాన్ని తొలగించి జిపిఎస్ విధానం తీసుకవస్తామని, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేరుస్తుందని, రెండు లక్షల ఉద్యోగాలు వేస్తామని తెలిపార. పేదవాడికి కష్టం రాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పేదవాళ్ల తరపున ఉం టుందని, ఉద్యోగులకు చెల్లించాల్సిన డిఎలు తప్పకుండా చెల్లించే విధంగా కృషి చేస్తామన్నారు. అనంతరం మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ వార్ వన్ సైడ్, తీన్మార్ మల్లన్నకు సంపూర్ణ మద్దతు ఉంటుందని సూర్యాపేట జిల్లాలోని అన్ని ఓట్లు తీన్మార్ మల్లన్నకు పడేవిధంగా చూస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడు పట్టభద్రుల వైపు ఉంటుందని తెలిపారు. గత ప్రభుత్వం మీద ఎన్ని అడ్డంకులు వచ్చిన కానీ పోరాడే ప్రశ్నించే గొంతుకు తీన్మార్ మల్లన్నను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామన్నారు. గెలిచిన తరువాత విజయోత్సవ ర్యాలీ మొట్టమొదట సూర్యాపేటలోనే ఉంటుందని తెలిపారు. ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేసి తీన్మార్ మల్ల న్న గెలుపు కోసం కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్, మాజీ ఎమ్మెల్యేలు దోసపాటి గోపాల్, చకిలం రాజేశ్వరరావు, ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, పిసిసి సభ్యులు కొప్పుల వేనారెడ్డి, రాష్ట్ర ఎస్సీసెల్ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం, సిపిఎం నాయకులు మల్లు లక్ష్మి , మల్లు నాగార్జునరెడ్డి,అంజద్ అలీ, ధరావత్ వీరన్ననాయక్, సురేష్‌రావు, కాకి కృపాకర్‌రెడ్డి, కేక్కిరణి శ్రీనివాస్, దామిడి రమేష్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో గెలుస్తున్నాం

### ఓటర్లు అన్నీ ఆలోచించి ఓటేయాలి
### చేసిన అభివృద్ధి చెప్పుకోకపోవడంతోనే ఓటమి
### ప్రభుత్వ ఉద్యోగుల్లో వ్యతిరేకత
### మాజీ మంత్రి కెటిఆర్



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రాఖేష్‌రెడ్డి గెలుస్తున్నారని మాజీ మంత్రి కె.తారక రామారావు అన్నారు. ఆదివారం భువనగిరిలోని సాయి కన్వెన్షన్ హాల్‌లో బిఆర్ఎస్ పార్టీ భువనగిరి నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం మాజీ ఎమ్మెల్యే పైళ్ళ శేఖర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ రాష్ట్రంలో చేసిన అభివృద్ధి ప్రజలకు చెప్పుకోలేకపోయామన్నారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగుల్లో కూడా వ్యతిరేకతతో ఒక వర్గాన్ని దూరం చేసుకున్నట్లు చెప్పారు. రాకేష్‌రెడ్డి స్వయంకృషితో పైకి వచ్చాడని, హైలి ఎజెకెటెడ్ వ్యక్తి రాకెష్‌రెడ్డి అన్నారు. మోడీ అన్ని వర్గాలను మోసం చేస్తూ వస్తున్నడని, విభజన హామీలను తుంగలో తొక్కారన్నారు. యాదాద్రి ఆలయాన్ని కెసిఆర్ అద్భుతంగా నిర్మించారని, మరి బిజెపి వాళ్ళు గుడి కట్టి ఓట్లు అడుగుతున్నారన్నారు. కాళేశ్వరం లాంటి ఎన్నో ప్రాజెక్టులు నిర్మించామని, కెసిఆర్ పాలనలో తెలంగాణ అన్ని రంగాల్లో నంబర్ 1స్థానంలో నిలిచిందన్నారు. ఉమ్మడి నల్గొండలో మూడు మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేశామని, యాదాద్రి పవర్ ప్లాంట్ నిర్మించామన్నారు. చేసిన పని సరిగా చెప్పుకోలేక పోయామని, అందుకే ఓటమి పాలయ్యామన్నారు. మా పాలనలో రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేసినా స్వల్ప తేడాతో ఓటమి చెందామన్నారు. రుణమాఫీపై కాంగ్రెస్ పూటకో మాట మారుస్తుందని, 420 హామీలను ఇచ్చి అన్నింటిని కాంగ్రెస్ మర్చిపోయిందన్నారు. ప్రశ్నించే గొంతుక రాకేష్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. 30 వేల ఉద్యోగాలను కెసిఆర్ భర్తీ చేస్తే, వాటి జాయినింగ్ లేటర్లు పంచుతూ రేవంత్‌రెడ్డి సొంత డబ్బా కొనట్టుకుంటున్నాడన్నారు. ఇది సిగ్గుచేటు, రేవంత్‌రెడ్డివి పచ్చి అబద్ధాలు అన్నారు. మన రాకేష్‌రెడ్డి విద్యావంతుడని, అటు వైపు ఉన్న ప్రత్యర్థి పచ్చి బ్లాక్ మైలర్, సొల్లు కబుర్లు చెప్పే మోసగాడన్నారు. అలాగే మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంతకండ్ల జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ ఈ దేశంలో బిజెపి పార్టీ వచ్చిన తర్వాత నిరుద్యోగం పెరిగిపోయిందన్నారు. పక్క దేశం పాకిస్థాన్ భిక్షమేతుకునే విధంగా చేశానని మోదీ అనడం ఎంతవరకు సమంజసం అన్నారు. మన దేశంలో ఒక్క పూట భోజనం చేస్తున్నారనేది మోదీకి గుర్తు రాదా అన్నారు. రాముడి పేరుతో మోదీ దేశ ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. ఆగస్టు 15 వరకు అన్ని ఎన్నికలను పూర్తి చేసి ప్రజలను మరోసారి గెలవాలని చూస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. అలాగే బిఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాఖేష్‌రెడ్డి మాట్లాడుతూ పట్టభద్రులు ఆలోచించి ఓటు వేయాలని, తమ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో జెడ్పిచైర్మన్ ఎలిమిటినేటి సందీప్‌రెడ్డి, బిఆర్ఎస్ ఎంపి అభ్యర్థి క్యామ మల్లేశ్, మాజీ రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్, రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, గెల్లు శ్రీనివాస్, కొలుపుల అమరేందర్, మాజీ మున్సిపల్ చైర్మన్ అంజనేయులు, పట్టణ అధ్యక్షులు ఎవి కిరణ్ కుమార్, మండల అధ్యక్షుడు జనగాం పాండు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కొనపురి కవిత, జిల్లా నాయకులు పుట్ట వీరేష్ యాదవ్, కంచి మల్లయ్య, ఏ.సురేష్ యాదవ్, మాజీ సర్పంచ్‌లు, నాయకులు, పట్టభద్రులు పాల్గొన్నారు.

## అభివృద్ధిని చూసి గెలిపించండి

### మీట్ ది ప్రెస్‌లో బిజెపి అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి :** కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని చూసి పట్టబద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో తనను గెలిపించాలని వరంగల్, ఖమ్మ, నల్గొండ జిల్లాల పట్టబద్రుల నియోజకవర్గ బిజెపి అభ్యరర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి కోరారు. ఆదివారం హన్మకొండలోని గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో ప్రేమేందర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. వరంగల్, ఖమ్మ, నల్గొండ జిల్లాల పరిధిలో బిజెపికి ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు లేకున్నా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు చేపట్టిందన్నారు. ముఖ్యంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ స్థానంలో వ్యాగన్ ఫ్యాక్టరీ, మెగా టెక్స్‌టైల్ పార్కు, ములుగులో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు, ప్రఖ్యాత రామప్పకు యునెస్కో గుర్తింపుకై కృషి, పర్యాటక ప్రాంతాల అభివృద్ధి లాంటి పలు పనులను చేపట్టడం జరిగిందని, అలాగే ఈ ప్రాంతంలో వేల కోట్లతో జాతీయ రహదారుల నిర్మాణం రైల్వే స్టేషన్ల ఆదునీకరణ లాంటి పనులను చేపట్టడం జరిగిందన్నారు. వరంగల్, ఖమ్మ, నల్గొండ జిల్లాల పరిధిలో బిజెపికి ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు లేకున్నా ఎన్నో పనులు చేసిన మోదీ ప్రభుత్వం, తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టే అవకాశం ఉంటుందని తెలిపారు. రాష్ట్రంలో గత ప్రభుత్వ హయాంలో నిరుద్యోగులు, జీవో 317తో ఉద్యోగులు ఎన్నో ఇక్కట్లు ఎదుర్కొన్నారని, వలస వాదుల పాలన కంటే ఎక్కువగా దగా చేసిన బిఆర్ఎస్‌ను గత ఎన్నికలలో గద్దె దించి కాంగ్రెస్ హామీలను నమ్మి ప్రజలు ఓటు వేస్తే ఐదు నెలలలోనే కాంగ్రెస్ ఇచ్చినవి గ్యారెంటీలు కదని, గారడీలని తేలిపోయిందని అన్నారు. వరంగల్, ఖమ్మ, నల్గొండ జిల్లాల పట్టబద్రుల నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తే ప్రభుత్వంపై గొంతెత్తి పోరాటం చేయలేరని, బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు అంతా రేపు పార్లమెంట్ ఫలితాల తరువాత కాంగ్రెస్‌లోకి వెళ్లే అవకాశం ఉన్నందున బిఆర్ఎస్ మద్దతు ఇచ్చే అభ్యర్థిని గెలిపించినా ఉపయోగం ఉండదని చెప్పారు. గత పట్టబద్రుల నియోజకవర్గ ఎన్నికలలో తాను పోటీ చేస్తే 40వేలకు పైగా ఓట్లు వచ్చాయని, ఈసారి తనను ఆదరించి గెలిపించాలని కోరారు. ఈ మీట్ ది ప్రెస్ కార్యక్రమానికి గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు అధ్యక్షత వహించగా ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బోళ్ల అమర్, టియుడబ్ల్యూజె జిల్లా అధ్యక్షులు గడ్డం రాజిరెడ్డి, టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.దయాసాగర్ పాల్గొన్నారు.

# సాహితీ విహారి

# చిన్న కథల పెద్ద రచయిత్రి ఆలిస్ మన్రో

సరిగ్గా వారం రోజుల క్రితం, ఈనెల 13న సాహితీ ప్రియులకు భౌతికంగా దూరమైన ప్రఖ్యాత కెనడియన్ రచయిత్రి ఆలిస్ మన్రో ఒక గొప్ప రచనా శైలిని వారసత్వంగా అందించింది. మన కాలంలోని గొప్ప రచయితలలో ఒకరిగా ఆమె పేరు చిరస్థాయిగా నిలిచి ఉంటుంది. ఆమె సాహిత్య రచనలు మానవ స్వభావంపై లోతైన అంతర్దృష్టితో, అనేక రకాల భావోద్వేగాలను రేకెత్తించే సామర్థ్యంతో ఉంటాయి. అందుకే, మన్రో ప్రతి రచనా ప్రపంచ వ్యాప్తంగా పాఠకులను ఆకర్షించింది. ఆమెది ఒక ప్రత్యేకమైన కథా శైలి, వివరాలపై ఆమె శ్రద్ధ, సంక్లిష్టమైన ఇతివృత్తాల అన్వేషణ ఆమె సాహిత్యాన్ని అజరామరం చేశాయి. అసాధారణమైనవిగా గుర్తింపు పొందాయి. నోబెల్ సాహితీ పురస్కారం అందుకోవడం ఆమె ప్రతిభకు నిదర్శనం. వాస్తవికత ఉట్టిపడుతుంది కాబట్టే, ఆమె సాహిత్యం విస్తృత ప్రచారానికి నోచుకుంది. పాత్రలను సృష్టించడంలో ఆమెకు ఆమే సాటి. ఆమె పాత్రలు కేవలం వ్యంగ్య చిత్రాలు కాదు... సంక్లిష్టమైన భావోద్వేగానికి ప్రతీకలు. ఆ పాత్రల్లో అంతులేని ఆత్మవిశ్వాసం కనిపిస్తుంది. అదే సమయంలో లోపాలు కూడా దర్శనమిస్తుంది. చాలా మంది రచయిత్రుల మాదిరి ఆమె కథలోకి చొచ్చుకుపోదు. పాత్రలపై ఆజమాయిషీ చేయదు. పాత్ర లోతుల్లోకి వెళ్లిపోతుంది. ఆ పాత్రలే కథను నడిపిస్తాయి. పాత్ర లక్షణాలను, గుణాలను రచయిత్రి బలవంతంగా మార్చిన దాఖలాలు కనిపించవు. అందుకే ప్రతి పాత్రా సజీవంగా గోచరిస్తుంది. చదువుతున్నంత సేపూ మన ముందు కదలాడుతుంది. అత్యధిక శాతం మంది పాఠకులు ఆ పాత్రలన్నీ నిజ జీవితంలో ఉన్నాయనే అనుకుంటారు. అంతటి సహజత్వం ఉంటుంది. మన చుట్టూ ఉన్న సమాజాన్ని మన్రో కొత్తగా చూపిస్తుంది. ఆమె రచనలు ఎంత సాధారణమైనవిగా కనిపిస్తాయో అంత అసాధారణమైనవి. ఎంతటి సహజత్వాన్ని కలిగి ఉంటాయో, అంతటి వైవిధ్యాలను ప్రదర్శిస్తాయి. ఆ పాత్రల పోరాటాలతో పాఠకులు తాదాత్మ్యం చెందుతారు. నిజ జీవితాన్ని ఆపాదించుకొని, విజయ గర్వంతో ఊగిపోతారు. మన్రో పాత్రలు జీవిత హీరోలు లేదా విలన్ల కంటే పెద్దవి కావు. కానీ, ఆ పాత్రలన్నీ జీవితంలోని సంక్లిష్టతలను ప్రతిబింబిస్తాయి. పాఠకుల మనస్సుల్లో తిష్టవేస్తాయి. అందుకే, ఆమె కథలు చదువుతున్నంత సేపూ, పాఠకుడు ఆ పాత్రలతో కలిసిపోతాడు. వారి విజయాల్లో ఆనందిస్తారు. కథకులు చాలా మందే ఉంటారు. కానీ, అద్భుతమైన శైలిని సొంతం చేసుకొని, తనకంటూ ఒక ప్రత్యేకతను ఏర్పరచుకున్న వారు చాలా అరుదు. అలాంటి అతి తక్కువ మందిలో మన్రో ముందు వరుసలో నిలుస్తుంది. ఆమె కథా శైలి అద్భుతం. చిన్న కథలతోనే లోతైన భావాలను చెప్పడంలో ఆమెకు తిరుగు లేదు. ఆమె కథలు సూక్ష్మంగానూ, సూటిగానూ ఉంటాయి. చాలా సున్నితమైన కథనాల వ్యక్తీకరణలో ఆమె రారాణి. మన్రో తరచుగా మానవ సంబంధాల సంక్లిష్టతలను అన్వేషిస్తుంది. ప్రేమ, నష్టం, వాంఛల చిక్కులను పరిశోధిస్తుంది. అంత లోతైన అవగాహనతో రాస్తుంది కాబట్టే, ఆమె కథలు సరళంగా ఉండవు. ఆమె కథల్లోని ప్రతి ఒక్కరూ తరచూ ప్రస్తుత కాలానికి ముందు లేదా వెనక్కు దూకుతూ ఉంటారు. వారి ఆలోచనలను పసిగట్టడం చాలా కష్టం. అయితే, వేగంగా నిర్ణయాలు లేదా ఆలోచనలు మార్చుకునే తత్వం చాలా మందిలో ఉంటుంది. నిన్న మంచి అనుకున్నది నేడు చెడుగా కనిపించడం కొత్తకాదు. అదే విధంగా నిన్న చెడు అనుకున్నది నేడు మంచిగా గోచరించవచ్చు. ఫలానా సమయంలో ఫలానా పని చేయకుండా ఉండాల్సింది లేదా ఫలానా నిర్ణయం తీసుకొని ఉండాల్సిందని అనుకోని మనిషి ఉండరు. చాలా గొప్పగా, ఎంతో ఆలోచించి మరీ తీసుకున్నామనుకున్న నిర్ణయాలే, తర్వాతి కాలంలో పొరపాట్లుగా మారి వెక్కిరిస్తుంటాయి. ఈ ఆలోచనలకు వయసుతో సంబంధం లేదు. ఇప్పుడు చాలా విషయాలు తెలుసునని, గతంలో అనుభవం లేకపోవడం వల్లే పొరపాటు నిర్ణయాలు తీసుకున్నామని అనుకోని వారు దాదాపు లేరు. ఇప్పుడు తీసుకున్న నిర్ణయం గురించి భవిత్తులో ఇదే విధంగా అనుకుంటాం. ఈ సంఘర్షణ ప్రతి మనిషిలో ఉంటుంది. మన్రో పాత్రల్లోనూ ఈ ఘర్షణలు కనిపిస్తాయి. అందుకే, ఆమె కథలు మనల్ని మనకు కొత్తగా పరిచయం చేస్తాయి. అనుభవాలను కలంలో నింపుకొని, ఆలోచనలతో నగిషీ చెక్కిన అక్షరాలు.. పదాలు.. వాక్యాలు పాఠకులను పరుగులు పెట్టిస్తాయి. మునివేళ్లపై నిలబెడతాయి. అందుకే, ఇంతకు ముందు చెప్పినట్టు ఆ పాత్రల విజయాన్ని పాఠకుడు తన గెలుపుగా ఊహించుకొని పొంగిపోతాడు. మన్రో కథన నిర్మాణాలు కూడా విలక్షణంగానూ, విప్లవాత్మకంగానూ ఉంటాయి. అవి సాంప్రదాయ కథన నిర్మాణాలను సవాలు చేస్తాయి. పాఠకులకు తాజాగా, వినూత్నంగా, సరికొత్త పఠన అనుభవాన్ని అందిస్తాయి. అన్వేషణ అనేది ఆమె కథల్లో అంతర్భాగం. ఏ విషయాన్నీ ఆమె తేలిగ్గా తీసుకోదు. ఏ పాత్రనూ అర్థాంతంగానో, అసంపూర్ణంగానో విడిచిపెట్టదు. పాత్రల పరిపూర్ణతే మన్రో కథలకు ప్రాణం. ఆమె తన కథాల్లో లింగ వివక్షను నిలదీసింది. ఆధిపత్య ధోరణులను ప్రశ్నించింది. కుటుంబ సంబంధాలను గుర్తి చేసింది. జీవితంలోని ప్రతి మలుపునూ పరిశీలించింది. మనసులను చదివింది. మనిషిని మనిషిగా ఆవిష్కరించింది. తల్లీకూతుళ్ల సంబంధాలుగానీ, భార్యాభర్తల అనుబంధాలుగానీ, మన్రో కథలకు ముడిసరుకే. వాటి ద్వారా ఆమె ఎన్నో విషయాలను మానవీయ కోణం చూసింది. సమస్యలను చర్చించింది. పరిష్కరించింది. మన్రో కథలు ఎక్కువగా మహిళలు, వారి అనుభవాల చుట్టూ తిరుగుతాయి. పితృస్వామ్య సమాజంలో వారు ఎదుర్కొంటున్న ప్రత్యేక సవాళ్లపై వెలుగులు ప్రసరిస్తాయి. సామాజిక అంచనాల పరిమితులను ప్రస్తావిస్తూనే, పరిష్కారాలు కూడా సూచిస్తాయి. మహిళలు తమ సొంత ఆశలు, ఆశయాలను సాధించడానికి మార్గాలను మన్రో కథలు అన్వేషిస్తాయి. ఒక రకంగా చెప్పాలంటే, మన్రో సాహిత్యం లోతైన స్త్రీవాదం. ఆమె తన రచనల ద్వారా సాంప్రదాయ లింగ ప్రాధాన్యతలను ఎండగట్టింది. ఎదురు తిరిగింది. సవాలు చేసింది. జీవితంలోని సూక్ష్మ చిత్రణను కూడా ఆమె సాహిత్యం మనకు అందిస్తుంది. కుటుంబ సంబంధాల్లో తరచు ఎదురయ్యే సమస్యలను, చిక్కులను కూడా మన్రో తన కథల్లో పరిశోధించింది. ఆమె కథలోని హీరోయిన్లు ఎప్పుడూ కేవలం తన గురించి మాత్రమేగాక, తన తల్లిదండ్రులు, అక్కచెల్లెళ్లు, అన్నదమ్ములు, బంధు మిత్రుల ప్రగతిని కోరుకుంటారు. గతి శీలతను విశ్లేషిస్తారు. కుటుంబ చరిత్రకు వ్యక్తిగత గుర్తింపును తీసుకొచ్చే మార్గాలను అన్వేషిస్తారు. ఆమె కథల్లో తరచు అనేక తరాల ప్రతినిధులు కనిపించడం మరో ప్రత్యేకత. కొన్ని తరాల జీవితాలను, జీవన శైలిని, ఆలోచనా విధానాలను ఆమె ప్రోదిచేసి, కథల రూపంలో మనకు అందించింది. ప్రస్తుత జీవితాలపై గత సంఘటనల ప్రభావాన్ని ఆమె సాహిత్యం గుర్తించింది. కుటుంబ సంబంధాలను అన్వేషించడం ద్వారా, మన్రో తన పాత్రలకు రూపాన్నిస్తుంది. వర్తమాన్ని గతం ఏ విధంగా ప్రభావితం చేస్తుందో వివరిస్తుంది. ఆమె కథల్లో విస్తృతమైన భావోద్వేగాలను రేకెత్తించే సామర్థ్యం ఉంది. ఆమె కథలు మానవీయ అనుభవాల పూర్తి వర్ణపటాన్ని అన్వేషించే లోతైన, మానవీయ దృక్కోణాలు. ఆమె కథలు ఆనందం, దుఃఖం సమ్మిళనాలు. ఆశ, నిరాశ మధ్య కదిలిపోయే జీవన నావలు. అమె రచనలకు కత్తి కంటే పదును ఎక్కువ. ఆనందం, ఆవేదన పక్కపక్కనే ఉంటాయి. పాఠకులను సమ్మోహితులను చేస్తాయి. భావోద్వేగ మైదానాల్లో వ్యాహ్యాళికి తీసుకువెళతాయి. వాస్తవ, సాపేక్ష పాత్రలు మనతో దోబూచులాడతాయి. మన ఆలోచనల్లో తిష్టవేసుకొని కూర్చుంటాయి. కదలనని మొరాయిస్తాయి. మన్రో పాత్రలకు మాత్రమే ఆ శక్తి ఉంది. వాటి నడకపై మనకు ఆసక్తి పెరుగుతుంది. చదువుతున్నంత సేపు మనం పూర్తిగా ఆ కథలో లీనమై, అనుభూతులను ఆపాదించుకుంటాము. 2013లో సాహిత్యానికి మన్రో నోబెల్ బహుమతిని గెలుచుకున్నప్పుడు, కొంతమంది ఈ అవార్డును ప్రదానం చేసే స్వీడిష్ అకాడెమీ తన పారమితులను సడలించిందని విమర్శించిన వారు లేకపోలేదు. కానీ, అత్యధిక శాతం మంది ఆమెకు సరైన గుర్తింపు లభించిందంటూ ఆనందించారు.

మనస్ఫూర్తిగా అభినందించారు. 92 సంవత్సరాల వయసులో తుది శ్వాస తీసుకున్న మన్రో, కథా సాహిత్యంలో ఎప్పటికీ సజీవంగా ఉంటారు. ఆమె కథలకు మరణం లేదు. ఆమె సిద్ధాంతాలకు మరణం లేదు. ఆమె నడకకు, అందించిన స్ఫూర్తికి మరణం లేదు. భౌతికంగా లేకపోవచ్చుగానీ, కథల్లో కనిపిస్తునే ఉంటుంది. పాత్రల్లో పలకరిస్తునే ఉంటుంది. సంక్లిష్టమైన పరిస్థితుల్లో మార్గదర్శనం చేస్తునే ఉంటుంది. సాహిత్యం ద్వారా తనను తాను ఆవిష్కరించుకున్న మన్రో మృత్యుంజయురాలు.

**సత్యశ్రీ**




పాత్రల గమనంలో స్పష్టత మన్రో కలానికి ఉన్న ప్రత్యేకత. పాత్రను సృష్టించడంలో ఆమె ప్రదర్శించే సామర్థ్యం అనితర సాధ్యం. మనిషి ప్రవృత్తిని నిశితంగా అధ్యయనం చేస్తేగానీ అలాంటి పాత్రలను సృష్టించడం కష్టం. పాఠకుడి ఆలోచనల పొరల్లోకి చొచ్చుకె ళ్లి, తమ గురించి ఆలోచింపచేసే పాత్రలను మలచడంలో మన్రోకు ఉన్న నైపుణ్యం



అద్భుతం. అందుకే ఆమెను సాహితీ ప్రపంచంలో అందరూ ప్రేమిస్తారు. గౌరవిస్తారు. కథల లోకానికి మహారాజ్ఞిగా ఆరాధిస్తారు. నోబెల్‌ను గ్రహించడం వల్ల ఆమె కొత్తగా పొందిన ఘనత ఏమీ లేదు. బహుశా ఆమెను చేసి నోబెల్ సంతోషించి ఉంటుంది. ఈ అవార్డుకు, ఆమెను మించిన అర్హులు ఎవరున్నారు?

మన్రో కథల్లోని పాత్రలను, మాటలను ఎంతో మంది విశ్లేషకులు, వ్యాస రచయితలు ఎక్కడో ఒక చోట ఉదహరిస్తునే ఉంటారు. ఆమె కథలు అంతలా ప్రాచుర్యం పొందాయి. ఆమె అత్యంత ప్రసిద్ధ చిన్న కథల సంకలనాల్లో 'డాన్స్ ఆఫ్ ది హ్యాపీ షేడ్స్' ఒకటి. ఇది 1968లో గవర్నర్ జనరల్ అవార్డును గెలుచుకుంది. ఈ సేకరణ మన్రో యొక్క ప్రతిభను పూర్తిగా గ్రహించిన పాత్రలను సృష్టించడం కనిపిస్తుంది. మానవ ప్రవర్తనల్లో సూక్ష్మాతి సూక్ష్మమైన అంశాలు పాఠకులను ఆకట్టుకుంటాయి. ప్రతి కథలోనూ ఆమె తన పాత్రలను, ఆయా జీవితాలను పరిశోధించిన రీతిలో తీర్చిదిద్దింది. కుటుంబ గతిశీలత, జ్ఞాపక శక్తి, కాలక్రమేణ మార్పులు వంటి అంశాలను అన్వేషిస్తూ సాగే కథలు కేవలం ఆహ్లాదం కలిగించడమేకాదు.. పాఠకులను ఆలోచింప చేస్తాయి. ఆమె రచనల సేకరణల్లో మరో గొప్ప పుస్తకం 'డియర్ లైఫ్'. ఇది 2012లో ప్రచురితమైంది. మ్యాన్ బుకర్ ప్రైజ్‌కు నామినేట్ అయింది. ఈ సంకలనంలో, మున్రో మరోసారి చిన్న కథల రూపంలో తన రచనా నైపుణ్యాన్ని ప్రదర్శించింది. బలవంతాలు, భావోద్వేగాలు ఆ కథల్లో ఉంటాయి. జీవితంలో చేసే పొరపాట్లు, పశ్చాత్తాపాలు, ఆలోచనా సరళిలో చోటు చేసుకునే మార్పులను ఆమె తన పాత్రల ద్వారా అద్భుతంగా ఆవిష్కరించింది. భావోద్వేగ లోతులపై ఆమె దృష్టి అనంతం.

మన్రో కథలను చదివిన తర్వాత పాఠకుడు ఆలోచించకుండా ఉండలేడు. ప్రతి కథా ఒక విలక్షణమైన జీవితానుభవం నుంచి రూపుదిద్దుకున్నట్టు అనిపిస్తుంది. పాత్రలపై పాఠకులు కోపగించుకుంటాడు.. జాలి పడతాడు.. అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తాడు.. వెరసి ఆ కథల గురించి పదేపదే ఆలోచిస్తాడు.

## ఈ వారం కవితలు

### దాడి చేసిన వాన 'దద్దరిల్లిన నగరం'



మొన్న జూడు
భానుడి భగభగలు..
చెరిగిన నిప్పుల సెగలు
నిన్న జూడు వరుణుడి
కుండపోత వానలు
భాగ్యనగర అవస్థలు
ఎండైనా.. వానైనా.. ఏదైనా
అతివృష్టి.. అనావృష్టి
నగర జీవికి నరకమాయే
దంచి కొట్టిన వానకు నేడు
హైదరాబాద్ నగరమంతా
ఏ దారి చూసినా...
గోదారిని తలపించే..
ప్రధాన రహదారులు
పొంగిపొర్లి ప్రవహిస్తుంటే..
తప్పలేదు.. జనానికి ఎదురీత
వాన దాడికి నాలాలు కూలాయి
చెట్లు నేలరాలాయి..!
వానొచ్చిన ప్రతి సారి.. హైదరాబాద్కు పరేషానీ
పాలకుల లోపమా..! ప్రజలకిది శాపమా..!
నగర పాలకులారా.. ఇకనైనా మేలుకోండి..!

గడ్డమీది చంద్రమోహన్ గౌడ్
9866510399.

### గ్లోబల్ వార్నింగ్



మండుటెండల్లో వర్షపుభీభత్సాలు
వాతావరణంలో అర్థం కాని
పర్యావరణపు పరిహాసాలు
గ్లోబల్ వార్మింగ్ గట్టిగానే గర్జిస్తుంది..!
అదే నేడు గ్లోబల్ వార్నింగ్..!

ప్లాస్టిక్ ప్రపంచం మా 'నవ' ప్రాణాలతో
భవిష్యత్ తరాల తలరాతని ప్రశ్నిస్తుంది.
ధరణి తల్లి గుండె కాలుష్యపు విధ్వంసంలో
గుండెపోటుతో తల్లడిల్లుతుంది.

జలగళం మూగబోయి రెడ్ సిగ్నల్ తో
డేంజర్ సైగలు చేస్తుంటే....
మన తాతలకాలం నాటి చల్లని ప్రశాంత
గాలులు మనకు జ్ఞాపకాలయ్యాయి.
వడగాలులు, వడదెబ్బ చావులు వాట్సాప్
చాట్‌బాక్స్‌లో వర్తమానపు నిజాలయ్యాయి.
వినిపిస్తుందా వసంత కోయిల
ఆవేదన గానపు సందేశం..!
ఆకుపచ్చని కవిత్వం ప్రోత్సహిస్తే
ఆ చైతన్యమే ప్రకృతిని రక్షిస్తుంది
ఆకుపచ్చని చెట్లకు బ్రతుకునిస్తే..
న్యూటన్ గమన నియమపు ప్రతి చర్యగా
మన భవిష్యత్తును బ్రతకనిస్తుంది.

ఫిజిక్స్ అరుణ్ కుమార్
9394749536

### ప్లానెట్ వర్సెస్ ప్లాస్టిక్స్




పర్యావరణ పరిణామపు
ప్లాస్టిక్ కనువిప్పు
మన జీవన విధానాల్లో
మార్పు రాకపోతే
మానవ మనుగడ కు
కాలుష్యం తుప్పులా మారి
జీవజాతులకు ప్రాణ
ముప్పు కలుగుతుంది.

అభివృద్ధి చాటున
అవనిపై అడవులు
మన సమాజంలోని విలువల
మాదిరి అంతరించి పోతుంటే
రుతుపవనాల గమనాలు
గతితప్పి వాతావరణంలో
పెనుమార్పుల
మంటలను సృష్టిస్తున్నాయి.
ఆపలేక,ఆర్పలేక
ఆవిరైపోతుంది ఆధునాతనం.!

రెండు ప్రపంచ యుద్ధాల
పర్యవసానపు ఆనవాళ్ల
రక్తపు మరకల తడి ఆరకముందే...
మళ్ళీ ఫాస్ఫరస్ బాంబుల
మోత వర్షపాతంలా మన
గుండెల బండల మీద
ప్రకంపనాలుసృష్టిస్తున్నాయి.

భూగర్భ జలాలు ఇంకిపోతూ
గ్లోబల్ వార్మింగ్ విస్తరిస్తూ
ఆహారపు కొరతలు
పచ్చని చెట్ల కన్నీటి కోతలు
వడగాలుల వడదెబ్బపు
చావుల రాతలు
ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించలేని
మన నిర్లక్ష్యపు చర్యల సాక్ష్యంగా..
మనంతకు మనమే
ఓజోన్ పొరకు చిల్లులు పెడుతు
మరణశాసనాలను
లిఖిస్తుంటే..

భవిష్యత్ తరాలు
భద్రంగా వుండాలంటే
మనమంతా బాధ్యతగా
చేయి చేయి కలపాలి.
చెట్లను నాటడం, పెంచడమే
నవ ప్రపంచపు పథం కావాలి.
ప్రకృతి పరిరక్షణ నినాదమే
నేటి బ్రతుకు విప్లవపు
ప్రయాణం కావాలి.

ఫిజిక్స్ అరుణ్ కుమార్
నాగర్ కర్నూల్
9394749536

## అరుదైన ఫొటో



కలం యోధులు.. విప్లవ వీరులు (ఎడమ నుంచి కుడికి) జ్వాలాముఖి, నగ్నముని, మహాకవి శ్రీశ్రీ, నిఖిలేశ్వర్, చెరబండ రాజు. శ్రీశ్రీ మినహా మిగతా వారంతా దిగంబర కవులు. తెలుగు సాహితీ లోకంలో తరగని వెలుగులు. విప్లవ సాహిత్య వేగు చుక్క శ్రీశ్రీ గురించి ఎంత చెప్పినా తక్కువే.

# మొదటి గ్రంథాలయ మహాసభ సంఘస్థాపన



బెజవాడ (విజయవాడ)లోని రామమోహన ధర్మ పుస్తక భాండాగార కార్యకర్తలకు దేశంలోని గ్రంథాలయ నిర్వాహకులందరిని సమావేశ పరచాలనే చక్కని ఆలోచన 1914లో కలిగింది. ఆ ఏడాది ఏప్రిల్ 10 వతేదీన బెజవాడలో ప్రథమ ఆంధ్ర దేశ గ్రంథభాండాగారుల మహాసభను చిలకమర్తి లక్ష్మీ నరసింహ పంతులు అధ్యక్షతన ఏర్పాటు చేశారు. మహా సభ నిర్వహణతోనే ఆంధ్ర గ్రంథాలయోద్యమం ఆంధ్ర గ్రంథాలయ సంఘం ప్రారంభమయ్యాయి. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘ చరిత్రే ఆంధ్ర గ్రంథాలయోద్యమం. ఉద్యమ ప్రచారానికి ప్రజలను ఉత్తేజ పరచడానికి రాష్ట్ర వ్యాప్తంగా ఎందరో మహనీయులతో మహా సభలు జరిగాయి. ఇప్పటికి ఆంధ్ర ప్రదేశ్ గ్రంథాలయ మహా సభలు 40 జరిగాయి. ఇవి కాక మరెన్నో జిల్లా, తాలూకా మండలస్థాయి సభలు నిర్వహించారు. ప్రత్యేక సందర్భాల అవసరాన్ని బట్టి మరికొన్ని నిర్వహించారు. ఆ మహాసభకు గంజాం, విశాఖపట్నం, గోదావరి, కృష్ణ గుంటూరు, నెలూరు, కడప, కర్నూలు, బళ్ళారిజిల్లా, హైదరాబాదు సంస్థానంలోని సుమారు 60 గ్రంథాలయాల నుండి 200 మంది ప్రతినిధులు హాజరయ్యారు.

### తెలుగు నాట తొలి గ్రంథాలయం..

ఆంధ్రదేశంలో తొలి పౌర గ్రంథాలయాన్ని మంతిన ఆదినారాయణమూర్తి అనే ప్రాథమికోపాధ్యాయుడు 1886 వ సంIలో విశాఖపట్టణంలో నెలకొల్పినట్లు తెలుస్తుంది. ప్రారంభంలో ఒకరి ప్రోత్సాహంతోకాక ఎవరికివారు సంకల్పించుకొని, ఎక్కడికక్కడ కొన్ని గ్రంథాలయాలను నెలకొల్పారు. ఇలా 1905 నాటికి తెలుగునాట 20 గ్రంథాలయాలు లెక్కకు వచ్చాయి. అప్పట్లో వీరేశలింగం పంతులుగారి సంఘసంస్కరణోద్యమం, ఆంధ్రదేశంలో గొప్ప సంచలనాన్ని కలిగించిన వందేమాతరోద్యమం మనవారికి మాతృ భాషపై అభిమానాన్ని పురికొల్పింది. తత్ఫలితం పుస్తకాలు, పత్రికలు విరివిగా వెలువడ్డాయి. ఇవి కూడా గ్రంథాలయాల స్థాపనకు దోహదం చేశాయి. క్రమంగా గ్రంథాలయాల సంఖ్య పెరిగింది.

# 90 వసంతాల నవయువకుడు రస్కిన్ బాండ్

పరిచయం అవసరం లేని రచయిత రస్కిన్ బాండ్. నిన్న (ఈ నెల 19వ తేదీ, ఆదివారం) 90 వసంతాలు పూర్తి చేసుకున్న బాండ్ భారత అత్యుత్తమ రచయితల్లో ఒకడిగా పేర్కొంటారు. ఇటీవలే ప్రతిష్టాత్మక సాహిత్య అకాడమీ ఫెల్లోషిప్‌కు ఎంపికైన ఆయన మొదటి నవల 'ది రూమ్ ఆన్ ది రూఫ్' 1956లో ప్రచురితమైంది. ఆ రచనకు 1957లో జాన్ లెవెల్లిన్ రైస్ బహుమతి లభించింది. ఇప్పటి వరకూ 500 కంటే ఎక్కువ చిన్న కథలు, వ్యాసాలు , నవలలను రచించిన బాండ్, ఇప్పటికీ రచనా వ్యాసాంగంలో యువతరంతో పోటీ పడే తత్వాన్ని వదులుకోలేదు. ఆయన రచనల్లో పిల్లల కోసం రాసిన 69 పుస్తకాలు ఉన్నాయి. 1992లో డెహ్రాలో అవర్ ట్రీస్ స్టిల్ గ్రో కోసం ఆయనకు సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. అతను 1999లో పద్మశ్రీ, 2014లో పద్మభూషణ్ అవార్డులు అందుకున్నాడు. ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని ముస్సోరీలోని లందూర్‌లో తాను దత్తత తీసుకున్న కుటుంబంతో నివసిస్తున్నాడు. 1934, మే 19న బ్రిటిష్ ఇండియాలోని పంజాబ్ స్టేట్స్ ఏజెన్సీలోని కసౌలీలో జన్మించిన బాండ్ తండ్రి ఆబ్రే అలెగ్జాండర్ బాండ్ రాచరిక కుటుంబాల కోసం ట్యూటర్‌గా పని చేసేవాడు. అక్కడే బాండ్ మొదటి ఆరు సంవత్సరాలు చదువుకున్నాడు. తర్వాత తన తండ్రి రాయల్ ఎయిర్‌ఫోర్స్‌లో చేరినప్పుడు, బాండ్ తన తల్లి, సోదరితో కలిసి డెహ్రాడూన్‌లోని అమ్మమ్మ ఇంటికి వెళ్లాడు. తల్లి ఎడిత్ క్లార్క్ తన భర్తతో విడిపోయి పంజాబీ హిందువును వివాహం చేసుకోవడంతో, బాండ్ దిక్కుతోచని స్థితిలో పడిపోయాడు. తండ్రితో ఎక్కువ అనుబంధం ఉన్న ఆయనకు మానవ సంబంధాలపై ఆసక్తి ఉండేది. పదహారేళ్ల వయసులో మొదటి కథ 'అన్‌టచబుల్' రాశాడు. తండ్రి ప్రోత్సాహంతో లండన్ వెళ్లినప్పుడు, తన 17వ ఏట మొదటి నవల రాయడం ప్రారంభించాడు. జీవనోపాధి కోసం రకరకాల ఉద్యోగాలు చేసి, చివరికి డెహ్రాడూన్ చేరుకున్నాడు. అక్కడ ఫ్రీలాన్సర్‌గా జర్నలిజం వృత్తిని ప్రారంభించాడు. వివిధ వార్తా పత్రికలు, మ్యాగజైన్లకు చిన్న కథలు, కవితలు రాస్తూ, ఆర్థికంగా నిలదొక్కుకున్నాడు. ఢిల్లీలోని వివిధ పత్రికల సంపాదకులు, ప్రచురణకర్తలను కలుసుకోవడానికి వీలుంటుందనే ఉద్దేశంతో ముస్సోరీకి మకాం మార్చాడు. నాలుగేళ్లపాటు ఒక పత్రికకు సంపాదకత్వం వహించాడు. 1980 దశకంలో పెంగ్విన్ ప్రచురణ సంస్థ తన శాఖను శాఖను ప్రారంభించింది. ఆ సమయంలో బాండ్‌ను సంప్రదించి, అప్పటికే ఆయన రాసిన నాన్‌ఫిక్షన్ రచనల సంకలనం 'ది బెస్ట్ ఆఫ్ రస్కిన్ బాండ్' పేరుతో ముద్రించింది. పూర్తికాల రచయితగా మారిన బాండ్ దాదాపు అన్ని రకాల రచనలు చేశాడు. ఇప్పటికీ చేస్తున్నాడు. 90 ఏళ్ల వయసులోనూ అతను కథలు రాయడం, చెప్పడం వంటి తన ఇష్టమైన ప్రక్రియను కొనసాగిస్తున్నాడు. అతని రచనలు పెద్దలనేకాదు.. పిల్లలను కూడా అలరిస్తాయి. అతని కథల్లో ఎక్కువ శాతం హిమాలయాల దిగువున ఉన్న హిల్ స్టేషన్లతోని జీవితాలు, అక్కడి ప్రజల పరిస్థితులు, సామాజిక కట్టుబాట్లు ఎక్కువగా కనిపిస్తాయి. తన బాల్యం అక్కడే గడిచిన కారణంగా, ఆ ప్రాంతాల ప్రభావం బాండ్ రచనలపై ఎక్కువగా ఉంది. పిల్లల కోసం 1972లో మొదటి పుస్తకం 'యాంగ్రీ రివర్' రాశాడు. మొదట్లో అది చాలా పెద్దగా ఉండేవి. ప్రచురణకర్తల కోరిక మీద దానిని కుదించాడు. అనంతరం కాలంలో పిల్లలకు ఎంత నిడివితో రచన చేయాలనే విషయంలో ఆయన పట్టు సంపాదించాడు. బాండ్ తన స్వీయచరిత్రను 'రెయిన్ ఇన్ ది మౌంటైన్స్'లో చెప్పుకున్నాడు. ముస్సోరీలో గడిపిన బాల్యాన్ని గుర్తుచేసుకున్నాడు. అదే విధంగా 'సీన్స్ ఫ్రమ్ ఎ రైటర్స్ లైఫ్' నవల్లో యువకుడిగా తన జీవితాన్ని నెమరువేసుకున్నాడు. ఇంగ్లాండ్ ప్రయాణం నుంచి, తన మొదటి నవల 'ది రూమ్ ఆన్ ది రూఫ్' ప్రచురించే వారి కోసం సాగించిన అన్వేషణను వివరించాడు. కేవలం 20 ఏళ్ల వయసులోనే బాండ్ తాను రచయితగా స్థిరపడాలని నిర్ణయించుకున్నాడు. అత్యవసర పరిస్థితుల్లో కొన్ని ఉద్యోగాలు చేసినప్పటికీ, సాహిత్యాన్ని అతను ఎప్పుడూ విడిచిపెట్టలేదు. ప్రొఫెషనల్ రచయితగా ఐదు దశాబ్దాల కాలంలో బాండ్ విభిన్న కళా ప్రక్రియలతో ప్రయోగాలు చేశాడు. ప్రారంభ రచనలలో కల్పన , చిన్న కథలు, నవల్లోని అంశాలు తన స్వీయచరిత్రతో ముడిపడి ఉంటాయి.. తరువాత, అతను నాన్‌ఫిక్షన్, రొమాన్స్ అంశాలను తన శైలిగా ఎంచుకున్నాడు. బాల సాహిత్యానికి ఇతోధిక ప్రాధాన్యం ఇచ్చాడు. తనను తాను 'విజువల్ రైటర్'గా భావించుకుంటాడు. కథను లేదా నవలను తన స్మృతిపథంలో ముందుగా ఊహించుకుంటాడు. కొన్ని పాయింట్లు రాసుకుంటాడు. ఆ తర్వాత రచన మొదలుపెట్టి, అదే వేగంతో ముగిస్తాడు. ఏది రాయాలన్నా అతనికి ముందస్తు ప్రణాళిక అవసరం లేదు. గంటలు, రోజుల తరబడి ఆలోచించాల్సిన పనిలేదు. తన చుట్టూ జరిగే ఎలాంటి సంఘటనైనా కథాంశంగా తీసుకోగలడు. అద్భుతమైన కథ లేదా నవలగా ఆవిష్కరించగలడు. 'జస్ట్ విలియం' (రిచ్మల్ క్రాంప్టన్), 'బిల్లీ బంటర్', 'ఆలిస్ ఇన్ వండర్‌ల్యాండ్' (చార్లెస్ హామిల్టన్) వంటి నవలలు బాండ్‌కు ఎంతో ఇష్టం. చార్లెస్ డికెన్స్, మార్క్ ట్వెయిన్ వంటి రచయితలను ఇష్టపడతాడు. తొమ్మిది పదుల వయసులోనూ ఉత్సాహంగా రచనలు చేస్తూ, పిల్లలతో కలిసి, వారికి కథలు చెప్తూ జీవితం కొనసాగిస్తున్న బాండ్ నిత్య యవ్వనుడు. ఆ మహా రచయితకు జేజేలు పలుకుతూ, పూర్ణాయుష్కుడై, మరిన్ని ఉత్తమ రచనలను సాహితీ లోకానికి అందించాలని కోరుకుందాం.





# దేశంలో కాంగ్రెస్‌కు అధిక సభ్యత్వాలు హుజూర్‌నగర్‌లోనే

ఎమ్మెల్సీ ఎన్నికల్లో
కాంగ్రెస్ అభ్యర్థి విజయం ఖాయం
మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న విజయం ఖాయమని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖమంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లోని ఇందిరాభవన్‌లో నియోజకవర్గ కాంగ్రెస్ ముఖ్య నేతలతో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న పరిచయం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే కాంగ్రెస్ పార్టీకి అత్యధిక సభ్యత్వాలు నమోదు చేయడంలో హుజూర్‌నగర్ నియోజకవర్గం అగ్రస్థానంలో నిలిచిందన్నారు. హుజూర్‌నగర్ నియోజకవర్గ ప్రజలు బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే ఎన్ని ప్రలోభాలకు గురిచేసిన, ఒత్తిడులకు లోన్‌చేసిన కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిని అయిన తనను అత్యధిక మెజార్టీతో గెలిపించిన ఘనత నియోజకవర్గ ప్రజలదే అన్నారు. ఇటీవల జరిగిన ఎంపి ఎన్నికల్లో నల్లగొండ కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి అత్యధిక మెజార్టీ సాధించబోతున్నారని ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగబోతున్న మూడు ఉమ్మడి జిల్లాల్లో ఉన్న మొత్తం 34 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 32 నియోజవర్గాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థులే గెలిచారన్నారు. దీనిని బట్టి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి విజయం సునాయాసం అన్నారు. అన్ని ఎన్నికల లాగానే ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికల్లో నియోజవర్గ పట్టభద్రులు కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు అత్యధిక మెజార్టీ అందించాలని కోరారు. అభ్యర్థి తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ నిరుద్యోగులకు న్యాయం జరగాలంటే కాంగ్రెస్ ప్రభుత్వం వలనే జరుగుతుందన్నారు. రాష్ట్రంలో బిఆర్‌ఎస్ పాలనలో నిరుద్యోగులకు, యువతకు తీరని అన్యాయం జరిగిందన్నారు. సమావేశంలో పిసిసి రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ ఎన్నికల కాంగ్రెస్ అబ్జర్వర్ జగదీశ్వర్ రావు, సూర్యాపేట, నల్లగొండ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్, శంకర్‌నాయక్, ఐఎన్‌టియూసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్నగౌడ్, ఎంపిపిలు గూడెపు శ్రీనివాస్, ముడావత్ పార్వతికొండానాయక్, గోపాల్‌నాయక్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జున్‌రావు,పిసిసి మెంబర్ దొంగరి వెంకటేశ్వర్లు, ఈడ్పుగంటి సుబ్బారావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చక్కర వీరారెడ్డి,మంజూనాయక్, కొణతం వెంకటరెడ్డి పాల్గొన్నారు.

## అనుమతి లేని పాఠశాలల పేర్లు బహిర్గతం చేయాలి

గుర్తింపులేని పాఠశాలలకు అనుకూలంగా డిఇఒ ప్రకటన
ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శి వెంకటేష్, రమేష్

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** కరీంనగర్ జిల్లాలో గుర్తింపు లేని పాఠశాలల పేర్లు బహిర్గతం చేయకుండా గుర్తింపు ఉన్న పాఠశాలల్లో మాత్రమే తల్లిదండ్రులు తమ పిల్లలను చదివించాలని డిఈవో ప్రకటన చేయడం సరికాదని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శి వెంకటేష్, రమేష్‌లు పేర్కొన్నారు. అసలు జిల్లాలో ఏ పాఠశాలలకు అనుమతులు ఉన్నవి? ఏ పాఠశాలలకు అనుమతులు లేవో బహిర్గతం చేయకుండా ప్రకటనలు జారీ చేయడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. గుర్తింపు లేని పాఠశాలలో చదివితే ఏమైనా సమస్యలు వస్తే తమకు సంబంధం లేదని ప్రకటించిన జిల్లా విధ్యాశాఖ అధికారి ఎందుకు గుర్తింపు లేని పాఠశాలలను గుర్తించి సీజ్ చేయడం లేదని ప్రశ్నించారు. గుర్తింపు లేకుండా నిర్వహణ జరిగితే గుర్తించి చర్యలు తీసుకునే బాధ్యత డీఈవోపై లేదా? అని ప్రశ్నించారు. కరీంనగర్ నగరంలో రెండు శ్రీ చైతన్య పాఠశాలలు గుర్తింపు లేవని విన్నవించినా ఎందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు ఇప్పటికీ సీజ్ చేయడం లేదని , కరీంనగర్ జిల్లాలో ఏ ప్రాంతంలో ఏ పాఠశాలకు అనుమతులు ఉన్నాయో జిల్లా విద్యాశాఖ అధికారి ప్రకటించాలని, లేని పక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆద్వర్యంలో విద్యాశాఖ అధికారి కార్యాలయాన్ని ముట్టడిస్తామని వారు హెచ్చరించారు.

## నాణ్యమైన వైద్య చికిత్సలు అందించాలి



**ప్రజాపక్షం /నల్లగొండ :** పేద, మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా అతి తక్కువ ఫీజులతో రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని నల్గొండ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆదివారం నల్గొండ జిల్లా కేంద్రంలోని రామగిరిలో సంతోషిమాత మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ను కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు గుమ్ముల మోహన్ రెడ్డి తో కలిసి ప్రారంభించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటు ధరల్లో కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో సంతోషిమాత మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని రీ ఓపెనింగ్ చేసినందుకు యాజమాన్య బృందానికి, ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ లతీఫ్ కు ప్రత్యేక అభినందనలు తెలిపారు. సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ ఇంద్ర, జనరల్ సర్జన్ డాక్టర్ నరసింహారావు మాట్లాడుతూ తమ ఆసుపత్రిలో న్యూరో, ఆర్థో, గైనకాలజీ, ఫిజీషియన్ సెంటర్ ఫర్ బెడ్ రీడ్ పేషెంట్లు కొరకు ప్రత్యేకమైన వైద్య నిపుణులు అందుబాటులో ఉంటారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్, జడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, డాక్టర్లు అనంతరెడ్డి, కె.ఆర్ చారి, నర్సింగరావు, సురేష్ కుమార్, వేణుగోపాల్ రెడ్డి, ఐఎంఎ సెక్రటరీ రమేష్, వై. రామారెడ్డి, కౌన్సిలర్లు ఇబ్రహీం, ఇంతియాజ్, పూల శీను, జమాల్ పాల్గొన్నారు.

## బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు తరువాతే ఎన్నికలు జరపాలి



**ప్రజాపక్షం/కోదాడ :** బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని తెలంగాణ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్ అన్నారు.ఆదివారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ సభలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇస్తామన్న వాగ్దానం అమలు చేయాలన్నారు నాటి హామీపై ఊసేలేని విధంగా ప్రవర్తిస్తున్న కాంగ్రెస్ పార్టీ తీరు బీసీలను బడుగు, బలహీన వర్గాలను మోసం చేసేవిధంగా ఉందన్నారు.కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన పదవుల్లో సామాజిక న్యాయం కొరవడిందని, పదవుల్లో పెద్ద పీట వేస్తూ ఒకే సామాజికవర్గానికి అగ్రభాగం కట్టెబట్టిన తీరును గమనిస్తే సామాజిక న్యాయాన్ని ఆదిలోనే హత్యచేసిన వైఖరి కాంగ్రెస్ పార్టీదన్నారు. రాహుల్‌గాంధీ సామాజిక న్యాయం గురించి పదేపదే ఉపన్యాసాలు ఇస్తున్నా తెలంగాణలో మాత్రం నాయకులు సామాజిక న్యాయాన్ని పక్కన పెట్టి కుటుంబాల పాలన కొనసాగిస్తున్నారని విమర్శించారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తున్నామని లేనియెడల బీసీల ఓట్లకు కాంగ్రెస్ పార్టీ దూరమవుతుందని హెచ్చరించారు. సమావేశంలో టి.ఎస్.ఏ వర్కింగ్ ప్రెసిడెంట్ మురళీకృష్ణ, సెక్రటరీ కీత రంజిత్‌శర్మ, సూర్యాపేట జిల్లా ఇంచార్జి బీరవల్లి తరుణ్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఫుడ్‌కోర్టును ప్రారంభించిన ఎమ్మెల్యే బీర్ల



**ప్రజాపక్షం/ఆలేరు :** ఆలేరు పట్టణంలో వరంగల్ నుండి హైదరాబాదు బైపాస్ రోడ్‌లో ఏర్పాటుచేసిన రాఘవేంద్ర ఫుడ్ కోర్టును ఆదివారం ఆలేరు శాసనసభ్యులు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వయం శక్తితో ఎదగాలని ఎదుటివారికి స్ఫూర్తిదాయకంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో హోటల్ యజమాని సంధ్యా, ఉప్పలయ్య, శ్రావణ్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## డీజిల్ కోసం వచ్చిన లారీ దగ్ధం



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** భువనగిరిలో ఓ పెట్రోల్ పంపులో డిజిల్ కోసం వచ్చిన లారీ తగలబడిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నల్లగొండ నుండి భువనగిరి వైపుకు వస్తున్న ఓ లారీ పట్టణ శివారులో ఉన్న పెట్రోల్ బంక్‌లో డీజిల్ పోసుకోవడం కోసం బంక్‌లోకి ప్రవేశించింది. ప్రమాధవశాతు లారీ డీజిల్ ట్యాంకర్ ఒక్కసారిగా పేలిపోవడంతో ట్యాంక్‌లో ఉన్న డీజిల్‌తో పెద్ద మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన పెట్రోల్‌బంక్ సిబ్బంది ఫైర్ సిలిండర్ల సహాయంతో మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చారు. దీంతో పెను ప్రమాదం తప్పడంతో స్థానికులు ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నారు.

## బస్సు భవన్ ముట్టడిని జయప్రదం చేయండి

ఖమ్మంలో ఎంప్లాయిస్ యూనియన్ కరపత్ర ప్రచారం



**ప్రజాపక్షం/ఖమ్మం :** ఆర్టిసిని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియ పూర్తి కాలేదని ప్రభుత్వం వెంటనే విలీనానికి సంబంధించి అపాయింట్‌మెంట్ తేదీని ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఆర్టిసి ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఈనెల 21న జరిగే బస్సు భవన్ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆర్టిసి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి పాటి అప్పారావు కార్మికులకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఖమ్మం ఆర్టిసి బస్టాండ్‌లో ముట్టడిన జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలను కార్మికులకు పంచుతూ ఆందోళనలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ 2013 ఆర్‌పిఎస్‌కు సంబంధించిన 50 శాతం బాండ్ డబ్బులను కేవలం డ్రైవర్ ఉద్యోగులకు మాత్రమే చెల్లించారని మిగిలిన కార్మికులకు కూడా వెంటనే చెల్లించాలని అప్పారావు డిమాండ్ చేశారు. ఉద్యోగులను విభజించు పాలించు అనే రీతిలో యాజమాన్యం వ్యవహరిస్తుందని ఈ వైఖరిని మార్చుకోవాలని ఆయన కోరారు. కార్మికుల వేతనాలను ఒకటిన చెల్లించాలని 2017 ఆర్‌పిఎస్‌కు సంబంధించిన వేతన సవరణ చేసి మిగిలిన అలవెన్సులను పట్టించుకోకపోవడం పట్ల ఎంప్లాయిస్ యూనియన్ నిరసన వ్యక్తం చేస్తుందని వచ్చే నెల వేతనంతో అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో అకారణంగా సస్పెండ్ అయిన లేదా రిమూవ్ అయిన ఉద్యోగుల కేసులను పరిశీలించి వెంటనే విధుల్లోకి తీసుకోవాలని అప్పారావు కోరారు. మహాలక్ష్మి పథకం కారణంగా ఆర్టిసి సిబ్బంది పై పని భారం పెరిగిందని ప్రతి బస్సులో 100కు మించి ప్రయాణికులు ఉంటున్నారని వెంటనే డ్రైవర్, కండక్టర్, మెకానిక్ సహా సిబ్బంది నియమాకాలు చేపట్టాలని కోరారు. బకాయిలను విడుదల చేయాలని రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న కార్మికుల దరఖాస్తులను పరిశీలించి మంజూరు చేయాలని ఆయన కోరారు. ఈ డిమాండ్లపై 21న మూడు గంటలకు బస్సు భవనం ముట్టడి జరుగుతుందని కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ రీజియన్ కార్యదర్శి పిల్లి రమేష్, డిపో అధ్యక్ష, కార్యదర్శులు జగన్నాథం, బుచ్చిబాబు, కోశాధికారి దామాల లాజర్, డిపో నాయకులు గోవర్ధన్, ప్రదీప్ కుమార్, చెన్నారెడ్డి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## రైస్‌మిల్లర్లు రైతులను ఇబ్బంది పెడితే ఊరుకునేది లేదు



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** రైస్ మిల్లర్లు రైతులను ఇబ్బంది పెడితే ఊరుకునేది లేదని జిల్లా కలెక్టర్ హనుమంతు కే జండగే హెచ్చరించారు. మండల వ్యాప్తంగా రైతులు చేస్తున్న ఆందోళన నేపథ్యంలో ఆయన ఆదివారం పట్టణంలోని కొనుగోలు కేంద్రాలను సందర్శించి తనిఖీ చేసి రైతులు పడుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా కొనుగోలు చేసి రైస్ మిల్లులకు వెంటనే తరలించాలని ఆయన కోరారు. రైస్ మిల్లర్లు రైతులపై చేస్తున్న దౌర్జన్యాలను తప్పుపడుతూ రైతులకు అండగా నిలిచేందుకు పరిశీలనకు వచ్చామని ఆయన అన్నారు. అకాల వర్షాలతో తడిసి ముద్దవుతున్న ధాన్యాన్ని కూడా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని భరోసా ఇచ్చారు. వీరితోపాటు జెసి బీన్ షాలో, డిస్టిక్ మేనేజర్ గోపికృష్ణ డిస్ట్రిక్ట్ సివిల్ సప్లై అధికారి శ్రీనివాస్ రెడ్డి, మార్కెటింగ్ ఆఫీసర్ సబిత, జిల్లా రవాణా అధికారి సాయి కృష్ణ ,ఎమ్మార్వో శ్రీకాంత్ రెడ్డి ఎమ్మార్ఐ వెంకట్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## ఫేక్ లింక్స్ ఓపెన్ చేయవద్దు

తప్పుడు లింక్స్ షేర్ చేస్తే కేసులు నమోదు
యాదాద్రి డిసిపి రాజేష్ చంద్ర



**ప్రజాపక్షం/యాదాద్రి భువనగిరి :** వాట్సప్‌లలో వచ్చే అనవసర లింక్స్,ఏపికె లు డౌన్‌లోడ్ చేసుకొని సైబర్ నేరస్థుల వలలో చిక్కుకోవద్దని అవి అన్నీ కూడా ఫేక్ అని యాదాద్రి డిసిపి రాజేష్ చంద్ర చెప్పారు.స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పేరిట ఇటీవల సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ లో ఎస్ బిఐ రివార్డు అంటూ వైరల్ అవుతున్న మోసపూరిత అంశంపై ఆయన మాట్లాడారు.ఎస్ బిఐ రివార్డు లింక్ ఫేక్ అని అది నమ్మి లింక్ ను క్లిక్ చేస్తే స్మార్ట్ ఫోన్ డేటా సైబర్ నేరగాళ్లకు చిక్కినట్లే అని అన్నారు.నెట్ బ్యాంకింగ్ రివార్డ్ పాయింట్లు జమ అయ్యాయని.. ఈ నగదును పొందేందుకు చివరి రోజు అని వెంటనే ఎస్బీఐ రివార్డ్ యాప్ ను ఇన్స్టాల్ చేసుకోమని చెప్పటంతో ఇది నిజమని నమ్మి ఎస్బీఐ రివార్డు ఏపీకే ఫైల్‌ను ఇన్స్టాల్ చేసుకుంటే వారి అకౌంట్లో నగదును కొల్లగొడుతారన్నారు.ఎస్బీఐ రివార్డు పేరిట పంపుతున్న మెసేజ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని కొందరు సైబర్ నేరగాళ్లు రివార్డు పాయింట్స్ పేరిట వాట్సాప్, మెసేజ్ల రూపంలో ఏపీకేలు పంపుతున్నారని వివరించారు.ఎవరు కూడా మెసేజ్లు,ఏపీకేలు షేర్ చేయరని ఇలాంటి లింక్లపై క్లిక్ చేయకుండా, డౌన్లోడ్ చేయకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఇది ఒక్కరితోనే కాకుండా ఇది ఫార్వార్డ్ చేస్తున్నారని ప్రజలు మోసపోయేలా ఫేక్ లింకులను ఫార్వార్డ్ చేస్తే సైబర్ క్రైమ్ కింద కేసులు నమోదు చేస్తామని ఈసందర్భంగా హెచ్చరించారు.

## ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి



**ప్రజాపక్షం/గుండాల :** ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్ అధికారులను ఆదేశించారు. ఆదివారం గుండాల మండలంలోని బ్రహ్మణపల్లి, సుద్దాల గ్రామాలలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐకెపి, పిఏసిఎస్ కేంద్రాలలోని ధాన్యాన్ని త్వరితగతిన కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని ఆయన సూచించారు. అకాల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతుల ధాన్యం తడిసిపోకుండా చర్యలు తీసుకోవాలని, లారీలు, బస్తాల కొరత లేకుండా చూడాలని అన్నారు. వర్షాల వలన తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, రైతులు ఎటువంటి ఇబ్బంది, భయపడాల్సిన అవసరం లేదని తెలిపారు. కేంద్రాలలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అధికారులు తగిన చర్యలు తీసుకొని ధాన్యాన్ని రైతుల వద్ద నుండి ఎటువంటి తరుగు లేకుండా, కట్టింగ్ లేకుండా కొనుగోలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ వెంకటేశ్వర్లు, పిఏసిఎస్ డైరెక్టర్ శ్రీను, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు

## జూన్ 8 వరకు ప్రజావాణి లేదు

**ప్రజాపక్షం /నల్లగొండ టౌన్ :** పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ముగిసినప్పటికీ జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున జూన్ 8 వరకు ప్రజావాణి కార్యక్రమం ఉండదని జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన తెలిపారు.పార్లమెంటు ఎన్నికల ఓట్ల లెక్కింపు, అలాగే వరంగల్ ఖమ్మం నల్గొండ పట్టభద్రుల శాసనమండలి ఉప ఎన్నికల పోలింగ్, కౌంటింగ్ వంటి కారణాలవల్ల కేంద్ర ఎన్నికల సంఘం జూన్ 8 వరకు నల్గొండ జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని విధించినందున జూన్ 8 వరకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం లేదని ఆమె స్పష్టం చేశారు. అందువల్ల జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించి ప్రతి సోమవారం ఫిర్యాదులు సమర్పించేందుకు నల్గొండ జిల్లా కేంద్రానికి రావద్దని ఆమె విజ్ఞప్తి చేశారు.

## ఎఎస్ఐ అని ఫోన్ చేసి రూ.75వేలు టోకరా పెట్టిన ఆగంతకుడు

**ప్రజాపక్షం/నేరేడుచర్ల :** హాలో నేను ఏఎస్ఐని మాట్లాడుతున్నా మా ఎస్ఐ కుమార్తెకు చాలా సీరియస్‌గా ఉంది. నేను మీకు రూ.75వేలు నగదు పంపిస్తున్న ఫోన్ పే ద్వారా నాకు తిరిగి ఆ మొత్తాన్ని పంపిండి అంటూ ఆగంతకుడు ఫోన్‌కాల్ చేసి సైబర్ నేరాలకు పాల్పడి పెట్రోల్ బంక్ యజమానికి రూ.75వేలు టోకరా పెట్టిన ఈ ఘటన సూర్యాపేట జిల్లా నేరేడుచర్లలో శుక్రవారం త్రి వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్లితే పట్టణంలోని ఓ బంక్ యజమానికి ఈ నెల 17న రాత్రి సమయంలో నేను ఏఎస్ఐని మాట్లాడుతున్నాను నా దగ్గర రూ.75వేల నగదు ఉంది. నగదును మా మనిషి ద్వారా నీ వద్దకు పంపుతున్నాను.వెంటనే నా అకౌంట్లోకి ఫోన్ పే ద్వారా అమౌంట్ పంపండి అని ఫోన్ చేశాడు. దీంతో ఆ బంక్ యజమాని నావద్ద ఫోన్ పే లేదని సమాధానం చెప్పడంతో మీకు తెలిసిన వారు ఉంటే వారిని నుండి పంపించండని ఆదేశించడంతో దీంతో సదరు బంక్ యజమాని పట్టణానికి చెందిన ఒక వ్యక్తికి నంబర్ ఇచ్చాడు.వెంటనే ఆగంతకుడు ఆ వ్యక్తి నెంబర్‌కు ఫోన్ చేసి కొంచెం అర్జెంట్‌గా ఉంది వెంటనే ఫోన్ చేయాలని పట్టణానికి చెందిన మరో బంక్‌లో పనిచేసే సిబ్బంది నెంబర్ ఇచ్చాడు.ఆయన మాటను నమ్మిన వ్యక్తి ఆ వ్యక్తి ఆయన వద్ద సరిపోను మొత్తం నగదు లేనప్పటికి మరో వ్యక్తిని పిలిపించుకుని ఇరువురు కలసి మొత్తం రూ.75వేలు ఫోన్ పే ద్వారా పంపించారు. తిరిగి సైబర్ నేరగాడు వెంటనే అమౌంట్ జమైన పెట్రోల్‌బంక్ సిబ్బందికి ఫోన్ చేసి నేను ఏఎస్ఐని మాట్లాడుతున్నాను నీ ఖాతాకు రూ.75వేలు ఫోన్‌పే ద్వారా వచ్చాయని వాటిని నేను పంపిన క్యూఆర్ కోడ్‌కు పంపమని ఆదేశించాడు.వెంటనే అతను పంపించాడు. ఫోన్ పే ద్వారా నగదు పంపిన ఇరువురు ఎంత సమయం వేచి చూసిన ఏఎస్ఐ పంపిస్తాన్న డబ్బు తేకపోవడంతో తాము సైబర్‌నేరగాడి చేతిలో మోస పోయామని గ్రహించి వెంటనే సైబర్ క్రైమ్ ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు.ఇలాంటి సంఘటన నెలరోజుల క్రితం మరో బంకులో కూడా జరిగిందని అప్పుడు రూ.30వేలు ఇలాగే చెప్పి కేటుగాళ్లు కాల్ చేసినట్లు సమాచారం.

## బొగ్గు ఎగుమతుల్లో స్థానికతపై లొల్లి

సత్తుపల్లిలో లారీ యజమానుల ఆందోళన
మణుగూరు లారీ ఓనర్స్ సంఘీభావం



**ప్రజాపక్షం/ఖమ్మం/ మణుగూరు :** బొగ్గు ఎగుమతికి సంబంధించి స్థానికతపై లొల్లి జరుగుతుంది. స్థానిక లారీలకు బొగ్గు లోడింగ్ కేటాయించకుండా సింగరేణి యాజమాన్యం వ్యవహరిస్తుందని రోడ్డు మార్గాన బొగ్గును తరలించడం నిలిపివేసే విధానాన్ని ఉపసంహరించుకోవాలని సత్తుపల్లి లారీ యజమానుల సంఘం ఆందోళన చేపట్టిన విషయం విధితమే. సత్తుపల్లి లారీ యజమానుల ఆందోళనకు మణుగూరు లారీ యజమానుల సంఘం పూర్తి మద్దతు ప్రకటించింది. బొగ్గు గనుల ఏర్పాటు సమయంలో సింగరేణి యాజమాన్యం ఇచ్చిన హామీ ఇప్పుడు అమలు చేయాలని కానీ లారీలకు లోడు చేయకుండా ఇబ్బంది పెట్టడం సరికాదని మణుగూరు లారీ ఓనర్స్ అసోసియేషన్ తెలిపింది. సత్తుపల్లి లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సింగరేణి యాజమాన్యం తీరు మార్చుకోక పోతే ఆందోళన చేపడుతుందని హెచ్చరించారు. సత్తుపల్లిలో తక్షణం స్థానిక లారీలకు బొగ్గును సరఫరా చేసే అవకాశం కల్పించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మిడిదొడ్ల నాగేశ్వరరావు, శ్రీను, వెంకన్నబాబు, లాలు, తాతబ్బాయి, అంజయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఉమ్మడి జిల్లాలో కెటిఆర్ పర్యటన

మూడు చోట్ల సమావేశాలు

**ప్రజాపక్షం/ ఖమ్మం :** బిఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కేటి రామారావు ఈనెల 20న సోమవారం ఉమ్మడి ఖమ్మంజిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు ఇల్లందు చేరుకుని ఖమ్మం నల్గొండ వరంగల్ పట్టభద్రుల ఓటర్ల సమావేశంలో పాల్గొననున్నారు. ఈ సమావేశం సింగరేణి జెకె గ్రౌండ్స్‌లో జరగనుంది. బిఆర్‌ఎస్ బలపర్చిన పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థి రాకేష్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ జరిగే సమావేశంలో ఆయన పాల్గొన నున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు కొత్తగూడెం క్లబ్‌లో జరిగే పట్టభద్రుల ఓటర్ల సమావేశంలో పాల్గొంటారు. నాలుగు గంటలకు ఖమ్మం ఎస్‌బిఐటి కళాశాలలో జరిగే సమావేశంలో కేటిఆర్ పాల్గొననున్నారు. కేటిఆర్ తో పాటు ఎంపిలు వద్దిరాజు రవిచంద్ర, నామ నాగేశ్వరరావు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, జిల్లా అధ్యక్షులు తాతా మధుసూదన్, బిఆర్‌ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి పాల్గొననున్నారు.

## దుర్గామాతకు ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



**ప్రజాపక్షం/బీబీనగర్ :** మండలంలోని రుద్రవెల్లి గ్రామంలో జరుగుతున్న దుర్గామాత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం వనమోత్సవంతో పాటు అమ్మవారి బోనాలు కుంకుమ నైవేద్యం సమర్పించారు. అనంతరం భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ కసిరెడ్డి నారాయణరెడ్డి ఆదివారం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమ్మవారి పూజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకోవాలని ప్రజలందరినీ చల్లంగా చూడాలని అమ్మవారిని వేడుకున్నటువంటి ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గోలి పింగళి రెడ్డి, పోటోల్ల శ్యామ్ గౌడ్, పిఏసిఎస్ చైర్మన్ మెట్టు శ్రీనివాసరెడ్డి, మండల పార్టీ ఎంపీటీసీలు గోలి నరేందర్ రెడ్డి, పంజాల రామాంజనేయులు గౌడ్, అధ్యక్షులు సురకంటి సత్తిరెడ్డి, మాజీ ఎంపీపీ జడ్పిటిసిలు టంటం లక్ష్మయ్య, సంధిగారి బసవయ్య, మాజీ సర్పంచులు గడ్డం బాల్ రెడ్డి, ఎర్రం మనోహర్, బండారు ఆగమయ్యగౌడ్, జిల్కపల్లి అశోక రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తీన్మార్ మల్లన్నను గెలిపించండి



**ప్రజాపక్షం/డిండి :** ఖమ్మం, వరంగల్, నల్గొండ పట్టభద్రుల ఎంఎల్‌సి ఉప ఎన్నికల్లో సిపిఐ, సిపిఐ ప్రజా సంఘాలు బలపరిచిన కాంగ్రెస్ ఎంఎల్‌సి పట్టభద్రుల అభ్యర్థి తీన్మార్ మల్లన్నను మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని సిపిఐ జిల్లా సమితి సభ్యులు తూం బుచ్చిరెడ్డి మండల పట్టభద్రులను కోరారు. ఆదివారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ బిఆర్‌ఎస్, బిజెపి అభ్యర్థులను ఓడించి తీన్మార్ మల్లన్నను గెలిపించాలని అందుకోసం సిపిఐ, ప్రజా సంఘాలు, కాంగ్రెస్ అనుబంధ సంఘాలు కృషి చేయాలని సూచించారు. సిపిఐ శ్రేణులు మల్లన్న గెలుపుకై పకడ్బందీగా పనిచేయాలని సూచించారు.

## టిఎస్‌కు బదులుగా టిజినే వాడాలి

కలెక్టర్ హనుమంతు జెండగే



**ప్రజాపక్షం/యాదాద్రి కలెక్టరేట్ :** ప్రభుత్వం టిఎస్‌కు బదులుగా టిజిని తెలంగాణ సంక్షిప్త పదంగా మార్చాలని ఉత్తర్వులు జారీ చేసిందని జిల్లా కలెక్టర్ హనుమంత్ కే.జండగే ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వులు, నోటిఫికేషన్లు, నివేదికలు, లెటర్ హెడ్‌లలో టిజిగా ఉండాలని చెప్పారు. ప్రభుత్వ శాఖలు, సంస్థలు, అటానమస్ విభాగాలన్నీ దీనిని పాటించాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని అధికారిక వ్యవహారాలకు వర్తింపజేసేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని చెప్పారు.ఇది తక్షణమే అమల్లోకి వచ్చిందని, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలన్నింటికీ ఇది వర్తిస్తుందన్నారు. వెబ్సైట్లతో పాటు అన్ని రకాల ఎలక్ట్రానిక్ డాక్యుమెంట్లు, ఆన్లైన్ ప్లాట్ ఫామ్ లలో, రిపోర్టుల్లో ఇకపైన 'టీజీ' పదాన్నే (అబ్రివేషన్) వినియోగించాలని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం 'టీజీ' అనే అబ్రివేషన్ను అధికారికంగా గుర్తించడంతో ఈ మార్పును అన్ని విభాగాలూ అమల్లోకి తెచ్చేలా ఆయా డిపార్టెమెంట్ల కార్యదర్శులు, హెచ్ఓడీలు పర్యవేక్షించాలని ప్రభుత్వ ఉత్తర్వుల్లో పేర్కొన్నారని, ఈ సందర్భంగా అన్ని కార్యాలయాల్లో టిఎస్‌కు బదులు టిజి గా మార్చి ఈనెల 26 వ తేదీ లోగా నివేదికలు సమర్పించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు.

## వాకర్స్‌తో తీన్మార్ మల్లన్న మార్నింగ్ వాక్



**ప్రజాపక్షం/హన్మకొండ టౌన్ :** వరంగల్, ఖమ్మం, నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఆర్ట్స్ అండ్ సైన్స్ పబ్లిక్ గార్డెన్, వరంగల్‌లోని కేయూ గ్రౌండ్‌లో ఆదివారం మార్నింగ్ వాకర్స్‌ను గ్రాడ్యుయేట్‌తో కలిసి ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లన్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా తనను గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో 56వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొండ హరిబాబు, డివిజన్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చింత రమేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## 'నెక్కొండ'లో 2146 ఎంఎల్‌సి ఓట్లు

**ప్రజాపక్షం/నెక్కొండః** వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలో ఎంఎల్‌సి ఓట్లు 2146 నమోదయినట్లు రెవెన్యూ వర్గాలు తెలిపాయి. మండలంలో రెండు పోలింగ్‌స్టేషన్‌లో 144, 145 ఎన్నికల అధికారులు గుర్తించారు. 144 పోలింగ్‌స్టేషన్‌లో 773 పురుషులు, 355 మంది స్త్రీలు , మొత్తం 1128 మంది పట్టభద్రుల ఓటర్లు ఉండగా పోలింగ్ నెంబర్ 145లో పురుషులు 724, స్త్రీలు 294 మంది మొత్తం 1018 మంది పట్టభద్రుల ఓటర్లు ఉన్నారు. రెండు పోలింగ్‌ల బూత్‌లలో 1497 పురుషులు, అలాగే 649 మంది స్త్రీలు మొత్తం 2146 ఎంఎల్‌సి పట్టభద్రుల ఓటర్లు వారి ఓటు హక్కును ఈ నెల 27న ఎంఎల్‌సి పట్టభద్రుల ఎన్నికలలో ఓటు హక్కు కలిగిన పట్టభద్రులు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

## రూ. 1116 కే జీలుగు విత్తనాలు

**ప్రజాపక్షం/కమలాపూర్ః**భూసారంపెంపొందించే కార్యక్రమంలో భాగంగా కమలాపూర్ మండలానికి మొదటి విడుతలో 310 క్వింటాళ్ళ జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు వ్యవసాయ శాఖ అధికారి జాలి లక్ష్మారెడ్డి రైతులకు పిలుపునిచ్చారు. కమలాపూర్ లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.... 30 కిలోల బస్తా పూర్తి ధర రూ. 2790 కాగా సబ్సిడీ రూ. 1674 పోగా రూ. 1116 రైతుల చెల్లించాల్సి ఉంటుందన్నారు. జీలుగ విత్తనాలు కావాల్సిన రైతులు పట్టా పాస్ బుక్ జిరాక్స్ సమర్పించి సోమవారం నుండి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కమలాపూర్ లో గాని, ఆగ్రోస్ అంబాల నుండి తీసుకోవచ్చని తెలిపారు.

## జనగామలో దొంగతనం



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి :** జనగామ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ ఏరియాలో భారీ దొంగతనం జరిగింది. మార్కెట్ వెనక బాగం సమాదులకు వెల్లె రోడ్డులోని గొల్లపల్లి వెంకటేష్ ఇంట్లో దొంగలు పడి ఎనిమిది లక్షల రూపాయల నగుదు, 10 తులాల బంగారం, 80 తులాల వెండి దొంగిలించుకుపోయి నట్లు బాధితులు పోలీసులకు వచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం గొల్లపల్లి వెంకటేష్ వృత్తిరీత్యా రిటైర్ట్ రైల్వే ఉద్యోగి. ఆరోగ్య సమస్య రీత్యా వారం రోజుల క్రితం సర్జరి కోసం హైదరాబాద్ వెల్లాడు. తిరిగి ఆదివారం ఇంటికి రాగా ఇంటి తాళం తీసి ఉంది. తలుపులు తెరిచి చూడగా బీరువా డోర్లు పగలగొట్టి 8లక్షల నగదు, 10 తులాలబంగారం, 80తులాలవెండి అపహరించుకుపోయారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు క్లూస్ టీంలను రంగంలోకి దింపారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు సిఐ రఘుపతిరెడ్డి తెలిపారు.

## దుర్గామాత ఆలయంలో పూజలు



**ప్రజాపక్షం/జనగామ రూరల్ :** జనగామ మండలంలోని పసరమండ్ల గ్రామంతో దుర్గామాత ఉత్సవాలు జరగగా ఆలయంలో కాంగ్రెస్ యువ నాయకులు కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో దుర్గామాతకు పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని, పిల్లా పాప, పాడి పంటలతో మంచి జీవనం కొనసాగించాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలువురు కాంగ్రెస్ నాయకులు ప్రశాంత్‌రెడ్డికి స్వాగతం పలికారు.

## ఇల్లందలో అపూర్వ సమ్మేళనం



**ప్రజాపక్షం/వర్ధన్నపేట:** వర్ధన్నపేట మండలం ఇల్లంద ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1996 ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం ఆదివారం కన్నుల పండువగా జరిగింది. అలనాటి గుర్తుగా గురువులతో కలసి విద్యార్థులు పాఠశాలలో మొక్కలునాటారు. 75 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్న కార్యక్రమంలో పాల్గొన్న బ్యాచ్ మేట్స్ చదువుకునే రొజులను గుర్తుచేసుకుని గురువులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆద్యంతం చిన్ననాటి స్మృతులను నెమరువేసుకుంటూ ఉల్లాసంగా గడిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో నాటి ప్రధానోపాధ్యయుడు జయపాల్ రెడ్డి, ఉపాధ్యాయులు రామచంద్రారెడ్డి, రవికుమార్, శ్రీహరి, శ్రీనివాస్, సూర్యనారాయణ, రమేష్ బాబు, కత్తి కుమారస్వామి,లక్ష్మీనారాయణ, పూర్వ విద్యార్థులు గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, బీఆర్ఎస్ వర్ధన్నపేట మండల అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి, ప్రముఖ యోగా గురు పోషాల శ్రీనివాస్, శ్రీపాద రాము, నూక శ్రీధర్, కుమ్మం శోభన్ బాబు, ఉపేందర్, నాగరాజు, వేణు, విద్యాసాగర్, వేణు, రాజు, సారంగపాణి, సురేష్, లావణ్య, దీప, లలిత, జీవనజ్యోతి, సునీత, రజిత. తదితరులు పాల్గొన్నారు.

## 'తడిసిన ధాన్యం కొనాల్సిందే'

**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** కళ్లాల్లో వర్షానికి తడిసిన వరి ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలని బిఆర్ఎస్ మండల అధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ జేశారు. ఆదివారం జగదేవ్‌పూర్‌లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన సందర్భంగా రైతులతో కలసి మాట్లాడారు. మండలంలో వరి ధాన్యం కొనుగోల్లు నత్తనడక సాగుతుండటంతో వర్షాలకు కళ్లాలలో ధాన్యం తడిసిపోయి రంగు మారుతందని వారన్నారు. ఈ క్రమంలో తేమ శాతంతో సంబంధం లేకుండా త్వరితగతిన ధాన్యం కొనుగోలుచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ జేశారు. అలాగే ప్రభుత్వం ప్రకటించిన బోనస్ రూ. 500లను సన్న, దొడ్డు రకాల ధాన్యంకు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొండపోచమ్మ ఆలయం మాజీ చైర్మన్ ఉపేందర్‌రెడ్డితో పాటు పలువురు బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



# పనులు నాణ్యతగా నడిచేనా?

పూజారుల అతిథి గృహా నిర్మాణాల్లో కమీషన్లు
సర్వత్రా చర్చోపచర్చలు



**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి :** ఆసియా ఖండంలోనే అతి పెద్దదైన మేడారం జాతరకు దేశ నలుమూలల నుండి అనేక సంఖ్యలో భక్తులు వచ్చి సమ్మక్క సారలమ్మలను దర్శించుకుంటారు. అలాగే రాష్ట్ర మంత్రులు, కేంద్ర మంత్రులు కూడా సమ్మక్క సారలమ్మలను దర్శించుకునేందుకు చాలా దూరం నుండి వస్తారు. వచ్చిన మంత్రులకు మేడారం పూజారులు స్వాగతం పలికి సమ్మక్క సారలమ్మల గద్దెలకు వద్దకు తీసుకెళ్ళి వారికి ప్రత్యేక పూజలు చేస్తుంటారు. ఇలా ఎన్నో సంవత్సరాలు చేసిన పూజారులకు అతిథి గృహాలు లేక ఇబ్బంది పడుతున్నారు. వారిని గుర్తించిన కాంగ్రెస్ ప్రభుత్వం మంత్రి సీతక్క 17వ తేదీన జనవరి ఒకటో నెలలో రూ.1.5 కోట్ల నిధులను మేడారం పూజారులకు అతిధి గృహాల నిధులను రూ.1.5 కోట్లతో మంజూరు చేశారు. మేడారం జాతర అనంతరం పూజారుల అతిధి గృహం పనులు ప్రారంభమయ్యాయి. కానీ విడ్డూరం ఏమిటంటే ఆ కాంట్రాక్టర్, మేడారం ఈవో కుమ్మక్కై పూజారుల అతిథి గృహాలలో కమిషన్‌కు కక్కుర్తి పడుతున్నట్లు సమాచారం. ఎన్నో సంవత్సరాలుగా పూజారులుగా పనిచేస్తున్న వారికి అతిధి గృహాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. అయినప్పటికి ప్రభుత్వం నిధులు ఇచ్చిన అనంతరం ఈవో నిధులపై కన్నేశాడు. ఆ నిధులలో పర్సంటేజ్ కొరకు చూస్తున్నట్లు తెలుస్తుంది. దీనిపై పూజారుల సంఘంలోనే ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి పూజారుల అతిధి గృహాలకు నాణ్యతగా కట్టించే విధంగా ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.1.5 కోట్లతో నిధులు కేటాయించి ఆ నిధులను పూజారుల అతిథి గృహానికి ఖర్చు చేయాలని పలువురు అంటున్నారు.

## ఇసుక అక్రమ తరలింపు ట్రాక్టర్ సీజ్



**ప్రజాపక్షం/రఘునాథపల్లి:** మండలంలోని మండలగూడెం గ్రామంలోని వాగు నుండి ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్నారన్న పక్కా సమాచారంతో ఆదివారం పోలీసులు ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్రమంగా వాగు నుండి ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ పర్శ రాజశేఖర్, పర్శ గట్టయ్యలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దూదిమెట్ల నరేష్ తెలిపారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా మండలంలో ఎవరైనా ట్రాక్టర్లతో అక్రమంగా ఇసుక తరలిస్తే వారిపై చట్టరీత్యా చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

# శివాని విద్యార్థుల విశ్వరూపం



**ప్రజాపక్షం/హన్మకొండప్రతినిధి :** ఎప్‌సెట్ ఫలితాలలో హన్మకొండలోని శివాని జూనియర్ కళాశాల విద్యార్థులు మరోసారి విశ్వరూపం ప్రదర్శించినట్లు కళాశాల కరస్పాండెంట్ టి.స్వామి తెలిపారు. శనివారం ప్రకటించిన ఎప్‌సెట్ ఫలితాలలో శివాని కళాశాల విద్యార్థులు చరిత్ర తిరగరాస్తూ మంచి ఫలితాలు సాధించారని ఆయన తెలిపారు. గుర్రం వర్షిత 3854 ర్యాంకు, చీమకుర్తి సాద్విక 4036 ర్యాంకు, వోడపల్లి అశ్విత 5731, కుసుమ శ్రీజ 6316, దాసరి స్వేత 8917, తిప్పారపు గణేష్ 9080, అరికిల్ల నిస్సీ 9732, రాయబోయిన తిరుపతి 9813, వద్దే రిషిత ప్రియ 10668,తనుగుల శృతి 12011, ఆంగోతు అఖిల్ 12559, గుగులోతు సంగీత 12661, మాసిపెద్ది జస్వంత్ 12994, సాదెం స్రవంతి 13879, ఒజ్జెల రమేష్ 13894,కోమాకుల రవళిక 14215, పెంతల అక్షయ 15208, రొండ్ల శివ ప్రసాద్ 16005, మహ్మద్ రియాజ్ 16006,బానోతు బన్ని 16290,దాసరి సంజయ్‌కుమార్ 16851,బైకాని వెన్నెల 17705,గుగులోతు చందన 17797,ఎ.రితీష్ 19188,బొరిగం వెన్నెల 20350, బదావత్ సింధు 20670, బురుగు శ్రీజ 20937, సింగారపు శివ వర్దన్ 21410, పోతర బోయిన భువన 21543, తీగల స్పందన 22014, అంగోజు శ్రీజ 22679, కాసా రస్మిత 23204, గోనె శివాని 23485, బచ్చలి వాసవి 24038, కోరె మేఘన 24245 ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను కరస్పాండెంట్ టి. స్వామి, ప్రిన్సిపల్స్ జి.సురేందర్ రెడ్డి, వి.చంద్రమోహన్, డైరెక్టర్లు టి. రాజు, ఎన్ రమేష్, ఏ.మురళీధర్, వి.సురేష్, ఎస్. సంతోష్ రెడ్డి అభినందించారు. ఈ విజయానికి సహకరించిన కళాశాల అధ్యాపకులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు,శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలిపారు.

## నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

నకిలీ విత్తనాల రవాణా, విక్రయాలపై
ప్రత్యేక నిఘా..
సిద్దిపేట పోలీస్ కమిషనర్
బి.అనురాధ



**ప్రజాపక్షం/సిద్దిపేట ప్రతినిధి :** బ్రాండెడ్ కంపెనీల పేరుతో కాలం చేల్లిన,నకిలీ విత్తనాలను విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సిద్ది పేట పోలీస్ కమీషనర్ బి.అనురాధ తెలిపారు.ఆదివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కరీఫ్‌లో పంటలు సాగు చేసేందుకు రైతులు సన్నద్దమవుతున్న సమయంలో నకిలీ విత్తనాలు విక్రయించే ముఠా బారిన పడకుండా రైతులకు నాణ్యమైనా విత్తనాలు అందించేందుకు డిజిపి ఆదేశాల మేరకు నకిలీ విత్తనాలను అరికట్టేందుకు సిద్దిపేట పోలీస్ కమీషనరేట్ పరిధిలో టాస్క్‌ఫోర్స్ సిబ్బందిని ఏర్పాటు చేశామని అన్నారు.జిల్లా పరిధిలోని విత్తన,ఎరువులను,గోడౌన్లను రవాణ వాహనాలను అకస్మికంగా తనిఖీలు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.అనుమతులు లేకుండా అక్రమంగా విత్తనాలు విక్రయిస్తే వారిపై పిడీ యాక్ట్ నమోదు చేయడానికి వెనుకడుగు వేయమని హెచ్చరించారు.

## 'ఆశా'లకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18వేలు ఇవ్వండి



**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధిః** ఆశాలకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18వేలు ఇవ్వాలని, పిఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని, అదేవిధంగా ప్రభుత్వం నిర్వహించ తలపెట్టిన ఎగ్జామ్‌పై వెంటనే స్పష్టత ఇవ్వాలని సిఐటియూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ అన్నారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో నీలాదేవి అధ్యక్షతన ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా విస్రృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో అన్ని గ్రామాల్లో అన్ని రకాల ఆరోగ్య సేవలు అందిస్తున్న ఆశాలకు కాంగ్రెస్ ప్రభుత్వం తమ మ్యానిఫెస్టోలో పెట్టిన విధంగా రూ. 18వేలు ఇవ్వాలని, ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయం చేసి వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుండె బోయిన రవిగౌడ్, చుంచు మంజుల, నాగమణి, దేవి, సరిత, పాపా, సంధ్య, భాగ్యలక్ష్మి, రమాదేవి, చంద్రావతి, రజిత, సుభద్ర, రమణమ్మ, 50 మంది ఆశాలు పాల్గొన్నారు.

## అధైర్యపడొద్దు..అండగా ఉంటాం

తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే
కొనుగోలు చేస్తుంది
ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



**ప్రజాపక్షం/పాలకుర్తి:** గత నాలుగు రోజులుగా కురిసిన వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, రైతులు అదైర్యపడొద్దని అండగా ఉంటామని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. ఆదివారం కాంగ్రెస్ పార్టి నియోజకవర్గ ఇంచార్జి హనుమాండ్ల ఝాన్సిరెడ్డితో కలిసి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మాట్లాడుతూ వర్షాలకు ధాన్యం తడిసిందని రైతులు ఆందోళన చెందొద్దన్నారు. కొనుగోలు కేంద్రాలలో ఉన్న ధాన్యాన్ని చివరి గింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. తడిసిన ధాన్యాన్ని రైస్ మిల్లర్లు కటింగ్‌లు చేయరాదని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలలో ఉన్న ధాన్యాన్ని యుద్ధ ప్రాతిపదికన తరలించేందుకు ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# ఇన్సెంటివ్ డబ్బు విడుదల చేయాలి



పట్టు రైతుల సహకార సంఘం జిల్లా
అధ్యక్షుడు ఐలయ్య

**ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్:** ప్రభుత్వం పట్టు రైతులకు ఇచ్చిన ప్రోత్సహకాన్ని మార్కెట్లో పట్టు గూళ్ళు అమ్మిన వెంటనే చెల్లించాలని ఇన్సెంటివ్ సైతం రేతుల ఖాతాల్లో జమ చేయాలని పట్టు రైతుల సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దోళ్ళ ఐలయ్య,ప్రధాన కార్యదర్శి వెంకటరామిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు.ఆదివారం సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సమావేశంలో వారు మాట్లాడుతూ పట్టు గూళ్ళు మార్కెట్లో అమ్మకంలో అవకతవకలు జరుగకుండా పారదర్శకంగా కొనుగోళ్ళు జరిగేల ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. విక్రయ కేంద్రాల్లో కనీస వసతులు లేవని మౌళిక సదుపాయాలను కల్పించాలని డిమాండ్ చేశారు.పెండింగ్లో ఉన్న ఇన్సెంటివ్ బకాయిలను వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేవారు.మందులు,ఇతర సామాగ్రిని 90 శాతం సబ్సిడితో ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో పట్టు రైతుల సహకార సంఘం కోశాధికారి రాగుల రాజు,జిల్లా కమిటీ సభ్యులు పెద్దోళ్ళ నర్సింహులు,రేగుల దేవయ్య, సంతోస్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంఎల్‌సి అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపించాలి



**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధిః** కాంగ్రెస్ పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థి తీన్మార్ మల్లన్నను అధిక మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఎండి అప్సర్ పాషా, జడ్పిటిసిలు అన్నారు.ఆదివారం మండల కేంద్రంలో ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత పదేండ్ల పాలనలో దొరల అహంకారం, అక్రమాల్లో తెలంగాణ రాష్ట్ర తెలంగాణ యువత భవిష్యత్తు నిర్వీర్యం అయిందని, యావత్తు తెలంగాణ ప్రజలు కోరుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని సోనియాగాంధీ ఇస్తే బిఆర్ఎస్ పార్టీ తెలంగాణ ప్రజల ఆస్తులను కొల్లగొట్టి, విద్య, ఉద్యోగాలు లేకుండా యువతను మోసం చేశారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ వచ్చిన ఐదు నెలల్లో కాంట్రాక్టు ఉద్యోగులను శాశ్వత పద్ధతిలో ఎంపిక చేసిందని, మెగా డిఎస్సి వేసిందని, ములుగులో వైద్య కళాశాల ప్రారంభం చేసి వైద్య కళాశాల యందు అలాగే ఆరోగ్యశాఖ నందు ఉద్యోగాల భర్తీ చేపట్టిందని తెలిపారు. ప్రశ్నించే గొంతుకు తీన్మార్ మల్లన్నను అధిక మెజార్టీతో గెలిపించాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో కన్నాయిగూడెం మండల జడ్పిటిసి నామకరం చందు, వైస్ ఎంపిపి బొల్లె భాస్కర్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు అబ్బు రమేష్, మండల ఎస్‌సి సెల్ అధ్యక్షులు సునార్కని రాంబాబు, జిల్లా టిపిసిసి మీడియ కోఆర్డినేటర్ సునార్కని సాంబశివ, కన్నాయిగూడెం టౌన్ అధ్యక్షుడు నగేష్, మండల కోఆర్డినేటర్ దుర్గం ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

## 'జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి'

**ప్రజాపక్షం/శాయంపేట :** హన్మకొండ జిల్లా శాయంపేట మండల నూతన ప్రెస్‌క్లబ్‌ను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆదివారం ప్రారంభించారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. నూతనంగా ఎన్నికైన మండల ప్రెస్‌క్లబ్ కార్యవర్గాన్ని అభినందించారు. శాయంపేట ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కాళేశ్వరం నర్సయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఐజేయు రాష్ట్ర కార్యదర్శి గాడిపెల్లి మధు, కార్యవర్గ సభ్యులు గుంటి విద్యాసాగర్, వరంగల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామ్‌చందర్, దుర్గాప్రసాద్, జాతీయ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కొండం రవిందర్ రెడ్డి, కంకనాల సంతోష్, వేణు మాధవరావు, జిల్లా కోశాధికారి బచ్చు పురుషోత్తం జిల్లా సహాయ కార్యదర్శి గన్ను సంతోష్, కార్యవర్గ సభ్యులు ముదిగిరి ఓదెలు, శాయంపేట ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** వట్టిపల్లి, బస్వాపూర్‌లో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఇరువురి కుటుంబాలకు మండల రజక సంఘం ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందజేశారు. ఆదివారం వట్టిపల్లి, బస్వాపూర్‌లో మృతులు కొమ్మాట లక్ష్మీ , బస్వరాజు యాదగిరి కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. మండల రజక సంఘం నాయకులు యాదగిరి, బాల్‌నర్సయ్య, నర్సింలు, పాండు, సాయిబాబా, దుర్గయ్య, యాదగిరి, చంద్రయ్య,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# 'పట్టభద్రుల' కోసం ప్రశ్నించే గొంతును గెలిపిద్దాం

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



**ప్రజాపక్షం/తొర్రూరు :** వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ బలపర్చిన ఏనుగుల రాకేశ్‌రెడ్డి గెలుపు కోసం కార్యకర్తలు, నాయకులు, ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఆదివారం డివిజన్ కేంద్రంలోని శ్రీనివాసగార్డెన్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డిని భారీ మెజారిటితో గెలిపించాలని కోరుతూ వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఉప ఎన్నిక నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. మాజీ మంత్రి దయాకర్‌రావు మాట్లాడుతూ పట్టభద్రుల కోసం ప్రశ్నించే గొంతు రాకేశ్‌రెడ్డిని ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. నాడు కేసీఆర్ హయాంలో 24గంటల కరెంటు, రైతు బంధు, రైతు భరోసా సమయానికి అన్నదాతలకు అందేదని చెప్పారు. ఈరోజు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రైతులను ఆగం చేసిందని అన్నారు. రాష్ట్రంలో పదేళ్లలో రెండు లక్షల ఉద్యోగాలు ఇచ్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి ముప్పై వేల ఉద్యోగాలు ఇచ్చామని అబద్దపు ప్రచారాలు చేసుకుంటున్నారని అన్నారు. బీఆర్ఎస్ పాలనలో జరిగిన నియామకాలను కాంగ్రెస్ ఖాతాలో వేసుకోవడం ప్రజలు గమనించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందన్నారు. వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి స్వయంకృషితో పైకి వచ్చాడని చెప్పారు. ఎన్నికల్లో అబద్దాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పే సమయం పట్టభద్రులకు వచ్చిందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికను సవాల్‌గా తీసుకొని ప్రతీ ఒక్క గ్రాడ్యుయేట్ ఓటర్లను కలవాలన్నారు. ఈ నెల 22న తొర్రూరులో జరిగే పట్టభద్రుల బహిరంగ సభ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య, జెడ్పీటీసీ, జెడ్పీఫ్లోర్ లీడర్ మంగళపల్లి శ్రీనివాస్, బీఆర్ఎస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ సమన్వయ కర్త, సీనియర్ నాయకులు డాక్టర్ పొనుగోటి సోమేశ్వర్‌రావు, గాంధీనాయక్, బిల్లా సుధీర్‌రెడ్డి, సుందర్, రాంరెడ్డి, నవీన్, రాంచంద్రయ్యశర్మ, ఎన్నమనేని శ్రీనివాసరావు, అనుమాండ్ల ప్రదీప్‌రెడ్డి, కుర్ర శ్రీనివాస్‌గౌడ్, అయిలయ్య, చకిలేల మణిరాజ్, పేర్ల జంపా, తూర్పాటి రవి, కర్నె నాగరాజు, వివిధ మండలాల బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, పట్టభద్రులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## గౌతమబుద్ధుడు చూపించిన మార్గంలో నడవాలి



**ప్రజాపక్షం/కొత్తూరు:** గౌతమ బుద్ధుడు చూపించిన సన్మార్గంలో నడిచేందుకు ప్రతిఒక్కరు కృషి చేయాలని కొత్తూరు మున్సిపల్ చైర్‌పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్ సూచించారు. ఆదివారం కొత్తూరు మున్సిపల్ పరిధిలోని తిమ్మాపూర్‌లో గౌతమ బుద్ధుడి జయంతి వేడుకలు నిర్వహించారు. గౌతమ బుద్ధుడి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ సమాజంలో అసమానతలు కులదోసి, సమానత్వాన్ని నెలకొల్పిన మహనీయుడు గౌతమ బుద్ధుడని పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కోస్గి శ్రీనివాస్, భాస్కర్‌గౌడ్ ఉన్నారు.

## చదువుకు పేదరికం అడ్డు రావద్దన్నదే లక్ష్యం



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** విద్యకు పేదరికం అడ్డు కాకుడదన్నదే మద్దూరి ఫౌండేషన్ లక్ష్యమని బిసిసంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు, ఫౌండేషన్ చైర్మన్ మద్దూరి అశోక్‌గౌడ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఫౌండేషన్ కార్యాలయంలో కొందుర్గు మండలం చిన్న ఉమ్మెంత్యా గ్రామంలో అంబేద్కర్ విగ్రహఏర్పాటుకు రూ.పది వేలు ఆర్థిక సహాయం చేశారు. ఈ సందర్భంగా అశోక్‌గౌడ్ మాట్లాడుతూ మూడేళ్లుగా ఫౌండేషన్ ద్వారా విద్యార్థులకు ఆర్థిక సహాయంతోపాటు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంబేద్కర్ అడుగు జాడల్లో నడిచి వారి ఆశయసాధన కోసం కృషి చేయాలని అశోక్‌గౌడ్ కోరారు.

## ఘనంగా అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవ వేడుకలు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం వేడుకలను సాలార్‌జంగ్ మ్యూజియంలో ఘనంగా నిర్వహిచారు. డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్, సాలార్‌జంగ్ మ్యూజియం సహకారంతో, జెబిఆర్ ఆర్కిటెక్చర్ కళాశాల, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటి) హైదరాబాద్ డిజైన్ విభాగం, టిఎస్ఎఎ, తెలంగాణ టూరిజం, ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆన్ మాన్యుమెంట్స్ అండ్ సైట్స్, ఇండియా సౌత్ జోన్, సంయుక్త ఆధ్వర్యంలో 'మ్యూజియమ్స్ ఫర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్' అనే థీమ్‌తో ఆదివారం అంతర్జాతీయ మ్యూజియం దినోత్సం– 2024 వేడుకలను నిర్వహిచారు.ఐసిఓఎంఎస్ ఇండియా సౌత్ జోన్ ప్రతినిధి ప్రొఫెసర్ జీఎస్వి సూర్యనారాయణ మూర్తి ప్రముఖులను వేదికపైకి ఆహ్వానించగా సాలార్ జంగ్ మ్యూజియం అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నాగేశ్వర రావు,డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ చైర్మన్ వేద కుమార్ మణికొండ, ఐఐటి హైదరా డిజైన్ విభాగం ప్రొఫెసర్ దీపక్ జాన్ మాథ్యూస్, ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా రిటైర్డ్ డిప్యూటీ సూపరింటెండింగ్ ఆర్కియాలజిస్ట్ సి.హెచ్. బాబ్జీరావు, ఐకామ్, ఇంటర్ కామ్ కార్యదర్శి నితిన్ ఆర్ సిన్హా ,టిఎస్ఎఎ ఉపాధ్యక్షులు గణేష్ కుమార్ తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మ్యూజియంలో యొక్క ప్రాధాన్యతతో పాటు అవశ్యకతను వక్తలు వివరించారు.

## ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సుల స్కాలర్‌షిప్ పరీక్షకు భారీస్పందన



**ప్రజాపక్షం/హయత్ నగర్ :** ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సులకు స్కాలర్షిప్ పరీక్ష నిర్వహించడం అనేది ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ఇది ఒక గొప్ప సువర్ణ అవకాశం అని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ డిజైనింగ్ సంస్థ డైరెక్టర్ కన్నెబోయిన రాము యాదవ్ తెలిపారు.

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ డిజైనింగ్, చైతన్యపురి వారి ఆధ్వర్యంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు గల ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సులకు స్కాలర్షిప్ పరీక్ష నిర్వహించడం జరిగింది.ఆయా కోర్సులలో చేరుటకు ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ఇది ఒక గొప్ప సువర్ణ అవకాశం అని సంస్థ డైరెక్టర్ కన్నెబోయిన రాము యాదవ్ వివరించారు. ఇట్టి పరీక్షకు తెలుగు రాష్ట్రాలలోని గ్రామీణ, పట్టణ ప్రాంతలకు చెందిన సుమారుగా 60 మంది విద్యార్థులకు పైగా పరీక్ష రాసినట్లు చెప్పారు.వీరిలో ర్యాంకులను బట్టి సుమారుగా 8 లక్షల వరకు ఆర్థిక సహాయాన్ని సంస్థ అందజేస్తునట్లు ఆయన తెలిపారు.మే19న నిర్వహించిన పరీక్షకు హాజరు కాలేకపోయినా అనేకమంది విద్యార్థునుల విజ్ఞప్తి మేరకు మరో పరీక్ష జూన్ మూడో వారంలో నిర్వహిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ రాము యాదవ్ తెలిపారు.ఫ్యాషన్ డిజైనింగ్ లో అందిస్తున్న డిప్లమో,పిజిడిప్లమో,డిగ్రీ వంటి కోర్సులుకు రోజురోజుకు ప్రాధాన్యత పెరుగుతుందని,యువత ఈ అవకాశాన్ని వినియోగించుకొని ఉద్యోగ,ఉపాధి అవకాశాలు పొందాలని తెలియజేశారు. ఆసక్తిగలవారు 9030610033/ 9030610055 సంప్రదించవచ్చు అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అకడమెక్కించార్జ్ భవాని, అధ్య,తదితరులు పాల్గొన్నారు.

## సుందరయ్య ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలి



**ప్రజాపక్షం/యాచారం :** సుందరయ్య ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని సిపిఐ(ఎం) రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి కాడిగళ్ళ భాస్కర్ అన్నారు. అదివారం యాచారం మండల కేంద్రంలోని డి ఎస్ఆర్ గార్డేన్ లో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సభ జరిగింది. సభకు అయన ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడారు. దక్షిణ భారత దేశం. ఉధ్యమ కమ్యూనిస్టు నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య అని కొనియాడారు. ఉత్తమ పార్లమేటేరియన్‌గా పేరు సంపాదించాలరన్నారు. పార్లమేంటుకు సైకిల్‌పై వెళ్ళి తన ఉధార స్వభావాన్ని పెపోందించుకున్నాన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య అడుగుజాడల్లో ప్రతిఒక్కరు నడువాలన్నారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి మాజీ రాష్ట్ర కార్యదర్శి జగన్, పార్టీ యాచారం మండల కార్యదర్శి ఎ.నర్సింహ్మా, నాయకులు పి.అంజయ, బ్రహ్మయ్య, జంగయ్య, తావునాయక్, యంజె వినోద్, పిరాటి వేంకటయ్య, ఉడుతల జంగయ్య, లాజర్, శ్రీమాన్నారాయణ. అరుణ. పుష్ప పాల్గొన్నారు.

## విశ్వకర్మ భవన నిర్మాణానికి ఆర్థిక సహాయం అందజేత



**ప్రజాపక్షం/యాచారం :** మండల పరిధిలోని మేడిపల్లి గ్రామంలో విశ్వకర్మ భవణ నిర్మాణం కోసం 20 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేసినట్లు మేడిపల్లి మాజీ ఎంపిటిసి మోటే శ్రీశైలం తెలిపారు. ఈసంధర్భంగా అయన మాట్లాడుతూ తన వంతు సహాయంగా భవన నిర్మాణం కోసం అర్థిక సహాయం అంద జేశానన్నారు. విశ్వకర్మలకు తాను అండగా ఉంటానన్నారు. భవన నిర్మాణానికి దాతలు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో చంద్రయ్య, నర్సింహ్మా, శ్రీను, జంగయ్య, మల్లేశ్, రవి, మల్లేశ్, సుందరయ్య, మధు. ప్రకాశ్ పాల్గొన్నారు.

# పెరిగిన స్టీల్ బ్రిడ్జి అంచనా వ్యయం

రూ.100 కోట్లు పెరిగిన అంచనాలు
రెండు బ్రిడ్జిలలో ఒకటే మాత్రమే నిర్మాణం
ప్రతిపాదించిన అధికారులు
పక్కనపెట్టేసిన స్థాయిసంఘం సభ్యులు
పూర్తి లెక్కలు తేవాలని ఆదేశించిన మేయర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ములిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా మారింది మహానగర పాలక సంస్థ(జిహెచ్ఎంసి) పరిస్థితి. ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించేందుకు గత ప్రభుత్వం చేపట్టిన వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి కార్యక్రమం(ఎస్ఆర్‌డిపి) ప్రాజెక్టు పనుల జాప్యంతో అంచన వ్యయం పెరిగి తడిసిమోపెడవుతోంది. నగరంలో చేపట్టిన ప్రాజెక్టులు ముందుగా నిర్ణయించిన సమయానికి పూర్తికాకపోవడంతో కాంట్రాక్టర్లు అంచన వ్యయం పెంచేస్తున్నారు. అంచన వ్యయం పెరిగి, జిహెచ్ఎంసికి ఆర్థికభారంగా మారుతోంది. నగరంలో జిహెచ్ఎంసి చేపట్టిన ప్రాజెక్టు పనుల అంచన వ్యయం కంటే జాప్యం కారణంగా 20 నుండి 30 శాతం ప్రాజెక్టు వ్యయం పెరుగుతోంది. అయితే ఇలా ప్రాజెక్టు వ్యయం పెరగడం పనులు అనుమానాలకు తావిస్తోంది. అన్ని ప్రాజెక్టులపై కలిపి ఇప్పటి వరకు రూ. 1600 కోట్ల అదనపు భారం అయ్యింది. కొన్ని ప్రాజెక్టుల్లో 4 నుండి 5 శాతం అధికంగా కాంట్రాక్టర్లు ధరలు కోట్ చేశారు. ఇక ఆర్‌టిసి ఇందిరా పార్కు విఎస్‌టి వరకు నిర్మించిన స్టీల్‌బ్రిడ్జి ప్రాజెక్టుపై రూ.100 కోట్లు పెరగడంపై పూర్తి స్థాయి విచారణ చేయాలని నగర వాసులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అందుకు కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలంటున్నారు. ప్రాజెక్టు పూర్తైన అయిన 8 నెలల తరువాత రూ.100 కోట్లు అదనంగా ఖర్చు అయ్యిందంటూ అనుమతుల కోసం ప్రణాళికలు సిద్ధం చేశారు.

### విశాఖ స్టీల్ వినియోగం-ధరల పెరుగుదలకు ఉక్రెయిన్– రష్యా యుద్ధంతో లింకు

బ్రిడ్జి నిర్మాణంలో విశాఖ స్టీల్ వినియోగించారు. అయితే ధరల పెరుగుదలను మాత్రం రష్యా ఉక్రెయిన్ యుద్ధంతో లింకు పెట్టారు. యుద్ధం కారణంగా స్టీల్ ధరలు పెరిగాయని, అందుకు అంచనా వ్యయాన్ని పెంచేశారని తెలిసింది. ఇందిరాపార్కు విఎస్‌టి స్టీల్ బ్రిడ్జి నిర్మాణం కోసం ప్రాజెక్టు వ్యయం రూ. 350 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు రూపొందించారు. మొదటి దశలో ఇందిరాపార్కు విఎస్‌టి, రెండవ దశలో రాంనగర్ బాగ్‌లింగంపల్లిలో చేపట్టాలని నిర్ణయించారు. 2020 జూలై నెలలో పనులు ప్రారంభించారు. 24 నెలల్లో పనులు పూర్తి కావాల్సి ఉంది. అయితే 37 నెలల సమయం తీసుకున్న అధికారులు 2023 ఆగస్టులో దానిని అందుబాటులోకి తీసుకొచ్చారు. అంటే 13 నెలలు ఆలస్యంగా ప్రాజెక్టు అందుబాటులోకి వచ్చింది. అయితే ప్రాజెక్టు ప్రారంభమైన ఏడు నెలల తర్వాత ఇప్పుడు ఆ ప్రాజెక్టుకు మరో రూ.100 కోట్ల అదనంగా ఖర్చు అయ్యాయని, వాటిని చెల్లించేందుకు అనుమతులు ఇవ్వాలాంటూ జిహెచ్ఎంసి స్థాయీ సంఘం ఆమోదానికి అధికారులు ప్రతిపాదించారు. ప్రాజెక్టు పూర్తి అయిన తరువాత ఇప్పుడు ఎలా రేటు పెరిగిందని ప్రశ్నించిన స్థాయిసంఘం సభ్యులకు అధికారులు సమాధానం చెప్పలేకపోయారు. దీంతో ఆ ప్రతిపాదనను పక్కన పెట్టి పూర్తి లెక్కలు తేవాంటూ మేయర్ అధికారులను ఆదేశించారు. అయితే ఇక్కడ చెపట్టాల్సిన రెండు ప్రాజెక్టుల్లో ఒకటి మాత్రమే పూర్తయింది. రెండవ దశలో చేపట్టాల్సిన బ్రిడ్జి నిర్మాణాన్ని నిధుల లేమితో పక్కన పెట్టేశారు. అయితే నిర్మాణం చేయని బ్రిడ్జి కోసం యుటిలిస్ తరలింపునకు వ్యయం చేశామంటున్నారు. బ్రిడ్జి కోసం 12,500 మెట్రిక్ టన్నుల స్టీల్, 20 వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ వాడామని లెక్కలు చెప్పుతున్నారు. ఇప్పుడు చెబుతున్న లెక్కల ప్రకారం కేవలం అందులో వాడిన స్టీల్‌కు రూ.55 కోట్లు అధికంగా అయిందని, రష్యా ఉక్రేయిన్ యుద్ధం కారణంగా స్టీల్ ధర పెరిగిందని అధికారులు చెప్పడం ఇప్పుడు అందరిని విస్మయానికి గురి చేస్తోంది. అయితే ఈ స్టీల్ బ్రిడ్జ్ కోసం వచ్చిన స్టీల్‌ను విశాఖ స్టీల్ ప్లాంట్ నుండి తీసుకున్నామని అదే అధికారులు చెప్పుడం గమనర్హం. ధరల పెరుగుదలపై అధికారులు చెబుతున్న లెక్కలకు పొంతన లేకుండా పోతోంది. క్షేత్రస్థాయి అధికారులు ఒక లెక్కలు, ప్రదాన కార్యాలయం అధికారులు మరో లెక్కలు చెప్పడం పలు అనుమానాలకు తావిస్తోంది.

### రూ.6 వేల కోట్ల నుంచి రూ.7500 కోట్లకు పెరిగిన అంచనా వ్యయం..

ఎస్ఆర్‌డిపి ప్రాజెక్టులను రూ. 29 వేల కోట్ల అంచన వ్యయంతో ప్రతిపాదనలు రూపొందించారు. ఎస్ఆర్‌డిపి ద్వారా ఇప్పటికే నగరంలో ప్రధాన రోడ్లు, జంక్షన్‌లలో ప్లైఓవర్లు, అండర్ పాస్‌లు, గ్రేడ్ సపరేటర్లు నిర్మించారు. కొన్ని పూర్తి కాగా మరికొన్ని మాత్రం నత్తనడకన సాగుతున్నాయి. ప్లైఓవర్ నిర్మాణంలో కాంట్రాక్టర్లు, అధికారులు నిర్లక్ష్యం కారణంగా జాప్యం జరుగుతోంది. ఇది కాస్త ప్రాజెక్టు అంచనా వ్యయం పెరగడంతో జిహెచ్ఎంసికి ఆర్థిక భారంగా మారుతోంది. ఇప్పటి వరకు చేపట్టిన ప్రాజెక్టులలో అస్సలు వ్యయం రూ. 6 వేల కోట్లు కాగా, ప్రాజెక్టులు పూర్తయ్యే సమయానికి రూ.7500 కోట్లకు చేరింది. అయితే పెరిగిన అంచనా వ్యయాన్ని ఏవిధంగా నిర్ధారించారనే అంశం హాట్‌టాపింగ్ మారింది.

## నిధులు మంజూరు చేయకుండానే శిలాఫలకం

బిఆర్ఎస్‌తో చెప్పించుకునే కర్మ కాంగ్రెస్‌కు పట్టలేదు
ఎంఎల్ఎకు అభివృద్ధి, సంక్షేమంపై అవగాహన ఉంది
బిఆర్ఎస్‌లపై కాంగ్రెస్ శ్రేణుల ఆగ్రహం



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ఏళ్ల చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీకి ప్రాంతీయ పార్టీ బిఆర్ఎస్‌తో చెప్పించుకునే కర్మ పట్టలేదని ఫరూఖ్‌నగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, యువ నాయకుడు దేవగిరి అశోక్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని లింగారెడ్డిగూడ గ్రామంలో అడ్డగోలుగా వేసిన డ్రైనేజీ పనులను పరిశీలించడంతోపాటు నిధులు మంజూరు చేయకుండానే వేసిన శిలాఫలకాన్ని మీడియాకు చూపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాసన సభ ఎన్నికల ముందు బిఆర్ఎస్ నేతలు హడావుడి చేసి రూ.75లక్షలతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు మంజురు చేశారు. కానీ అందుకు సంబంధించిన నిధులు మంజూరు చేయకుండానే గ్రామంలో శిలాఫలకం వేసి నిధులు వచ్చాయని చెప్పింది మీరు కాదా అని ప్రశ్నించారు. ఆ శిలాఫలకం విషయంలో అప్పటి ఎంఎల్ఏ అంజయ్య యాదవ్ సైతం స్థానిక బిఆర్ఎస్ నేతలపై మండిపడ్డారనే విషయాన్ని గ్రహించాలన్నారు. తన సొంత పోలం నుండి పాటుకాలువకు భూమి ఇచ్చింది నేను, అదే విధంగా లింగారెడ్డిగూడ గ్రామ శివారులో నూతనంగా నిర్మిస్తున్న వంద పసడకల ఆసుపత్రికి తాను నాలుగు గుంటల భూమి ఇచ్చామని గుర్తు చేశారు. చిల్లిగవ్వ కుండా గ్రామంలో శంకుస్థాపన ఎలా చేశారో చెప్పాలని, వంకర తింకర డ్రైనేజీ పను లు ఎవరు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. షాద్‌నగర్ ఎంఎల్ఏ వీర్లపల్లి శంకర్‌కు నియోజకవర్గ అభివృద్ధిపై పట్టు ఉందని, మంచి, చెడులపై పూర్తి స్థాయిలో అవగాహన ఉందని వివరించారు. కనుమరుగు అవుతున్న బిఆర్ఎస్‌తో కాంగ్రెస్ చెప్పించుకునే దుస్థుతి ఏమి పట్టలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఐదేళ్ళ కాలంలోనే లింగారెడ్డిగూడ గ్రామంలో శాశ్వత మురుగునీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఇప్పటికే నాణ్యత కలిగిన పైపులు వచ్చాయని వివరించారు. వాస్తవాలు తెలుసుకొని మాట్లాడితే బాగుంటుందని, నోటికి వచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. తమపై అసత్య ఆరోపణలు చేయడం మాజీ సర్పంచ్ విజ్ఞతకే వదిలేస్తున్నామని, లింగారెడ్డిగూడ గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు ఎంఎల్ఏ వీర్లపల్లి శంకర్ ప్రత్యేక దృష్టి పెట్టారని తెలిపారు.

### హోదాను మరిచి మాట్లాడితే సహించేది లేదు

స్థానిక బిఆర్ఎస్ నేతలు హోదాను విస్మరించి మాట్లాడితే సహించేది లేదని కాంగ్రెస్ యువ నాయకుడు లింగారెడ్డిగూడ అశోక్ హెచ్చరించారు. బిఆర్ఎస్ నేతలు నోటికి వచ్చినట్లు మాట్లాడితే ఉపేక్షించే పరిస్థితి లేదన్నారు. వాస్తవాలు ఎంఎల్ఎకు తెలుసని, మసిబూసి మారేడు కాయ చేసి గ్రామస్తులను తప్పుదోవ పటిస్తున్న బిఆర్ఎస్ నాయకులు వాస్తవాలు గ్రహించాలని సూచించారు. నిజాయితీ గురించి బిఆర్ఎస్ నేతలు మాట్లాడటం ఆహ్యాస్పదంగా ఉందని, ఎవరేమి చేశారో గ్రామ ప్రజలు పూర్తిగా స్థాయిలో గ్రహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ మల్లేష్ యాదవ్, మాజీ వార్డు సభ్యులు సురేష్ గౌడ్, గోదారి రమేష్ యాదవ్, చీపురు గణేష్, సందుగారి లక్ష్మీ కాంత్‌రెడ్డి, వెంకటేష్ గౌడ్, భీష్వ రమేష్, శ్రీనాథ్ యాదవ్‌లు ఉన్నారు.

## తిరుపతిరావు కమిటీ రిపోర్టును బహిర్గతం చేయాలి

ఎఐఎస్ఎఫ్ ఒయు కార్యదర్శి నెల్లి సత్య డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:**ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ల పదోన్నతుల అక్రమాలపై నియమించిన తిరుపతిరావు కమిటీ నివేధికను వెంటనే బహిర్గం చేసి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్ ఒయు కార్యదర్శి, రీసర్చ్ స్కాలర్ నెల్లి సత్య ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉస్మానియా యూనివర్సిటీలో ప్రొఫెసర్ డి. రవీందర్ వైస్ ఛాన్సలర్ అయిన తర్వాత మూడు సార్లు ప్రొఫెసర్లకు కెరియర్ అడ్వాన్స్మెంట్ స్కీం కింద సీనియర్ ప్రొఫెసర్లుగా 51 మందికి పదోన్నతులు కల్పించారు. వైస్ ఛాన్సలర్ డి. రవీందర్ తనకు అనుకూలంగా ఉన్న ప్రొఫెసర్లకు యూజీసీ, యూనివర్సిటీ నిబంధనలకు విరుద్ధంగా పక్షపాత ధోరణి ప్రదర్శిస్తూ సీనియర్ ప్రొఫెసర్లుగా పదోన్నతులు కల్పించారన్నారు. అదేవిధంగా కొంతమంది ప్రొఫెసర్లకు అన్ని అర్హతలు ఉన్న కక్షపూరితంగా వ్యవహరిస్తూ సీనియర్ ప్రొఫెసర్లుగా పదోన్నతులు కల్పించకుండా అన్యాయం చేశారని ఆరోపించారు. దీనిపైన ఉస్మానియా యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ అదేవిధంగా ఎఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘంగా పలుమార్లు అనేక ఆందోళనలు నిర్వహించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రొఫెసర్ తిరుపతిరావు కమిటీని నియమించిందని గుర్తు చేశారు. కమిటీ పలుమార్లు సమావేశమై రాష్ట్ర ప్రభుత్వానికి రిపోర్టు సమర్పించిందని అయితే ఇప్పటివరకు కమిటీ రిపోర్టును బహిర్గతపరచలేదని, ఆ నవేధికలో ఉన్న అక్రమాలకు పాల్పడిన ప్రొఫెసర్లపై చర్యలు తీసుకోలేదన్నారు. అక్రమాలకు పాల్పడిన వారిలో ఉన్నత విద్యా మండలి పెద్దలు, వివిధ యూనివర్సిటీల వైస్ ఛాన్సలర్లు, కళాశాలల ప్రిన్సిపల్స్, విభాగ అధిపతులు, పీఠాధిపతులు కూడా ఉన్నారన్నారు. అక్రమాలకు పాల్పడి సీనియర్ ప్రొఫెసర్లుగా పదోన్నతులు పొందిన కొంతమంది ప్రొఫెసర్లు వివిధ యూనివర్సిటీలకు వైస్ ఛాన్సలర్గా దరఖాస్తు చేసుకున్నారని కావున వెంటనే కమిటీ రిపోర్ట్ బహిర్గత పరిచి అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా ఆయన డిమాండ్ చేశారు.

## పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికకు బిఆర్ఎస్ ఇన్‌చార్జ్‌ల నియామకం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వరంగల్, నల్లగొండ, ఖమ్మం పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల నేపథ్యంలో నల్లగొండ జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాలకు స్థానిక ఎంఎల్ఏ, మాజీ ఎంఎల్ఏలు, కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు, బిఆర్ఎస్ సీనియర్ నాయకులను ఇన్‌చార్జ్‌లుగా నిమమించారు. ఈ మేరకు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఒక్కో నియోజకవర్గానికి స్థానిక మాజీ ఎంఎల్ఏతో పాటు మాజీ చైర్మన్లను ఇన్‌చార్జ్‌లుగా నియమించారు. దేవరకొండకు మాజీ ఎంఎల్ఏ రవీంద్రకుమార్ రమావత్, రాంబాబు యాదవ్, మిర్యాలగూడకు మాజీ ఎంఎల్ఏ నల్లమోతు భాస్కర్‌రావు, రాజీవ్‌సాగర్, మునుగోడుకు మాజీ ఎంఎల్ఏ కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, సిహెచ్ రాకేష్ కుమార్, నాగార్జున సాగర్‌కు మాజీ ఎంఎల్ఏ నోముల భగత్, విజయుడు, నకిరేకల్‌కు మాజీ ఎంఎల్ఏలు చిరుమర్తి లింగయ్య, గువ్వల బాలరాజు, నల్లగొండకు మాజీ ఎంఎల్ఏలు కంచర్ల భూపాల్ రెడ్డి, వి.శ్రీనివాస్‌గౌడ్, హుజూర్ నగర్‌కు ఎంఎల్ఏ జి.జగదీష్ రెడ్డి, ఇంతియాజ్, కోదాడకు మాజీ ఎంఎల్ఏలు బొల్లం మల్లయ్య యాదవ్, అంజయ్య యాదవ్, సూర్యాపేటకు ఎంఎల్ఏ జి.జగదీష్‌రెడ్డి, తుంగతుర్తికి మాజీ ఎంఎల్ఏ గాదరి కిషోర్ కుమార్, గోలి శ్రీనివాస్ రెడ్డి, ఆలేరుకు మాజీ ఎంఎల్ఏ గొంగిడి సునీత, గెల్లు శ్రీనివాస్ యాదవ్, భువనగిరికి మాజీ ఎంఎల్ఏ పైళ్ల శేఖర్ రెడ్డి, ఎండి ఇబ్రహీంలను ఇన్‌చార్జ్‌లుగా నియమించారు.

## హరితహారంలో ప్రజాధనం దుర్వినియోగం

బిల్లులు ఎత్తినా... కనిపించని మొక్కలు
విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** హరితహారంలో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసినట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. మొక్కలు నాటినట్లు చూపించి ఇష్టారాజ్యంగా బిల్లులు తీసుకున్నారే తప్పా నాటిన మొక్కలు ఎక్కడ కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురిసిన వెంటనే నర్సరీల నుండి మొక్కలు తీసుకువచ్చి నాటి అధికారులు, ప్రజాప్రతినిధులు పోజులు ఇస్తున్నారే తప్పా వాటి సంరక్షణ పూర్తిగా విస్మరిస్తున్నారన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలను పెంచాలని పదే పదే ప్రచారం చేసినప్పటికి క్షేత్ర స్థాయిలో మాత్రం ఆశించిన విధంగా ఫలితాలు రావడం లేదని తెలుస్తుంది. షాద్‌నగర్ నియోజకవర్గంలోని కొత్తూరు, నందిగామ, ఫరూక్‌నగర్, కేశంపేట, కొందుర్గు, జిల్లేడు చౌదరిగూడ మండల కేంద్రాలతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో గత వర్షాకాలంలో నాటిన మొక్కలు ఎక్కడ కూడా కనిపించడం లేదని ప్రజలు అంటున్నారు. వర్షాకాలంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఎంతో అట్టహాసంగా నిర్వహిస్తున్నారు..కానీ వాటిని సంరక్షించడంలో మాత్రం ఎందుకు నిర్లక్ష్యం అని ప్రజలు, విద్యావంతులు ప్రశ్నిస్తున్నారు. హరితహారం మొక్కలు నాటినప్పటి నుండి పెరిగె వరకు వాటిని కాపాడే బాధ్యత పూర్తిగా అధికారులే అయినప్పటికి నాటిన తరువాత వాటి సంరక్షణ పూర్తిగా విస్మరిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. లక్షల్లో మొక్కలు నాటితే వందల్లో రక్షిస్తున్నారే తప్పా మిగత మొక్కలు ఎక్కడికి వెళ్ళాయని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. షాద్‌నగర్ డివిజన్ లో అనేక కాలుష్య పరిశ్రమలు ఉండటంతో వాతావరణం పూర్తిగా కాలుష్యం అవుతుందని, మొక్కలు నాటితే కొంతమేరకు అయినా కాలుష్యాన్ని నియంత్రించేందుకు వీలు ఉంటుందని ప్రజలు భావిస్తున్నప్పటికి ఫలితం లేకుండా పోయిందని విద్యావంతులు వాపోతున్నారు. ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్న అధికారులపై ఉన్నతాధికారులు విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### ప్రజాధనం దుర్వినియోగం చేస్తే సహించేది లేదు

హరితహారం మొక్కలకు వినియోగించే నిధుల్లో ప్రజాధనం దుర్వినియోగం చేస్తే సహించేది లేదని ఫరూఖ్‌నగర్ జడ్పిటిసి సభ్యుడు వెంకట్‌రాంరెడ్డి అన్నారు. హరితహారంలో నాటిన మొక్కలను సంరక్షించే బాధ్యత పూర్తిగా అధికారులే ఉంటుందని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మొక్క నాటడమే కాదు పెంచేందుకు చర్యలు తీసుకోవాలని, వాటి పట్ల ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా సహించేది లేదని మండిపడ్డారు. నిధుల వినియోగంపై ఉన్నతాధికారులు సమాగ్ర విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# రైల్వే ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

టికెట్ చెకింగ్ సిబ్బందికి రక్షణ కల్పించాలి
కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు సిపిఐ పార్లమెంటరీ పార్టీ నేత బినోయ్ విశ్వం లేఖ



**న్యూఢిల్లీ :** రైల్వే ఉద్యోగుల భద్రత, ముఖ్యంగా టికెట్ చెకింగ్ సిబ్బంది రక్షణకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని సిపిఐ పార్లమెంటరీ పార్టీ నేత, పార్టీ జాతీయ కార్యదర్శి బినోయ్ విశ్వం కేంద్ర రైల్వే శాఖను కోరారు. విధుల్లో ఉన్నప్పుడు టికెట్ చెకింగ్ సిబ్బందిపై అసభ్య ప్రవర్తన, భౌతిక దాడుల నుండి రక్షించడానికి వారికి పోలీసు లేదా ఆర్‌పిఎఫ్ రక్షణ కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రైళ్ల సంఖ్యను, అనుబంధ మౌలిక సదుపాయాలను పెంచడం ద్వారా దక్షిణ రైల్వే నిర్మాణ సమస్యలను పరిష్కరించే సందర్భంలో ఉద్యోగుల భద్రత, రక్షణ చర్యలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన అన్నారు. ఈ మేరకు బినొయ్ విశ్వం కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు ఆదివారం ఒక లేఖ రాశారు. రైల్వే ఉద్యోగుల భద్రత, రక్షణకు సంబంధించిన ముఖ్యమైన విషయాలను ఆయన లేఖలో మంత్రికి వివరిస్తూ వేలాది మంది రైల్వే సిబ్బందికి సంబంధించిన ఈ సమస్యలపై తక్షణం దృష్టి సారించి పరిష్కారాన్ని కనుగొనాలన్నారు. రైల్వే ఉద్యోగులపై, ముఖ్యంగా టికెట్ తనిఖీ చేసే సిబ్బందిపై అనుచిత ప్రవర్తన, భౌతికంగా హాని కలిగించే అనేక సంఘటనలను తన దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. సాధారణ రైళ్లు రద్దీగా ఉంటాయని, ప్రజలు, రైల్వే ఉద్యోగులు పరిస్థితిని అంచనా వేయడం కష్టమని, ఇది టికెట్ తనిఖీ సిబ్బందితో వికృత ప్రవర్తనకు దారితీస్తున్నదని, అనేక సార్లు వారికి భౌతికంగా హాని తలపెడుతున్నారని ఆయన వివరించారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో రైల్వే ఉద్యోగులు తమ భద్రత, రక్షణ చర్యల పట్ల తీవ్రమైన ఆందోళన చెందుతున్నారని ఆయన పేర్కొన్నారు. రైల్వే ఉద్యోగులు, టికెట్ తనిఖీ సిబ్బంది సుదీర్ఘ పని గంటలు, నిరంతర ప్రయాణంతో తమ శారీరక శ్రమతో కూడిన ఉద్యోగాలను చేస్తున్నారన్నారు. ఈ సమస్యలపై దృష్టి సారించి పరిష్కారం చేయాలన్నారు.



## జూన్ 1వ తేదిన శ్రీశ్రీశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ ప్రవచన కార్యక్రమం

**ప్రజాపక్షం/జడ్చర్ల :** ప్రముఖ భాష్య కారుడు, సనాతన ధర్మ పోషకులు, వేద వేదాంగముల యందు నిష్టాత్ములు పూజ్యులు శ్రీశ్రీశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ ప్రవచన కార్యక్రమం తేదీ. 1 జూన్ 2024 నాడు శనివారం సాయంత్రం 5 గంటలకు చంద్ర గార్డెన్లో నిర్వహించబడును. అందుకై ఆహ్వాన సంఘం ఏర్పాటు చేయబడినది. ఈ కార్యక్రమ కరపత్రములు ఆహ్వాన సంఘం అధ్యక్షులు శ్రీ బాద్మి శివ కుమార్ ఆధ్వర్యంలో ఆహ్వాన సంఘం సభ్యుల సమక్షంలో ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భాషణమ్ వినితరించాలని శివ కుమార్ కోరినారు నేడు ఈ కార్యక్రమంలో బొడ్ల విజయ్ కుమార్, మిరియాల వేణుగోపాల్, కాలార్ జనార్ధన్, బెజగం గోపాలకృష్ణ, అమరవాది విశ్వనాథం, ఉమ్మెంతల మహేశ్వర్, శంకర్ బాబు, మంచన విఠలయ్య, ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీ సామవేదం షణ్ముఖ శర్మ ఋషిపీఠం అనే మాస ప్రతికను నిర్వహిస్తున్నారు. వేద విధాంగములు, ఉపనిషత్తులు, కావ్యములు, పురాణములు, స్తోత్రముల రహస్యమును చక్కగా వివరించి సనాతన ధర్మానికి బాసరగా నిలిచిన మహానుబావుడిని ఈ కార్యక్రమంలో పాల్గొనుటకు ఆహ్వానించడం మనందరికీ ముదావహం. జడ్చర్ల పట్టణము యొక్క కీర్తి ప్రతిష్టలను పెంచేందుకు భక్తులు ప్రయత్నం చేయాలని అందరూ తప్పక పాల్గొనాలని మిమ్మల్ని కొరుతున్నాము.



## పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

**ప్రజాపక్షం/జడ్చర్ల :** స్థానిక డా.బూర్గుల రామకృష్ణ రావు ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో 20012004 లో డిగ్రీ పూర్తి చేసుకున్న బి.కామ్ విద్యార్థులు 20 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ కళాశాలలో ఆత్మీయ కలయిక ఏర్పాటు చేసుకున్నారు. సుమారు 35మంది పూర్వ విద్యార్థులు కళాశాలలోని అలుమ్ని అసోసియేషన్ గదిలో సమావేశం ఏర్పాటు చేసుకుని గత స్మృతులను నెమరు వేసుకున్నారు. ఆనాడు తాము కూర్చున్న తరగతి గదులు, కళాశాల ప్రాంగణం అంతా కలియతిరిగి సంతోషపడ్డారు. అప్పట్లో తాము చేసిన అల్లరి, తాము చదువుకున్న ప్రదేశాలు అన్ని గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం తామే ఏయే రంగాల్లో స్థిరపడ్డామో ఒకరికొకరు తెలుసుకున్నారు. భవిష్యత్తులో ఎవరికైనా ఇబ్బందులు ఉంటే సహయం చేసుకోవాలనుకున్నారు. వారికి చదువుచెప్పిన గురువులను గుర్తు చేసుకున్నారు. తాము చదువుకున్న ప్పటికి ఇప్పటికి కళాశాల ఎంతో అభివృద్ధి చెందిందని అభివృద్ధికి కృషి చేసిన అధ్యాపకులను స్మరించుకున్నారు. ఈ సమావేశానికి అందుబాటులో ఉన్న డా.సదాశివయ్య ను ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ గత 5 సంవత్సరాల్లో ప్రస్తుత ప్రిన్సిపాల్ డా.అప్పియ చిన్నమ్మ నేతృత్వంలో ఎలాంటి అభివృద్ధి జరిగిందో వివరించారు. అనంతరం కళాశాలలోని తెలంగాణ బొటానికల్ గార్డెన్ ను సందర్శించి ప్రతి ఒక్కరు ఒక సీతా అశోక్ మొక్క నాటారు. గార్డెన్ కు అనుబంధంగా ఉన్న బయో డైవర్సిటీ అండ్ ఎడ్యుకేషన్ సెంటర్ను సందర్శించి అక్కడ జరుగుతున్న పరిశోధనలను అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తులో కళాశాలకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని పూర్వ విద్యార్థులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జగదీశ్వర్ రెడ్డి, హరికుమార్, రంజిత్‌కుమార్, రామచంద్రయ్య, భాగ్యలక్ష్మి, పుష్పలత తదితరులు ఉన్నారు.



## శ్రీకాంత్ యాదవ్ తల్లిదండ్రులను ఓదార్చిన నిరంజన్‌రెడ్డి

**ప్రజాపక్షం / అడ్డాకుల :** వనపర్తి నియోజకవర్గం అడ్డాకుల మండలం బలీదుపల్లి గ్రామానికి చెందిన శ్రీకాంత్ యాదవ్ ఇటీవల పాలమూరులో శ్రీమల్లికార్జున వైన్స్ యాజమానుల దాడిలో మరణించిన విషయం తెలుసుకున్న మాజీ మంత్రి వర్యులు సింగిరెడ్డి, నిరంజన్ రెడ్డి గ్రామానికి వెళ్లి తల్లి దండ్రులు వెంకటేష్, వేంకటేశ్వరమ్మ లను పరామర్శించి ఓదార్చారు, న్యాయపరంగా పోరాడి నిందితులకు శిక్షపడే విధంగా కృషి చేస్తారని మాజీ మంత్రి వర్యులు హామీ ఇచ్చారు, గౌరవ శ్రీసింగిరెడ్డి నిరంజన్ రెడ్డి వెంట జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్, మాజీ ఎం.పి.పి దయాకర్, పార్టీ అధ్యక్షులు వేణు యదవ్, సురేష్, మహేశ్వర్‌రెడ్డి, నాగేంద్రం యాదవ్, భీఘ్ రెడ్డి, శ్రీధర్ యాదవ్, ఆంజనేయులు, శివ, చంద్రయ్య, పార్టీ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.



## భద్రత సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలి



**ప్రజాపక్షం / మహబూబ్ నగర్ ప్రతినిధిః** ఈ.వి.ఎం.లను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ ల వద్ద ఉన్న భద్రతా సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని మహబూబ్ నగర్ పార్లమెంట్ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, జిల్లా ఎన్నికల అధికారి జి. రవి నాయక్ అన్నారు. ఆదివారం పాలమూరు యూనివర్సిటీ వివిధ విభాగాలు భవనాల్లో మహబూబ్ నగర్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధి లోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ లకు సంబంధించిన ఈ. వి. ఎం. లను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ ల వద్ద పోలీస్ భద్రతను, సి.సి. కెమెరాల పనితీరును, పోలీస్ సిబ్బంది విధుల నిర్వహణను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్ట్రాంగ్ రూమ్ ల వద్ద భద్రత కట్టుదిట్టంగా ఉండాలని, నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో మహబూబ్ నగర్ స్థానిక సంస్థల నియోజకవర్గ ఎం.ఎల్. సి. ఉప ఎన్నిక బ్యాలెట్ బాక్స్ లను భద్రపరచిన స్ట్రాంగ్ రూమ్‌లను, సి.సి కెమెరాల పని తీరు, భద్రతా ఏర్పాట్లు రిటర్నింగ్ అధికారి జి. రవి నాయక్ పరిశీలించారు.

## ప్రభుత్వ పాఠశాలలను మోడల్ స్కూల్‌గా చేస్తాం : మంత్రి జూపల్లి



**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** ప్రభుత్వ పాఠశాలలను మోడల్‌స్కూల్‌గా తయారుచేస్తానని ఎక్సైజ్ టూరిజంశాఖ మంత్రి జూపల్లికృష్ణారావు అన్నారు. ఆదివారం కొల్లాపూర్ నియోజకవర్గపరిధిలోని పెద్దమారు, పెద్దదగడ, సింగోటం,కొండూరు పాఠశాలలను సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను ప్రైవేట్ పాఠశాలలకు పంపించి డబ్బులు ఖర్చుచేసుకోవద్దని, ప్రభుత్వ పాఠశాలలను గురుకుల మోడల్ పాఠశాలలుగా తయారుచేస్తానని అన్నారు. విద్య, వైద్యానికే ప్రాధాన్యత ఇస్తానని, దానికోసం ఎంతైనా ఖర్చు చేస్తానన్నారు. విద్యార్థులకు చదువుతోపాటు ఉదయం టిఫిన్, ఆటలాడుకోవడానికి అన్ని సౌకర్యాలు కల్పిస్తామని, ప్రజలు ఏజబ్బువచ్చిన ప్రైవేట్ ఆస్పత్రికిపోయి లక్షలు ఖర్చుచేసుకోవద్దని ఆరోగ్యశ్రీద్వారా రాష్ట్రప్రభుత్వం 10లక్షల వరకు ప్రభుత్వమే భరిస్తుందని, పేదల ఆరోగ్య సంరక్షణకే కాంగ్రెస్‌ప్రభుత్వం చొరవ తీసుకుంటుందని ప్రజలుదీనిని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో రత్నగిరి ఫౌండేషన్ ధర్మతేజ, పెంట్లవెల్లి మండల ప్రెసిడెంట్ నర్సింహ్మయాదవ్, కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## జిఓ26 ప్రకారం తక్షణమే బిసి కులగణన చేపట్టాలి

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** జిఓనెం.26 ప్రకారం తక్షణమే బిసిల కులగణన చేపట్టిన తర్వాతనే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని బిసి పొలిటికల్ జేఏసి నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షులు దన్నోజు అరవింద్‌చారి డిమాండ్ చేశారు. పట్టణంలో బిసి సంఘాల సమావేశంలో ఆదివారం నిర్వహించినటువంటి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బిసిలెక్కలుతేల్చిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలన్నారు. లోక్‌సభ ఎన్నికలకోడ్ ముగిసినవెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్రప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తుందని, బిసి కులగణన రిజర్వేషన్లను పెంచకుండా ఈనిర్ణయం తీసుకోవద్దన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో సమగ్రకులగణనచేపడుతామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం జిఓ26ని విడుదలచేయడంతోపాటు 150కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించిందని గుర్తు చేశారు. ప్రభుత్వం ఎన్నికల ప్రక్రియ ముగిసినందున ఎన్నికలకు ముందు జారీచేసిన జిఓ26ప్రకారం తక్షణమే బిసికుల గణన చేపట్టాలన్నారు. ఆతర్వాతనే గ్రామపంచాయతీ, మండల, మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలన్నారు. ఇప్పటికే బిసిలు ఆర్థికంగా బలంగాలేరన్నసాకుతో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో టికెట్లు ఇవ్వలేదని రిజర్వేషన్లు పెంచకుండానే ఎన్నికలు నిర్వహిస్తే బిసిలకు తీరనినష్టం జరుగుతుందని, న్యాయపరమైన చిక్కులుఏర్పడి శాశ్వతంగా దానికిబ్రేకులుపడే ప్రమాదం ఉందన్నారు. ఒకటి, రెండునెలల్లో శాస్త్రీయంగా బిసిల లెక్కలుతీసే అవకాశం ఉందని ఆప్రక్రియ పూర్తయ్యేవరకు స్థానిక సంస్థల ఊసేవద్దన్నారు. త్వరలో బిసిలకులగణన, స్థానిక సంస్థల ఎన్నికలపై మేధావులు, రిజర్వేషన్ల నిపుణులతో మేధోమథనం సమావేశం నిర్వహించి స్పష్టమైన విధానాన్ని ప్రకటిస్తామనిఅన్నారు. ఈ సమావేశంలో నవీన్, కిరణ్ , కర్నాకర్, మల్లేష్,జగదీష్, శ్రీనివాస్, మల్లేష్,రాజు, వేణుగోపాల్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## త్వరితగతిన పనులు పూర్తి చేయాలి

### జిల్లా విద్యాధికారి గోవిందరాజులు



**ప్రజాపక్షం / వీపనగండ్ల :** మండల పరిధిలోని ఆయా పాఠశాలలో చేపట్టిన పనులను పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని విద్యాశాఖ అధికారిగోవిందరాజులు ఆదివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలో ఆవరణలో జరుగుతున్న టాయిలెట్ ,వాటర్ సంపు, ఎలక్ట్రిసిటి, మైనర్ వర్క్స్ వంటి పనులను పరిశీలించారు. మొదటిసారిగా పాఠశాలకు వచ్చిన జిల్లా విద్యాధికారి గోవిందరాజులను పాఠశాలల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ రెడ్డి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి గోవిందరాజులు మాట్లాడుతూ గతంలో విద్యార్థుల తల్లిదండ్రులతో విద్యా కమిటీలు ఉండేవని, కొత్తగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం వాటి స్థానంలో మహిళా సంఘాల ద్వారా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు వేయడం జరిగిందని తెలిపారు. మండల పరిధిలోని 18 పాఠశాలలను అమ్మ ఆదర్శ పాఠశాలలుగా ఎంపిక చేసి అన్ని రకాల మౌలిక వసతులను కల్పించడం జరుగుతుందని తెలిపారు. పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి చేపట్టిన పనులను పూర్తి చేయాలని పాఠశాలల కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డికి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి లక్ష్మణ్ నాయక్ , జిల్లా సెక్టోరియల్ అధికారి యుగేందర్ , యూటిఎఫ్ జిల్లా నాయకులు కృష్ణయ్య, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ లలితమ్మ, సిఆర్పీ వెంకటేష్ ఉన్నారు.

## వ్యర్థాలను సమర్థవంతంగా వినియోగించుకుందాం : డాకేశ్వర్ గౌడ్

**ప్రజాపక్షం / వీపనగండ్ల :** పంట పొలాల్లోని వ్యర్థాలను సమర్థవంతంగా వినియోగించుకుంటే భూసారాన్ని పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని మండల వ్యవసాయ అధికారి డాకేశ్వర్ గౌడ్ అన్నారు. ముఖ్యమైన ఆహార పంటల్లో వరి పంట ప్రధానమైనదని వరి పంట వ్యర్థాలను అధిక మొత్తంలో తగలబెట్టడం వలన భూమిలోని ముఖ్యమైన పోషకాలను కోల్పోతామని వివరించారు. రైతులు వరి పొలాలలో ఒక టన్ను వరిగడ్డిని తగలబెట్టడం వల్ల 5.5 కేజీలను నత్రజని, 2.3 కేజీల భాస్వరం, 25 కేజీల పోటాషియం, 400 కేజీల సేంద్రియ ఎరువును కోల్పోతున్నామని తెలిపారు. అంతేకాక నేలలో ఉష్ణోగ్రతలు పెరిగి పంటలకు మేలు చేసే క్రిములు చనిపోవడం వలన సేంద్రియ కర్బనం తగ్గిపోతుందని, గ్రీన్ హౌస్ ఎఫెక్ట్ అయ్యే వాయుపదార్థాలు ఎక్కువై వాయు కాలుష్యానికి దారి తీస్తుందని, అందుకే రైతులు పంట అవశేషాలకు విలువలు జోడించి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పంట వ్యర్థాలను పశువుల మేతగా వంట చెరుకు, బయోగ్యాస్ , జీవన ఎరువులుగా, కంపోస్ట్ ఎరువు తయారీగా వినియోగించుకోవాలని మట్టిలో కలియుటం ద్వారా భూస్వరం పెరిగి తద్వారా నీటిని నిలువ చేసుకొని సామర్థ్యం పెంచుతుందని , రైతులు ఈ పద్దతులను పాటించి పంటలో అధిక దిగుబడులు పొందాలని వ్యవసాయ అధికారి డాకేశ్వర్ గౌడ్ తెలిపారు.



## అమీనుల్ మిస్కీన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 18వ ఉచిత ఖాత్నా క్యాంపు

**ప్రజాపక్షం / కొత్తకోట :** కొత్తకోట మండల కేంద్రంలోని యూఆర్ ఫంక్షన్ హాల్‌లో డా. తోఫిక్ ఇమామ్ డా. మహమ్మద్ ముజీబ్ సిబ్బందితో కలిసి నిర్వహించడం జరిగింది. నిరుపేద కుటుంబాలకు ఎంతో సహకరిస్తూ ఒక సమితి చేయడానికి రూ. 5వేలు కర్చు అవుతుంది. ఈ ఖర్చును అమీనుల్ మెస్కిన్ ట్రస్ట్ భరిస్తూ కులమతాలకు అతీతంగా 120 మంది పిల్లలకు సున్నీ కర్చును రూ. 6 లక్షలు భరిస్తుంది. అమీనుల్ మెస్కిన్ ట్రస్ట్ అధ్యక్షులు ఎంఏ హఫీజ్ మాట్లాడుతూ ట్రస్ట్ గత 20 సంవత్సరాల నుండి నిరుపేదలకు ఎడ్యుకేషన్ హెల్త్ మెడికల్ , వివాహాలకు సేవలు చేస్తూ వస్తుందని చెప్పారు. ట్రస్ట్ కార్యక్రమాలలో గౌరవ అధ్యక్షులు మాజీ అమీనుల్ మేస్కిన్ ట్రస్ట్ అధ్యక్షులు అబ్దుల్లాతీఫ్ , అబ్దుల్ గఫార్ , ఫయాజ్ అలీ, జావిద్ అలీ ఎంతో కృషి చేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మౌలానా ఖాజి షఫీ, ఆఫీస్ కమల్ రెహమాన్, ఖాద్రియ మజీద్ మౌలానా షబ్బీర్ అహ్మద్ రాశది, ఇలియాస్ , మైనార్టీ టౌన్ అధ్యక్షులు ఎజజ్ అలి, ఎంఐఎం అధ్యక్షులు రహీం, ఖదీర్ ఖాన్ , ముజీబ్ , సదా మీసవలో అంటూ ట్రస్ట్ యువకులు సేవలో ముందుంటారు. ఈ సేవా కార్యక్రమంలో పజిల్ అలీ, అజహర్ అలీ, ఫహీం, ఖదీర్ , ఫిరోజ్ , అలీమ్ నయుం, మోహిత్ , అబ్దుల్ వాహిద్ , అసద్ , హిదయత్ , శాలి, పర్వేజ్ అలలి, ఖలీల్ , వహిద్ అలి, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**ప్రజాపక్షం / చిన్నంబావి :** మండలంలోని దగడపల్లి గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003/04 పదో తరగతి చదివిన విద్యార్థులు స్థానిక పాఠశాలలో ఆదివారం ఒకే వేదికపై చేరుకొని సందడి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము చదువుకున్న పాఠశాలకు తమ వంతు సహకారాన్ని అందిస్తామన్నారు. అనంతరం నాటి గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, బాల్ రెడ్డి, యునస్ కన్ , అజీమ్ పాషా, రాధాకృష్ణ, అరుణ జ్యోతి, వెంకటరమణ, రాణి తదితర పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## పుచ్చలపల్లి సుందరయ్యకు ఘన నివాళ్లు

**ప్రజాపక్షం / పాన్‌గల్ :** దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని ఆదివారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పాన్‌గల్ మండలం రేమద్దుల, తెల్లరాళ్లపల్లి తండా గ్రామాలలో ఘనంగా జరుపుకున్నారు. పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి సిపిఎం పార్టీ నాయకులు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శాంతమ్మ సిపిఎం పార్టీ నాయకులు బాల్య నాయక్ , భగత్ ఎం. వెంకటయ్య , ఖాజ, భాస్కర్ , కోదండరాములు, నిరంజన్ , చంద్రశేఖర్ , భాస్కర్ గౌడ్ , బాల్ రెడ్డి, శాంతయ్య, చిన్న నిరంజన్ , బిచ్చయ్య, రాజు, ఈశ్వర్ , దాసు, చిట్టెమ్మ, బాబునాయక్ , రాజునాయక్ , కృష్ణానాయక్ , గిరిజన సంఘం నాయకులు సోమ్లా నాయక్ , లక్ష్మణ్ నాయక్ పాల్గొన్నారు.

## అంతర్రాష్ట్ర బండిలాగుడు పోటీలలో నాగర్‌కర్నూల్ జిల్లా ఎద్దులు విజేత



**ప్రజాపక్షం / పాన్‌గల్ :** శ్రీశ్రీశ్రీ వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా పాన్‌గల్ మండల పరిధిలోని మాందాపూర్ గ్రామంలో ఆదివారం నిర్వహించిన అంతరాష్ట్ర బండలాగుడు పోటీలను రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించారు. బండలాగుడు పోటీలలో విజేతగా నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరుకు చెందిన టీసీఆర్ బుల్స్ అఖిలేష్ రెడ్డికి చెందిన ఎద్దులు మొదటి స్థానంలో నిలిచాయి. విజేతగా నిలిచిన ఎద్దుల యజమానికి రూ. 60వేలు నగదు బహుమతిని నిర్వాహకులు అందజేశారు. నంద్యాల జిల్లా గున్మన్య దిన్నె గ్రామానికి చెందిన రాంభూపాల్ రెడ్డికి చెందిన ఎద్దులు ద్వితీయ స్థానం సాధించడంతో యజమానికి రూ. 50వేలు బహుమతిని, గుంటూరు జిల్లా కుందెనపల్లి గ్రామానికి చెందిన పిఆర్ మెమోరబుల్ ఎద్దులు మూడవ స్థానం సాధించడంతో యజమానికి రూ. 40వేల నగదును, నంద్యాల జిల్లా పిఆర్ పల్లి గ్రామానికి చెందిన నాగయ్యకు చెందిన ఎద్దులు నాగవ స్థానం సాధించడంతో రూ. 30వేలు నగదును యజమానికి నిర్వాహకులు అందజేశారు. కర్నూలు జిల్లా వల్లూకు గ్రామానికి చెందిన దొడ్డికాడి తిరుమల్లేష్ కు చెందిన ఎద్దులు ఐదవ స్థానం సాధించడంతో యజమానికి రూ. 20వేల నగదును, వనపర్తి జిల్లా పెద్ద దగడ గ్రామానికి చెందిన గోపాలకృష్ణకు చెందిన ఎద్దులు ఆరవ స్థానం సాధించడంతో యజమానికి రూ. 10వేల నగదు రూపాయలను నిర్వాహకులు అందజేశారు. వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన బండలాగుడు పోటీలకు ఆర్థిక సహయ సహకారాలు అందించిన మంత్రి జూపల్లి కృష్ణారావుకు, రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ చైర్మన్ చింతలపల్లి జగదీశ్వర రావుకు , కొల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు డా. పగిడాల శ్రీనివాస్ కు, జిల్లా సగర సంగం అధ్యక్షులు, ప్రముఖ కాంట్రాక్టర్ తిరుపతయ్య సాగర్‌తో పాటు పలువురు నాయకులను నిర్వాహకులు సన్మానించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పోటీలకు వ్యాఖ్యాతగా రెహమాన్ నిర్వహించారు. బండలాగుడు పోటీలను వీక్షించేందుకు సమీప గ్రామాల ప్రజలు ఎక్కువ మొత్తంలో చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకటేష్ నాయుడు, మాజీ జడ్పీటీసీ రవికుమార్ , మాజీ సింగిల్‌విండో వైస్ చైర్మన్ భాస్కర్ యాదవ్ , మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు గోవర్ధన్ సాగర్ , బ్రహ్మం, పుల్లారావు, మాజీ సర్పంచ్ జయరాములు సాగర్ , వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## మైసిగండి మైసమ్మ మొక్కుతీర్చుకున్న ఎంఎల్‌ఏ కసిరెడ్డి

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** కల్వకుర్తి నియోజకవర్గపరిధిలోగల కడ్తాల్ మండలం మైసిగండి గ్రామంలో కొలువుదీరిన మైసమ్మతల్లికి ఎంఎల్‌ఏ కసిరెడ్డి నారాయణరెడ్డి తన కుటుంబసభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కు తీర్చుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దైవభక్తితో మానవులు శాంతియుతంగా జీవిస్తారని అన్నారు. మొదటగా కల్వకుర్తి పట్టణకేంద్రంలో యెన్నం ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచితహెల్త్ క్యాంపుతోపాటు నూతన ఉచిత అంబులెన్స్‌ను ప్రారంభించారు. జెపినగర్‌లో గల దేవాలయంలో శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణోత్సవం కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జడ్పివైస్‌చైర్మన్ బాలాజిసింగ్, కల్వకుర్తి మాజీసర్పంచ్ ఆనంద్‌కుమార్, వెల్దండ మాజీసర్పంచ్ భూపతిరెడ్డి, కాంగ్రెస్‌నాయకులు పాల్గొన్నారు.

## నెంబర్‌ప్లేట్‌లేని వాహనాలు సీజ్

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** నెంబర్‌ప్లేట్‌లేని 40 వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు. జిల్లా ఎస్పిగైక్వాడ్ రఘునాథ్‌వైభవ్ ఆదేశాలమేరకు జిల్లాకేంద్రంలో ఆదివారం వాహనాలను తనిఖీచేయడం జరిగిందని అందులో 40 వాహనాలు నెంబర్‌ప్లేట్‌లేనివిగా గుర్తించి పోలీస్‌స్టేషన్‌కు తరలించడం జరిగిందని ఎస్ఐ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రతి వాహనానికి నెంబర్‌ప్లేట్ కలిగి ఉండాలని లేకుంటే వాహనాలను సీజ్‌చేస్తామన్నారు.

## శివుడికి రుద్రాభిషేకపూజలు



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** పట్టణంలోని ఓంనగర్‌కాలనీలో రవితేజ జూనియర్ కళాశాలవెనక శ్రీపబ్బతి ఆంజనేయ స్వామి దేవాలయంలో ఆదివారం శ్రీక్రోదినామసంవత్సరం వైశాఖ ఏకాదశి సందర్భంగా పరమశివుడికి భక్తులచే పంచామృతాలు, సుగంధద్రవ్యాలతో ఏకపారాయణ రుద్రాభిషేకం శాస్త్రోక్తంగా నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు మాడభూషి అజయ్‌కుమార్‌శర్మ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వేదమంత్రోచ్చరణాల మధ్యభక్తిపూర్వకంగా పరమశివుడిని పూజించడంతో ఆయుష్షు ఐశ్వర్యం అభివృద్ధి సిద్ధిస్తాయన్నారు. ఆరుద్రనక్షత్రంరోజు , మాసశివరాత్రి, మహాశివరాత్రి వేళలో పూజించడంతో శివప్రసాన్నత అధికంగా ఉంటుందన్నారు. భక్తులు పరమశివునికి పంచామృత, విభూతి, సుగంధద్రవ్యాలు, నవధాన్యాలు, బిల్వపత్రాలతో రుద్రాభిషేకాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శివపంచాయతనంలో ఉన్న గణపతి అమ్మవారు సూర్యభగవాన్ విష్ణుమూర్తిజంటనాగుల స్వాములకు కూడా ప్రత్యేకంగా అభిషేకపూజలు నిర్వహించారు. అనంతరం హనుమాన్ దేవాలయంలో స్వామివారికి అష్టోత్తరంతో అర్చనలు చేశారు. అనంతరం భక్తులకు అభిషేక పంచామృతతీర్థప్రసాదాలు వితరణ చేశారు. కార్యక్రమంలో అర్చకులు అందాడై శ్రీనివాసచార్యులు, వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మామిడి రైతుల అవస్థలు

**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** కొల్లాపూర్‌లో మార్కెట్ సౌకర్యంలేకపోవడంతో మామిడి రైతులు అనేక అవస్థలు పడుతున్నారు. వ్యాపారులు సిండికేట్‌గా మారి రైతులదగ్గర మామిడి తక్కువధరకు మామిడిని కొనుగోలుచేసి మామిడి రైతులను ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తున్నారు. కొల్లాపూర్‌లో మార్కెట్ యార్డు నిర్మాణానికి రెండేళ్లక్రితం నిధులు మంజూరైనప్పటికి స్థల సేకరణ సమస్యగా మారింది. దీంతో మార్కెట్‌యార్డు లేకపోవడంతో మామిడిరైతులు, మామిడిని అమ్ముకునేందుకు కొల్లాపూర్, పెద్దకొత్తపల్లిలోని ప్రైవేట్ వ్యాపారస్తులపై ఆధారపడి ఉండటంతో వ్యాపారస్తులు అడిగిన ధరకే మామిడిని అమ్మి రైతులు ఆర్థికంగా ఇబ్బందులకు గురి అవుతున్నారు.



## పిడుగుపడి పాడి ఆవు, మేకలు మృతి

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండల పరిధిలోని నిజాంబాద్ గ్రామానికి చెందిన పెరుమాళ్ల లింగమయ్య వ్యవసాయపొలంలో ఆదివారం పిడుగుపడి పాడి ఆవు, మూడుమేకలు మృతిచెందాయి. దీంతో రైతు జీవనాధారమైన ఆవుమృతి చెందడంతో కన్నీళ్లు పెట్టుకున్నాడు. ప్రభుత్వంద్వారా లింగమయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు అధికారులను కోరారు.

## ప్రమాదభరితంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** వెంకటాపూర్ గ్రామంలో నడిబొడ్డున ఉన్నటువంటి ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదభరితంగా ఉంది. గ్రామ మెయిన్‌రోడ్డుమీదనే ఉన్నటువంటి ట్రాన్స్‌ఫార్మర్‌వలన వచ్చే వర్షాలకి, చిన్నపిల్లలువైర్లు పట్టుకునే విధంగా ప్రమాదకరంగా ఉందని యువజన కాంగ్రెస్ అధ్యక్షులు అనిల్‌గౌడ్ తెలిపారు. ప్రమాదాలు జరగకముందే అధికారులు తక్షణమే స్పందించిచుట్టూ కంచె ఏర్పాటుచేసి ప్రజల ప్రాణాలకు రక్షణగా నిలవాలని తెలిపారు.

## ఎక్సైజ్ అధికారులదాడి

**ప్రజాపక్షం/అచ్చంపేట :** అచ్చంపేట నియోజకవర్గంలోని లింగాల మండలం శాయిన్‌పల్లి గ్రామంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో 670కిలోల నల్లబెల్లాన్ని స్వాధీనం చేసుకున్నట్లు అచ్చంపేట సీఐ బాలరాజు తెలిపారు. నాగర్‌కర్నూల్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రదీప్‌రావు ఆధ్వర్యంలో దాడలు జరిగాయి. ఈదాడిలో హైదరాబాద్‌నుంచి డిసిఎంలో ఆరుటన్నుల 270కిలోల బెల్లం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇద్దరిని అరెస్టుచేసి డిసిఎం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిని తెలకపల్లి ఎస్‌హెచ్‌ఓకు తరలించినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ తెలిపారు. లింగాల గ్రామానికిచెందిన జూలూరి ప్రసాద్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిపారు.

**అక్రమసారా పట్టివేత**

అచ్చంపేట పరిధిలోని దర్శనగడ్డ, శంకరయ్యగుట్ట ఎక్సైజ్ అధికారులు దాడిచేసి 20లీటర్ల నాటుసారాను పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ బాల్‌రాజు తెలిపారు. ఆదివారం తమ సిబ్బందితోదాడిచేయగా దొరికినట్లు తెలిపారు. గతంలో వీరిపై కేసు నమోదుచేశామని ఇది రెండోవిడతకావడంతో కోర్టులో హాజరుపర్చనున్నట్లు ఆయన తెలిపారు.

ప్రజాపక్షం
మహానగరి
మేడ్చల్ మల్కాజ్‌గిరి — వికారాబాద్
కరీంనగర్ | సోమవారం | 20 మే 2024 | 11

## వికలాంగులను అన్ని విధాలుగా ఆదుకుంటాం

ప్రజాపక్షం/శామీర్‌పేట : వికలాంగులను అన్ని విధాలుగా ఆదుకుంటామని ప్రొఫెసర్ కొల్లూరి హరిగోపాల్ అన్నారు. ఆదివారం మూడుచింతలపల్లి మండలంలోని జగ్గంగూడలో వికలాంగులకు వీల్‌చైర్‌లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ సమాజ సేవలో భాగంగా వికలాంగులను ఆదుకోవడానికి వీల్‌చైర్‌లను పంపిణీ చేస్తున్నామన్నారు. ఇంకా ఎవరైన తమను ఆశ్రయిస్తే వారికి తోచిన సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు.



ఈ కార్యక్రమంలో మణిగండ్ల కిష్టయ్య, సన్స్ ట్రస్ట్ అధినేత, హైకోర్టు న్యాయవాది నూతి శ్రీకర్‌శర్మ, సేవారత్న గ్రహీత మణిగండ్ల శ్రీనివాస్, శంకర్‌రావు, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

## జైలును సందర్శించిన న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్

ప్రజాపక్షం/చర్లపల్లి: జైలులో ఖైదీలకు సదుపాయాలు బాగున్నాయని మేడ్చల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా జడ్జి వి బాలభాస్కర్ అన్నారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ,తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలతో ఆదివారం చర్లపల్లి కేంద్ర కారాగారాన్ని సెక్రెటరీ సీనియర్ సివిల్ జడ్జి డి కిరణ్‌కుమార్‌తో కలసి సందర్శించారు. జైలులో ఖైదీలకు అందించే భోజనం, ఆరోగ్య వసతులు,వారి కేసుల వివరాలను



అడిగి తెలుసుకున్నారు. న్యాయ సహాయం గూర్చి వివరించారు. జైలు అధికారులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జైలు పర్యవేక్షణాధికారి సంతోష్‌కుమార్ రాయ్,ఉప పర్యవేక్షణాధికారులు,జైలర్లు పాల్గొన్నారు.

## హార్డ్‌వేర్ షాపు యజమానికి స్పీకర్ పరామర్శ



ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి : వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఓ హార్డ్ వేర్ షాపులో షాట్ సర్క్యూట్ తో హార్డ్ వేర్ షాపూ పూర్తిగా కలిపోయింది. ధారుర్ మండలనికి చెందిన నెనావత్ కృష్ణ కోన్ని సంవత్సరల నుండి హార్డ్ వేర్ షాపు నాదుపుతున్నారు.17రాత్రి తెల్లవారు జామున మంటలాల్లో పూర్తిగా కలిపోయింది . ఈ విషయం స్థానిక కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు స్పీకర్ ప్రసాద్ దృష్టికి తీసుకేల్లాగా అదివారం సాయంత్ర కుటుంబాన్ని పరమర్శించి ప్రభుత్వం నుండి సహాయం అందేవిధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల . పట్టణఅధ్యక్షులు సుధాకర్‌రెడ్డి ,రాఘవనాయక్ ,రమేష్ చందర్‌నాయక్ , లక్ష్మణ్‌గుప్త , తదితరులు పాల్గోన్నారు.

## సత్యనారాయణ స్వామి వ్రతాలు



ప్రజాపక్షం/శామీర్‌పేట : మూడుచింతలపల్లి మండలం కేశవరంలోని శ్రీబాలాజి వేంకటేశ్వర స్వామి ఆలయంలో కల్యాణత్సోవంలో బాగంగా ఆదివారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు జరుపుకున్నారు. ఈ సందర్బంగా భక్తులు అత్యంత భక్తి శ్రద్దలతో సామూహిక సత్యనారాయణ వ్రతాలు జరుపుకుని తమ మొక్కులను తీర్చుకున్నారు. శ్రీబాలాజి వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ కమిటి సభ్యులు ఏర్పాటు చేసిన అన్నదానంలో భక్తులు పాల్గొన్నారు. మరుసటి రోజున పొన్నసేవా, గరుడ సేవా, హోమములు, మహాపూర్ణాహుతి, మొక్కుసేవలు, రథోత్సవం, చక్రస్నానంతో కార్యక్రమాలను ముగిస్తామని నిర్వహకులు తెలిపారు.

**నాగారంలో...**



నాగారం మున్సిపాలిటీ పరిధిలోని సత్యనారాయణ కాలనీ శ్రీరామ సహిత సత్యనారాయణస్వామి,శ్రీ షిర్డీ సాయిబాబా దేవస్థావనం దేవాలయంలో శ్రీ రమాసహిత సత్యనారాయణస్వామి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు.సాయంత్రం పల్లకి సేవ ఉత్సవం, హారతులు,పవలింపు సేవ,తీర్థ ప్రసాదాలను అందజేశారు.ఈ ఆలయ చైర్మన్ అన్నంరాజు శ్రీనివాస్,కౌన్సిలర్ అన్నంరాజు లావణ్య,కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పుచ్చలపల్లి ఆశయాలకు అనుగుణంగా పోరాడుతాం



ప్రజాపక్షం/మల్కాజిగిరి: భూసామ్య విధానాలతో పాటు దళిత వాడల్లో సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేసి కుల వ్యవస్థ, అసమానతలకు వ్యతిరేకంగా పోరాటం కొనసాగించిన పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలకు అనుగుణంగా కొనసాగుతామంటూ సిపిఎం మౌలాలి డివిజన్ కార్యదర్శి పి.మంగా అన్నారు. ఆదివారం మౌలాలి డివిజన్‌లో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయన చివరి శ్వాస వరకు ప్రజల కోసమే జీవించారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీకి చెందిన రాజ్యలక్ష్మి , కళావతి, నరసమ్మ, దేవమ్మ, పద్మ, లక్ష్మి , పృథ్వి, లక్ష్మణ్, లక్ష్మి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# పది, ఇంటర్ ఫలితాల్లో వికారాబాద్ వెనుకంజ

### విద్యాశాఖ పనితీరుపై విమర్శలు ,అగ్రహం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు ,ప్రజాసంఘాలు

ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి : వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా పది, ఇంటర్ ఫలితాల్లో జిల్లా వేనుకబాటుపై విమర్శలు వెల్లువెత్తున్నాయి. విద్యాశాఖ పనితీరుపై విద్యార్థుల తల్లిదండ్రులు ,ప్రజాసంఘాలు విద్యావేత్తులు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో పదోతరగతి పరీక్షలకు హాజరైన విద్యార్థులు 13.357 ఉత్తీర్ణులు 8,695 ఫెయిల్ అయిన విద్యార్థులు 4,262 ఉత్తీర్ణత శాతం 65.10 రాష్టంలో చివరి స్తానంలో ఉంది. ఇంటర్‌లో మొదటి సంవత్సరం పరీక్షలకు 6,445మంది హాజరుకాగా 3,428 ఉత్తీర్నులు అయ్యరు. 3,027మంది ఫెయిల్ అయ్యరు53.11శాతంతో రాష్టంలో 22వ స్థానంలో ఉంది. ద్వితీయ సంవత్సరం 6,456 హాజరై, 3,965 మంది ఫెయిల్, 61 ఉతీర్ణత శాతం రాష్టంలో 27వ స్తానంలో ఉంది. ఈ వైఫల్యానికి ప్రధాన కారణం పర్యవేక్షణలోపమే అంటున్నారు. అధికారుల కొరతతో పాటుగా ప్రధానోపాధ్యాయులు తరగతిగదుల పర్యవేక్షణను గెలికొదిలేసారు . విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న పాఠశాలలు



సైతం ఫలితాల్లో అట్టడుగున నిలవడం విద్యాశాఖ పనితీరును పశ్నిస్తోంది. సరిపడా ఉపాధ్యాయులు ఉన్న పాఠశాలల్లోను 50శాతం లోపు ఫలితాలు రావడం, కొన్ని పాఠశాలల్లో ఒకరి చొప్పున కూడా ఉత్తీర్ణత సాధించలేకపోవడంతో తల్లిదండ్రులు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వికారాబాద్ జిల్లాలో పదిపలితాల్లో పులుసుమామిడి జెడ్పి 05 కి గాను ఒక్కరు ఉత్తీర్ణత 4ఫెయిల్, మోమిన్‌పేట్ జెడ్పిలో మొత్తం విద్యార్థులు 34గాను 07మంది విద్యార్థులు పాస్, ఫెయిల్ 27మంది విద్యార్థులు, తొర్మామిడి జెడ్పి 21మంది విద్యార్థులు గాను 04మంది ఉత్తీర్ణత 17 మంది విద్యార్థులు ఫెయిల్, అలంపల్లి జెడ్పి ఉర్దు 24గాను 07 ఉత్తీర్ణత 17మంది ఫెయిల్, తాండూర్ జెడ్పి 36 మంది విద్యార్థులకుగాను 12మంది ఉత్తీర్ణీత 24మంది ఫెయిల్, ఇందిరానగర్ జెడ్పి 16మందికిగాను 03మంది ఉత్తీర్ణిత 13మంది ఫెయిల్, బషీరాబాద్ కేజీబీవీ 70 మంది విద్యార్థులకుగాను 12మంది ఉత్తీర్ణిత 58మంది విద్యార్థులు ఫెయిల్, చౌడపూర్ జెడ్పిలో 87మంది విద్యార్థులకుగాను 26మంది విద్యార్థులు ఉత్తీర్ణత 61మంది విద్యార్థులు ఫెయిల్ అయినారు. గతంలో ఉమ్మడి జిల్లాల వారీగా ఫలితాలు వచ్చేవి, రంగారెడ్డి అర్బన్ ఏరియా తోకలిసి ఫలితాలు వస్తుడడంతో మన ప్రాంతం సైతం తొలి ఐదో స్తానంలో నిలిచేది జిల్లాల పనర్విభజన అనంతరం జిల్లాలో కరోన బ్యాచ్‌లు మినహాయిస్తే పంది ఇంటర్ ఫలితాల్లో 20లోపు నిలిచిన దాఖలాలు లేవు ఈ ఏడాదైతే ఫలితాల్లో పరిస్థితి మరింత మరింత దయనీయంగా మారింది. అలాగ ఇంటర్ ఫలితాల్లో 22వ స్తానం ఉండి పది పలితాల్లో చివరిస్తానానికి పడిపోయింది. ఇంద జరిగిన జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు ,ప్రజాప్రతినిధులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ఉన్నతాధికారులు సైతం సమీక్షించిన దాఖలాలు లేవు, అకడిమిక్ సంవత్సరమంతా పర్యవేక్షణ గాలిఒదిలేసి పరీక్షల నిర్వహణపై మాత్రమే దృష్టి సారించడంతో ఈ పలితాలే పునరావృతమవుతాయిని విశ్లేషకుల అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికీ ఇంటర్, పది పలితాలపై జిల్లా యంత్రాంగం సమీక్షించలేదు అని తల్లిదండ్రులు , ప్రజాసంఘాల నాయకులు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## రక్తదానం చేయండి.. ప్రాణదాతాలు కండి

ప్రజాపక్షం / కొడంగల్ : రక్తదానం చేయండి... ప్రాణదాతాలు కండి అంటు రావులపల్లి తాజా మాజీ సర్పంచ్ రమేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని రావులపల్లి గ్రామంలో యువ ఫౌండేషన్ ఆద్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిభిరానికి ముఖ్యఅతిథిగా రమేష్‌రెడ్డి హాజరై కార్యక్రమాన్ని ప్రారంబించారు. రక్తం ఇచ్చేందుకు గ్రామస్థులతో పాటు యువకులు పెద్ద సంఖ్యలో ఆసక్తి చూపడంతో నేటి తరంలో మానవత్వం అనేది ప్రతి మనిషికి ఉండాల్సిన ముఖ్య లక్షణమన్నారు. శిభిరం నిర్వహాకులు యువ న్యాయవాది సురేష్‌గౌడ్ నేతృత్వంలో తాండూర్ డివిజన్ బ్లడ్ బ్యాంక్ మరియు నారాయణపేట బ్లడ్ బ్యాంక్ నుంచి వచ్చిన వైద్య సిబ్బందికి దాదాపు 120 మంది యువకులు గ్రామస్థులు రక్తాన్ని దానం చేశారు. రక్తదానం చేసిన వారందరికి సర్టిఫికేట్‌లతో పాటు పండ్ల రసాలను అందించారు. ఆపదలో ఏవరైన ఉన్నారంటే ప్రతి ఒక్కరు స్పందించి ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో 24 ఫౌండేషన్ సభ్యులు కృష్ణ యాదవ్, రమేష్‌గౌడ్, ఆనంద్, విజయ్‌కుమార్, మహేష్‌గౌడ్, తలారి రమేష్, రామయ్యగౌడ్, కుప్పగిరి విజయ్‌కుమార్‌లతో పాటు అనూస్ కంప్యూటర్ పద్మనాభరెడ్డి, గ్రామ పెద్దలు శ్రీనివాస్‌రెడ్డిలతో పాటు తదితరులు పాల్గోన్నారు.



## ప్రాథమిక చికిత్సతో మనిషి ప్రాణాలూ కొపాడొచ్చు

ప్రజాపక్షం/హైదరాబాద్: కొన్ని సందర్భాలలో ప్రాథమిక చికిత్సనే మనిషి ప్రాణాలను కాపాడుతుందని రెనోవా సెంచరీ ఆస్పత్రి వైద్యులు తెలిపారు. ముందుగా ప్రాథమిక చికిత్స నిర్వహించడం ద్వారా ఎంతో మేలు జరుగుతుందన్నారు. శ్రీశ్రీశ్రీ జగద్గురు ఆది శంకరాచార్య భక్త సమాజం, ఆహం బ్రహ్మస్మి తత్త్వం ఛారిటబుల్ ట్రస్ట్ సయుక్త ఆధ్వర్యంలో జగద్గురు శ్రీశ్రీశ్రీ ఆది శంకరాచార్యా జయంతి మహోత్సవాల సందర్భంగా హైదరాబాద్, కొత్తపేటలో రెనోవా సెంచరీ ఆస్పత్రి ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ నెల 9న ప్రారంభమైన వైద్య శిబిరం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన భక్తకులకు, ఇతరులకు ఉచితంగా వైద్య పరీక్షలను నిర్వహించామని, ముఖ్యంగా ప్రాథమిక చికిత్స పట్ల అవగాహన కల్పించామని రెనోవా సెంచరీ ఆస్పత్రి వైద్యులు తెలిపారు.

ప్రాథమిక చికిత్స ప్రధాన్యత, అత్యవసరం సందర్భంలో స్పందించాల్సిన తీరు తదితర వివరాల పట్ల అవగాహనను కల్పించినట్టు వైద్య శిబిరం సమన్వయ కర్త శ్రీలత రాణి తెలిపారు.

## కాలనీ సంక్షేమ సంఘాల అభివృద్ధికి కృషి: ఎంఎల్‌ఎ బిఎల్‌ఆర్



ప్రజాపక్షం/చర్లపల్లి: కాలనీల సంక్షేమ సంఘాల అభివృద్ధికి పాటుపడతానని ఉప్పల్ ఎంఎల్‌ఎ బండారి లక్ష్మారెడ్డి అన్నారు.చర్లపల్లి డివిజన్ పరిధిలోని సోనియా గాంధీ నగర్ కాలనీ ఫేస్1 వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎను శాలువాతో సత్కరించారు. కాలనీ నూతన కార్యవర్గం శ్యామల బిక్షపతి,పలుగుల గోపాల్,తాండ్ర యాదగిరి,మైలారం నర్సింహ,రాజుగౌడ్,శ్రీనివాస్‌రెడ్డిలను ఎంఎల్‌ఎ అభినందించారు.కాలనీ సంక్షేమ సంఘాల ఐక్యమత్యంతోనే కాలనీలు అభివృద్ధి చెందుతాయని ఆయన అన్నారు.స్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవి,మాజీ కార్పొరేటర్ ధన్‌పాల్‌రెడ్డి,నాయకులు మహేష్‌గౌడ్,ఎంపల్లి పద్మారెడ్డి పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠినమైన చర్యలు

### జిల్లా ఎస్‌పి కోడిరెడ్డి

ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి : వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా నకిలీ విత్తనాలు కాలం చెల్లిన విత్తనాలు విక్రయిస్తే కఠనమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని జిల్లా ఎస్‌పి కోటిరెడ్డి తెలిపారు ఈ సందర్బంగా ఎస్‌పి మాట్లాడుతూ వానాకాలం సాగు ప్రారంభమవుతున్న సమయాన్ని దృష్టిలో ఉంచుకోని కొందరు నేరగాళ్లు తమ స్వలాభం కోరకు అమాయక రైతులను నష్టం కలిగించే నకిలీ విత్తనాలు ,కాలం చెల్లిన ప్రభుత్వ నిషేధిత మందులు ,విత్తనాలు అమ్మితే చట్టప్రకరం కఠినమై చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. వ్యవసాయ అధికారులతో కలిసి వ్యవసాయవిత్తనాల ,ఎరువులదుఖానాలపై దాడులు చేయడం జరుగుతుందని అని తెలిపారు. నకిలీ విత్తనలు అమ్ముతునట్లు సమాచారం ఉంటే పోలిస్‌లకు ,100 కుగాని సామాచారం అందించాలని అన్నారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉండచం జరుగుతుందని అన్నారు.



## ఘనంగా కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి

ప్రజాపక్షం/జగద్గిరిగుట్ట: సిపిఎం కుత్బుల్లాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట యోధుడు అమరజీవి కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి వేడుకలు ఆదివారం షాపూర్ నగర్ లోని సిపిఎం కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్, జిల్లా కమిటీ సభ్యులు వరప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ, పుచ్చలపల్లి సుందరయ్య 1985 మే 19వ తేదీన తుదిశ్వాస విడిచారు. ఆయన జీవించిన కాలమంతా సమాజానికి మార్గదర్శకంగా నిలిచారు. నాటి కాలంలో రాజకీయాల్లో ఒక కొత్త మార్గాన్ని చూపారు. రాజకీయ నాయకుడంటే ఎలా ఉండాలో ఒక నమూనాగా నిలిచారు. భారత దేశంలో దోపిడీ, అసమానతలు లేని సమ సమాజాన్ని నిర్మించాలని కలలుకన్నారు. అందుకోసం తన యావజ్జీవితాన్ని అంకితం చేశారు. అట్టడుగు వర్గాలైన వ్యవసాయ కార్మికుల హక్కుల కోసం వ్యవసాయ కార్మిక సంఘాన్ని స్థాపించారు. తన జీవితకాలం మొత్తం పేద ప్రజల కార్మికుల హక్కుల కోసం పోరాడినటువంటి తనకు ఉన్నటువంటి యావదాస్తిని పేదలకు పంచి ప్రజలే తమ కుటుంబ సభ్యులుగా భావించిన మహోన్నత వ్యక్తి కామ్రేడ్ సుందరయ్య దక్షిణ భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతల్లో సుందరయ్య ఒకరు దేశ



స్వతంత్ర పోరాటంలో తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొని చెరసాలలను సైతం లెక్కచేయకుండా ప్రజల పక్షాన పోరాడినటువంటి సుందరయ్య కి జోహార్లు అర్పిస్తూ సుందరయ్య ఆశయాలను సాధించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు బి.సత్యం పసుల, అంజయ్య, ఈ.దేవదానం, ఆర్.స్వాతి, జి.వెంకన్న, కరుణాకర్, కె.శీను, భాష దుర్గా నాయక్, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

## మల్టీ స్కిల్స్‌తోనే అత్యున్నత శిఖరాలకు

### నాట్స్ అధ్యక్షులు నూతి బాపయ్య చౌదరి

ప్రజాపక్షం/హైదరాబాద్ : మల్టీ స్కిల్స్ ఉన్నవారు మాత్రమే ఏ రంగంలోనైనా రాణిస్తారని ఉత్తర అమెరికా తెలుగు సంఘం(నాట్స్ ) అధ్యక్షులు నూతి బాపయ్య చౌదరి అన్నారు. ఆర్‌టిసి క్రాస్ రోడ్స్‌లో ఆదివారం సాయంత్రం ఉత్తర అమెరికా తెలుగు సంఘం సహకారంతో అవని ఫౌండేషన్ ఏర్పాటు చేసిన కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ 29 సంవత్సరాలుగా కంప్యూటర్ రంగంలో పని చేస్తున్నానని తెలిపారు. ఈ డిజిటల్ యుగంలో టెక్నాలజీ లేకుండా ఏ రంగం అభివృద్ధి కాదన్నారు. అన్ని దేశాలు ఇండియా వైపు చూస్తున్నాయని అన్నారు. బేసిక్స్, లాంగ్వేజెస్‌పై పట్టు సాధించి, నూతన టెక్నాలజీని అందుకుంటే యువతకు మంచి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. కోర్సు పూర్తిచేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు బహుకరించారు. ఈ




సందర్భంగా నిర్వహకులు బాపయ్య చౌదరికి అలిశెట్టి ప్రభాకర్ కవిత పుస్తకాన్ని ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో నాట్స్ డల్లాస్ కో ఆర్డినేటర్ రవి తాండ్ర, రామానంద తీర్థ గ్రామీణ యూనివర్సిటీ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ కిషోర్ రెడ్డి, ఎఐటియుసి నాయకులు బాలకాశి, స్పర్శ ఫౌండేషన్ సిఇఓ పంచముఖి, సీనియర్ జర్నలిస్ట్ కొండూరు వీరయ్య, తెలంగాణ బుక్ ట్రస్ట్ కార్యదర్శి కోయ చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## పిడుగుపాటు మృతులకు ఎంఎల్‌ఎ పరామర్శ

### యాలాల మండలంలో విషాదం





ప్రజాపక్షం/తాండజూరు: యాలాల మండలం లో విషాద చాయలు అములు కున్నాయి. పిడుగు పాటుతో ముగ్గురు రైతులు మృత్యువాత పడ్డారు. వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గ పరిధి యాలాల మండలంలో ఆదివారం మద్యాహ్నం వీచిన గాలి వాన భీభత్సం సృష్టించింది. గత కొంత కాలంగా భానుడి ప్రతాపంతో భగ భగ మండిన మండల నుండి ఈ వర్షాలు కాస్త ఊరటను ఇస్తాయని అనుకుంటున్న తరుణంలో యాలాల మండలంలో ఓకే రోజు ముగ్గరు రైతులు పిడుగు పాటు భారి పడి మృతి చెందాడం ఆయా కుటుంబాలను తీవ్రంగా కలసివేసింది. పిడుగు పాటుకు మృతి చెందిన రైతు కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని మండల రైతులు కోరుతున్నారు.

యాలాల మండలంలో పిడుగుపాటుకు గురై మృతి చెందిన రైతు కుటుంబాలను స్థానిక ఎంఎల్‌ఎ బుయ్యని మనోహర్‌రెడ్డి పరమార్శించారు. పిడుగు పాటుతో రైతులు మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న ఎంఎల్‌ఎ వారి కుటుంబాలను పరమార్శించారు. రైతులను అన్ని విధాలు అదుకుంటామని తెలిపారు.

## క్లీన్ ఎనర్జీ ట్రాన్స్‌మిషన్‌పై 25న మీడియా వర్క్‌షాప్

ప్రజాపక్షం / హైదరాబాద్ : క్లీన్ ఎనర్జీ ట్రాన్స్‌మిషన్ అన్న అంశంపై మే 25న సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో ఒక మీడియా వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ జనరల్ సెక్రెటరీ రవికాంత్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పీపుల్స్ మానిటరింగ్ గ్రూప్ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో పాల్గొని క్లీన్ ఎనర్జీ ట్రాన్స్‌మిషన్ అనేది ఏ రకంగా ఉపయోగపడుతోంది? విద్యుత్ ఉత్పత్తిలోనూ దాని పాత్ర ఏ స్థాయిలో ఉంటుంది ? తెలంగాణ విద్యుత్ రంగ సెక్టార్‌లో రెగ్యులేటరీ పాత్ర, తెలంగాణలోనూ రెనెవెబుల్ ఎనర్జీ ఉత్పిత్తికి ఉన్న అవకాశాలు, వ్యవసాయ రంగంలో దీని ప్రభావం తదితర అంశాల గురించి తమ అభిప్రాయాలను వెల్లడించవచ్చని తెలిపారు.

## కార్పొరేటర్ శ్రవణ్‌కు అండ

### బిజెపి అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

ప్రజాపక్షం/మల్కాజిగిరి: అక్రమ కేసులతో అరెస్టయిన బిజెపికి చెందిన మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్‌కుమార్‌కు పార్టీ పూర్తి స్థాయిలో అండగా ఉంటుందని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఆదివారం మల్కాజిగిరిలోని శ్రవణ్ ఇంటికి వెళ్లి కుటుంబీకులను కల్సిన ఆయన ధైర్యంగా ఉండాలని, ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. కేసుల నుండి బయటకు రావటానికి న్యాయపరంగా పార్టీ సహకరిస్తుందన్నారు. మూడు రోజుల క్రితం శ్రవణ్‌ను డివిజన్ కార్యాలయంలో కూర్చొన్న సమయంలో గూండాల్లా వచ్చిన పోలీసులు కిడ్నాప్ తరహాలో తీసుకొని వెళ్లి మరుసటి రోజు సైబర్ నేరం అన్న కేసుపై చంచల్‌గూడ కారాగారానికి తరలించిన విషయం విదితమే.

## ఒరిశా టూ ధూల్‌పేట్ @ గంజాయి

### ఐదుగురి అరెస్టు..రూ.10 లక్షల గంజాయి స్వాధీనం

ప్రజాపక్షం/హైదరాబాద్: ఒరిశా నుంచి ధూల్‌పేట్‌కు గంజాయిని స్మగ్లింగ్ చేస్తున్న ఓ ముఠా గుట్టును ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రట్టు చేశారు. రూ. 10 లక్షల విలువైన 47.5 కిలోల ఎండు గంజాయితో పాటు లారీ, ఆటో, కారును స్వాధీనం చేసుకున్నారు. ఎఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వి.బి.కమలాసన్‌రెడ్డి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.హైదరాబాద్‌కు చెందిన రాజబాబు, విప్లవ్ మహతో, సంజయ్ బిస్వాన్, బిట్టురాయ్, రజాఖాన్‌లు గంజాయి స్మగ్లింగ్ ముఠాగా ఏర్పడ్డారు. రాజబాబుపై గతంలో మంగళ్‌హాట్, నార్సింగి,గోల్కొండ లా అండ్ ఆర్డర్ పోలీసు స్టేషన్‌లతో పాటు ధూల్‌పేట ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో దాదాపు 10 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. విప్లవ్ మహతో, సంజయ్ బిస్వాన్, బిట్టురాయ్, రజాఖాన్‌తో కలిసి రాజబాబు ఒరిస్సాలోని మల్కాన్‌గిరి నుంచి ధూల్‌పేట్‌కు మూడు వాహనాలలో 47.5 కిలోల ఎండు గంజాయిని ఆదివారం తరలించాడు. ఈ మేరకు విశ్వసనీయ సమాచారం అందుకున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్ యన్.అంజిరెడ్డి నేతృత్వంలో ఇన్‌స్పెక్టర్ ఎంపి ఆర్ చంద్రశేఖర్, సిబ్బంది యాదగిరిరాజు, యాదగిరి, మహేష్, రజనీకాంత్, అశ్వీన్, అహ్మద్‌లు దాడి చేసి పట్టుకున్నారు. నిందితులను విచారించగా మల్కాన్‌గిరిలోని ఆదివాసి సంజయ్‌బిస్వాల్ నుంచి కిలో గంజాయికి రూ.4000 చొప్పున ఖరీదు చేసి హైదరాబాద్‌లో కిలో గంజాయి రూ. 10,000 విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఛతీస్‌ఘట్ నుంచి ఎంపిఎల్ స్టీల్ ఇండస్ట్రీకి సరఫరా అయ్యే ఐరన్‌లోడ్ లారీలో చిట్కాల వరకు అక్కడి నుంచి ఆటో, కారులో ధూల్‌పేట్‌కు తరలించినట్లు నిందితులు పేర్కొన్నారు.



## పిల్లల్లో కంటి క్యాన్సర్‌పై అవగాహన ఉండాలి

### వైటథాన్ రన్' ప్రారంభంలో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ జి. వినీత్

ప్రజాపక్షం / హైదరాబాద్ : పిల్లలలో కంటి క్యాన్సర్‌పై తల్లి దండ్రులు అవగాహన కలిగి ఉండాలని మాదాపూర్ జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ డాక్టర్ జి. వినీత్ తెలిపారు. ఎల్‌వి ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో పిల్లలలో రెటినోబ్లాస్టోమా (కంటి కాన్సర్) పై నిర్వహించిన 'వైటథాన్ రన్'ను గచ్చిబౌలిలోని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాదులో ఈ మేరకు ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ప్రతి సంవత్సరం మే నెల రెండో ఆదివారం ప్రారంభమై ఏడు రోజులపాటు ఈ కార్యక్రమం జరుగుతోంది. ఈ రన్ ద్వారా సేకరించిన నిధులతో రెటినోబ్లాస్టోమాతో పడుతున్న పేద పిల్లలకు ఉచితంగా చికిత్స చేయడానికి, పరిశోధనకు వినియోగిస్తారు. ఈ సందర్భంగా వినీత్ మాట్లాడుతూ రెటినోబ్లాస్టోమా రోగులకు సహాయం చేసే ఉదాత్తమైన కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. దీని ద్వారా సేకరించిన నిధులు చికిత్స ఖర్చును భరించలేని రోగులకు ఉచితంగా చికిత్స అందించడానికి ఉపయోగించనున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఎల్‌వి ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ ఆపరేషన్ ఐసైట్ యూనివర్సల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఐ క్యాన్సర్ హెడ్ డాక్టర్ స్వాతి కలికి మాట్లాడుతూ 'రెటినోబ్లాస్టోమా' కంటి క్యాన్సర్ అవగాహన కోసం ఈ రన్ నిర్వహిస్తున్నామని చెప్పారు. పిల్లల కళ్లలో కనిపించే వైట్ రిఫ్లెక్స్ కంటి క్యాన్సర్ సంకేతం కావచ్చన్నారు. రెటినోబ్లాస్టోమా వంశపారంపర్యంగానూ వస్తుందన్నారు. ఈ సందర్భంగా అపోలో క్యాన్సర్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ విజయ్ ఆనంద్ రెడ్డి మాట్లాడుతూ కంటి క్యాన్సర్ లేదా రెటినోబ్లాస్టోమా అనేది అప్పుడే పుట్టిన పిల్లల నుంచి ఆరేళ్ల పిల్లల వరకు కనిపించే విషయమన్నారు. ఈ వ్యాధి ఉన్నవారిలో 90 శాతం మందికి నయమయ్యే అవకాశం ఉందన్నారు.ముందుగానే గుర్తించి తక్షణ చికిత్స పొందడం చాలా అవసరమన్నారు. ఈ రన్లో 2200 మంది పాల్గొన్నారు.



# క్రీడ

## ఆఖరి లీగ్ మ్యాచ్‌లోనూ అదే జోరు..

### పంజాబ్‌పై సన్‌రైజర్స్ ఘన విజయం



**హైదరాబాద్:** ఐపిఎల్ 17వ సీజన్‌లో మంచి ప్రదర్శన చేస్తూ ఇప్పటికే ప్లేఆఫ్స్‌కు చేరుకున్న హైదరాబాద్.. లీగ్ దశలో ఆఖరి మ్యాచ్‌లోనూ అదరగొట్టింది. సొంత మైదానంలో పంజాబ్‌తో జరిగిన మ్యాచ్‌లో 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 214 పరుగులు చేసింది. ఈ భారీ లక్ష్యాన్ని సన్‌రైజర్స్ 19.1 ఓవర్లలోనే 6 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఓపెనర్ ట్రావిస్ హెడ్ మొదటి ఓవర్ తొలి బంతికే ఔటైనా.. మరో ఓపెనర్ అభిషేక్ శర్మ (66; 28 బంతుల్లో 5 ఫోర్లు, 6 సిక్స్‌లు) దంచికొట్టాడు. రాహుల్ త్రిపాఠి (33; 18 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), నితీశ్ రెడ్డి (37; 25 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్స్‌లు), హెన్రిచ్ క్లాసెన్ (42; 26 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) క్రీజులో ఉన్నంతసేపు మెరుపులు మెరిపించారు. అబ్దుల్ సమద్ (11), సన్వీర్ సింగ్ (6) నాటౌట్‌గా నిలిచారు. పంజాబ్ బౌలర్లలో అర్ష్‌దీప్ 2, హర్షల్ పటేల్ 2, హర్‌ప్రీత్ బ్రార్, శశాంక్ సింగ్ తలో వికెట్ పడగొట్టారు. అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్‌కు ఓపెనర్లు అథర్వ తైడే (46; 27 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లు), ప్రభ్‌సిమ్రన్ సింగ్ (71; 45 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్స్‌లు) శుభారంభం అందించారు. వన్‌డౌన్‌లో వచ్చిన రిలీ రోసో (49; 24 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరుపులు మెరిపించి త్రుటిలో హాఫ్ సెంచరీ మిస్ చేసుకున్నాడు. చివర్లో కెప్టెన్ జితేశ్ శర్మ (32*; 15 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) దూకుడుగా ఆడటంతో పంజాబ్ స్కోరు 200 దాటింది. హైదరాబాద్ బౌలర్లలో నటరాజన్ 2, కమిన్స్, విజయ్‌కాంత్ వియస్కాంత్ ఒక్కో వికెట్ పడగొట్టారు.

## రాజస్థాన్, కోల్‌కతా మ్యాచ్ రద్దు

**గువహటి :** ఐపిఎల్ సీజన్ 17లో భాగంగా రాజస్థాన్ రాయల్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ మధ్య జరగాల్సిన మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. మ్యాచ్‌కు ఆతిథ్యమిస్తోన్న గువహటిలో టాస్ వేయడానికి కంటే ముందు నుంచే ఈ వాన మొదలైంది. అయితే సుదీర్ఘ నిరీక్షణ తర్వాత వరుణుడు కాస్త శాంతించగా, మ్యాచ్‌ను పునః ప్రారంభించారు. అయితే అప్పటికే ఆలస్యం అవ్వడం వల్ల 20 ఓవర్ల మ్యాచ్‌ను కాస్తా 7 ఓవర్ల మ్యాచ్‌గా మార్చారు. దీంతో ఈ ఉత్కంఠ పోరులో టాస్ గెలిచిన కోల్‌కతా జట్టు బౌలింగ్ ఎంచుకుంది. కానీ అంతలోనే తిరిగి వాన మొదలవ్వడం వల్ల మ్యాచ్‌కు మరోసారి అంతరాయం కలిగింది. సిబ్బంది వెంటనే పిచ్ మీదకు షీట్స్ తెచ్చి కప్పారు. వానా తగ్గుతుందని ఎదురు చూశారు. కానీ అలా జరగలేదు. దీంతో ఇకపై వర్షం తగ్గే సూచనలు కనిపించకపోవడం వల్ల మేనేజ్‌మెంట్ ఈ డెసిషన్ తీసుకుంది. రాజస్థాన్‌కు ఇది ఎంతో కీలకమైన మ్యాచ్. ఇప్పటికే పంజాబ్‌పై హైదరాబాద్ జట్టు (17 పాయింట్లు) విజయం సాధించి రెండో స్థానానికి చేరింది. ప్రస్తుతం 16 పాయింట్లతో రాజస్థాన్ జట్టు మూడో స్థానంలో ఉంది. కోల్‌కతాపై గెలిస్తే తిరిగి రెండో స్థానానికి చేరుకుంటాది. ఇప్పుడు ఈ మ్యాచ్ రద్దవ్వడం వల్ల రాజస్థాన్‌కు భారీ నష్టం కలిగింది. ఇరుజట్లకు చెరో పాయింట్లు రావడం వల్ల 17 పాయింట్లతో రాజస్థాన్ లీగ్ దశను ముగిస్తుంది. దీంతో హైదరాబాద్, రాజస్థాన్ సమానంగా నిలుస్తాయి. అప్పుడు రాజస్థాన్ (+0.273) కంటే మెరుగైన రన్‌రేట్ ఉన్న సన్‌రైజర్స్ (+0.414) రెండో స్థానంలోనే ఉంటుంది. మొదటి రెండు స్థానాల్లో ఉన్న జట్లు క్వాలిఫయర్ 1 ఆడతాయి. ఇందులో గెలిచిన జట్టు నేరుగా ఫైనల్‌కు చేరుతుంది. ఓడినా కూడా మరో అవకాశం ఉంటుంది.




## నా ప్రైవసీకి భంగం కలిగించారు!



**న్యూఢిల్లీ :** టీమ్‌ఇండియా కెప్టెన్ రోహిత్ శర్మ తాజాగా ట్విట్టర్ వేదికగా ప్రముఖ స్పోర్ట్స్ ఛానల్‌ను తిట్టిపోశాడు. వద్దన్నా కూడా అనవసరంగా వీడియోలు తీసి తమ ప్రైవసీకి భంగం కలిగిస్తున్నారని వ్యాఖ్యానించాడు. ప్రాక్టీస్ సమయంలో, మ్యాచ్ అయిపోయాక స్టేడియంలో తమ సహచరులతో మాట్లాడుకున్న వాటిని వీడియో తీసి వాటిని అప్‌లోడ్ చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశాడు. 'క్రికెటర్ల జీవితాలు ఎలా మారిపోయాయి అంటే ఇప్పుడు మేము వేసే ప్రతి అడుగు, స్నేహితులు లేదా సహచరులతో పంచుకునే విషయాలన్నింటిని కెమెరాలో రికార్డ్ చేస్తున్నారు. నేను మాట్లాడే దాన్ని రికార్డ్ చేయొద్దన్ని స్టార్ స్పోర్ట్స్‌ను కోరినప్పటికీ, వాళ్లు నా ప్రైవసీకి భంగం కలిగించేలా ప్రవర్తించారు. దాన్ని టెలికాస్ట్ చేశారు. ఎక్స్‌క్లూజివ్ కంటెంట్‌తో పాటు వ్యూస్‌ను సాధించే విషయంపై దృష్టి పెట్టాలనుకే ఆలోచన ఒకరోజు క్రికెటర్లకు అలాగే ఫ్యాన్స్‌కు మధ్య ఉన్న నమ్మకాన్ని పోయేలా చేస్తుంది' అంటూ రోహిత్ అసహనం వ్యక్తం చేశాడు. ఇక రోహిత్ ట్వీట్ చూసిన అభిమానులు, సదురు ఛానెల్ చేసిన పని సరికాదంటూ కామెంట్లు పెడుతున్నారు. రోహిత్‌కు మద్దతు తెలుపుతున్నారు.

**అసలేం జరిగిందంటే:** ఐపిఎల్‌లో భాగంగా లక్నో, ముంబయి మధ్య మ్యాచ్‌కు ముందు భారత మాజీ ఆటగాడు ధవళ్ కులకర్ణి, రోహిత్ ముచ్చటించారు. అదే సమయంలో అక్కడి ఓ కెమెరామెన్ వాళ్ల వీడియో తీస్తూ ఉన్నాడు. ఈ విషయాన్ని రోహిత్ గమనించాడు. వెంటనే అతడు కెమెరామన్‌ను రోహిత్ సరదాగా రిక్వెస్ట్ చేశాడు. 'బ్రదర్, దయచేసి ఆడియో ఆఫ్ చేయండి. ఇప్పటికే ఓ వీడియో వైరల్‌గా మారిపోయింది. దీంతో చాలా ఇబ్బందులు ఎదురయ్యాయి' అంటూ రోహిత్ వ్యాఖ్యానించాడు. ఇక ఇదే వీడియోను స్టార్స్ స్పోర్ట్స్ తమ ఛానల్‌లో ప్రసారం చేసింది. మరోవైపు ఈ మ్యాచ్‌లో ముంబయి జట్టు 18 పరుగుల తేడాతో లక్నో చేతిలో ఓటమిపాలైంది. ఇందులో లక్నో గెలిచినప్పటికీ ఇంటిముఖం పట్టక తప్పలేదు. ఇక లక్నో నిర్దేశించిన 215 పరుగుల లక్ష్య ఛేదనలో ముంబయి 196/6 స్కోరుకే పరిమితమైంది. ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన రోహిత్ శర్మ 38 బంతుల్లో 68 పరుగులు చేశాడు. జట్టుకు మంచి స్కోర్ అందించాడు.



# రీల్

## విష్ణు మంచు 'కన్నప్ప'లో కాజల్ అగర్వాల్

డైనమిక్ స్టార్ విష్ణు మంచు డ్రీమ్ ప్రాజెక్ట్ 'కన్నప్ప' నుంచి వస్తున్న ప్రతీ ఒక్క అప్డేట్ అంచనాలు పెంచేస్తోంది. రీసెంట్గా బాలీవుడ్ స్టార్ అక్షయ్ కుమార్ తన పాత్రకు సంబంధించిన షూటింగ్ను ముగించేసుకోవడం, ఆ తరువాత డార్లింగ్ ప్రభాస్ సెట్లోకి రావడం.. ఇలా ప్రతీ ఒక్క అప్డేట్తో కన్నప్ప నేషనల్ వైడ్గా ట్రెండ్ అవుతూనే వస్తోంది. తాజాగా కన్నప్పకు సంబంధించిన మరో అప్డేట్ నెట్టింట్లో వైరల్ కాసాగింది. కన్నప్ప చిత్రంలోని ఓ కీలక పాత్రలో కాజల్ అగర్వాల్ నటిస్తోంది. ఈ మేరకు నెట్టింట్లో ట్రెండ్ అవుతోంది. ఆల్రెడీ విష్ణు మంచు, కాజల్ కలిసి ఇది వరకు మోసగాళ్లు మూవీని చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఇలా మంచు విష్ణు టైటిల్ రోల్లో చేస్తోన్న కన్నప్ప చిత్రంలో కాజల్ ఓ కీ రోల్ను పోషిస్తున్నారు. కలెక్షన్ కింగ్ డా. మోహన్ బాబు నిర్మిస్తున్న ఈ కన్నప్ప చిత్రానికి ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ మూవీని ఎక్కువగా న్యూజిలాండ్లోని అందమైన ప్రదేశాల్లో చిత్రీకరించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన షూటింగ్ హైద్రాబాద్‌లో జరుగుతోంది. మే 20న కేన్స్లో జరిగే ఫిల్మ్ ఫెస్టివల్లో కన్నప్ప టీజర్ను లాంచ్ చేయబోతోన్న సంగతి తెలిసిందే.

## ప్రశాంత్ వర్మ బిగ్గెస్ట్ ప్రాజెక్ట్‌పై అప్డేట్



ప్రస్తుతం మన టాలీవుడ్ లో ఉన్న యంగ్ జెనరేషన్ దర్శకుల్లో తమ టాలెంట్‌తో పాన్ ఇండియా మార్కెట్‌లో కూడా సత్తా చాటినవారు ఉన్నారు. మరి వీరిలో తెలుగులో మొట్టమొదటి సూపర్ హీరో సినిమా చేసి సెన్సేషనల్ హిట్ కొట్టిన హనుమాన్ దర్శకుడు ప్రశాంత్ వర్మ కూడా ఒకరు. మరి ప్రశాంత్ వర్మ నుంచి ఇప్పుడు మరిన్ని ఆసక్తికర చిత్రాలు రాబోతుండగా ఈ చిత్రాల్లో తన బాలీవుడ్ బిగ్గెస్ట్ ప్రాజెక్ట్ కూడా ఒకటి. బాలీవుడ్ టాలెంటెడ్ అండ్ స్టార్ నటుడు రణ్వీర్ సింగ్‌తో ఓ చిత్రం తాను చేస్తున్న విషయం అందరికీ తెలిసిందే. ఇంకా అఫీషియల్‌గా అనౌన్స్ చేయలేదు కానీ ఈ సినిమా ఆల్రెడీ షూటింగ్ కూడా స్టార్ట్ అయ్యిందని టాక్ ఉంది. మరి ఇప్పుడు మరో ఇంట్రెస్టింగ్ అప్డేట్ కూడా వినిపిస్తుంది. ఆల్రెడీ స్టార్ట్ అయ్యిన షూట్ తో ఓ ఇంట్రెస్టింగ్ గ్లింప్స్‌ని ప్రశాంత్ వర్మ తనదైన మార్క్ వినూత్నతతో ప్లాన్ చేస్తున్నాడట. దీనినే అతి త్వరలో రిలీజ్ చేసి ప్రకటించనున్నారని వినిపిస్తుంది. ఇక ఈ కాంబినేషన్‌లో ఏ తరహా సినిమాతో రాబోతున్నారా అని చాలా మంది ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

## 20న ఆనంద్ 'గం..గం..గణేశా' రిలీజ్




యంగ్ హీరో ఆనంద్ దేవరకొండ నటించిన లేటెస్ట్ మూవీ 'గం..గం..గణేశా'. ప్రగతి శ్రీవాస్తవ, నయన్ సారిక హీరోయిన్స్ గా నటిస్తున్నారు. ఈ సినిమాను హైలైఫ్ ఎంటర్టైన్ మెంట్ పతాకంపై కేదార్ సెలగం శెట్టి, వంశీ కారుమంచి నిర్మిస్తున్నారు. ఉదయ్ శెట్టి ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఆనంద్ దేవరకొండ తన కెరీర్ లో చేస్తున్న ఫస్ట్ యాక్షన్ మూవీ ఇది కావడం విశేషం. ఈ నెల 31న 'గం..గం..గణేశా' సినిమాను గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. తాజాగా ఈ చిత్ర ట్రైలర్ రిలీజ్ డేట్ అండ్ టైమ్ అనౌన్స్ చేశారు మేకర్స్. ఈ నెల 20న సాయంత్రం 4 గంటలకు 'గం..గం..గణేశా' సినిమా ట్రైలర్ విడుదల చేయబోతున్నట్లు ప్రకటించారు. మంచి క్రైమ్ కామెడీ మూవీగా..ప్రేక్షకులు ఫ్యామిలీస్ తో కలిసి ఎంజాయ్ చేసేలా ఈ సినిమా ఉండబోతోంది.

## సుమయా డియర్ ఉమ టీం స్పెషల్ బర్త్‌డే విషెస్!




ఓ తెలుగు అమ్మాయి హీరోయిన్గా అవకాశం దక్కించుకోవడమే గొప్ప విషయం. అలాంటిది సుమయా రెడ్డి అనే ఓ తెలుగు అమ్మాయి డియర్ ఉమ అంటూ మొదటి సినిమాతోనే నిర్మాతగా మారడం, కథను అందించడం, హీరోయిన్గా నటించడం అంటే మామూలు విషయం కాదు. ఇలా అన్నీ తానై ఓ లేడీ బాస్గా సినిమాను ముందుకు నడిపిస్తోంది. డియర్ ఉమ సినిమాతో సుమయా రెడ్డి తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. సుమయా రెడ్డి, పృథ్వీ అంబర్ హీరో హీరోయిన్లుగా సుమ చిత్ర ఆరట్స్ బ్యానర్ మీద సుమయా రెడ్డి నిర్మించిన చిత్రం డియర్ ఉమ. ఈ చిత్రానికి సాయి రాజేష్ మహాదేవ్ దర్శకత్వం వహించారు. ఇప్పటికే రిలీజ్ చేసిన పోస్టర్లు, టీజర్, నవ్వుతుంటనే లిరికల్ వీడియో సాంగ్ ద్వారా సినిమాలోని ఫీల్ గుడ్ ఎమోషన్కు ప్రేక్షకులు కనెక్ట్ అయ్యారు. అందమైన ప్రేమ కథా చిత్రంగా డియర్ ఉమ అందరినీ ఆకట్టుకునేలా ఉందని అంతా ఫిక్స్ అయ్యారు. సుమయా రెడ్డి పుట్టిన రోజు (మే 18) సందర్భంగా చిత్రయూనిట్ ఆమెకు ప్రత్యేకంగా బర్త్ డే విషెస్ తెలిపారు. అన్నీ తానై నడిపిస్తున్న తమ లేడీ బాస్కు చిత్రయూనిట్ పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపింది. ప్రస్తుతం సినిమా షూటింగ్ పూర్తయింది.

## ఆప్‌ను అంతం చేయడమే బిజెపి లక్ష్యం

### భయంతో 'ఆపరేషన్ ఝాడు': కేజ్రీవాల్



**న్యూఢిల్లీ :** ఆమ్‌ఆద్మీ పార్టీని అంతం చేయాలని బిజెపి లక్ష్యంగా పెట్టుకుందని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. బిజెపికి ఆప్ భవిష్యత్తులో సవాలుగా మారుతుందన్న భయంతోనే 'ఆపరేషన్ ఝాడు'ను ప్రారంభించిందని అన్నారు. ఆప్ నేతల ఆరెస్టులకు నిరసనగా బిజెపి కార్యాలయం వద్ద నిరసనకు ముందు తమ నేతలు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. 'ఆప్ ఎదుగుదలపై ప్రధాని నరేంద్ర మోదీ ఆందోళన చెందుతున్నారు. పార్టీ చాలా వేగంగా అభివృద్ధి చెందింది. ఆప్‌ను అణిచివేసేందుకే ఆపరేషన్ ఝాడును బిజెపి ప్రారంభించింది. రానున్న కాలంలో ఆప్ నేతలను అరెస్ట్ చేస్తారు. బిజెపికి ఆప్ పెద్ద సవాల్‌గా మారకుండా ఉండేందుకు భవిష్యత్తులో మా బ్యాంకు ఖాతాలను స్తంభింపజేస్తారు. పార్టీ కార్యాలయాన్ని మూసి వేసి వీధుల్లోకి తీసుకొస్తారు. మున్ముందు మనకు పెద్ద సవాళ్లు ఉంటాయి. వాటిని ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండండి' అ ంటూ కేజ్రీవాల్ ప్రసంగించారు. మరోవైపు, ఆమ్ ఆద్మీ పార్టీ కార్యాలయం ఎదుట ఉద్రిక్తత నెలకొంది. తమ పార్టీ నేతల అరెస్ట్‌కు నిరసనగా బిజెపి కార్యాలయానికి ర్యాలీగా వెళ్లేందుకు ఆప్ యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, ఇతర నేతలు ఆప్ కార్యాలయం ముందు బైఠాయించి నిరసన చేపట్టారు. ఫలితంగా ఆ ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అయితే ఆప్ ఆందోళన పిలుపుతో ఢిల్లీలో ని పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ మార్గ్‌లో పోలీసులు 144 సెక్షన్ వి ధించారు. ఐటిఒ మెట్రో స్టేషన్‌ను తాత్కాలికంగా మూసివేశారు. బిజెపి కే ంద్ర కార్యాలయం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో బిజెపి కార్యలయానికి వచ్చిన ఆప్ కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు.

### నిందితులను కాపాడేందుకే నిరసనలు : స్వాతి

ఆమ్ ఆద్మీ పార్టీ తలపెట్టిన నిరసనను ఉద్దేశించి ఎంపి స్వాతి మాలీవాల్ తీవ్ర విమర్శలు చేశారు. 'ఒకప్పుడు నిర్భయకు న్యాయం చేయాలని మనమంతా వీధుల్లోకి వచ్చాం. 12 ఏళ్ల తర్వాత ఇప్పుడు సీసీటీవీ ఫుటేజీని మాయం చేసి, ఫోన్‌ను ఫార్మాట్ చేసిన నిందితుణ్ని కాపాడేందుకు వీధుల్లోకి వస్తున్నామా? ఈ మాత్రం చొరవ మాజీ మంత్రి మనీశ్ సిసోదియా విషయంలో చూపి ఉంటే పరిస్థితులు మరోలా ఉండేవి. ఆయనే బయట ఉంటే ఈరోజు నాకు ఈ దుస్థితి వచ్చి ఉండేది కాదు' అని మాలీవాల్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

## బిభవ్ కుమార్‌కు 5 రోజుల పోలీస్ కస్టడీ

### ముందస్తు బెయిల్ పిటిషన్ రద్దు!

**న్యూఢిల్లీ :** ఆమ్ ఆద్మీ పార్టీ రాజ్యసభ ఎంపి స్వాతి మాలీవాల్‌పై దాడి కేసులో ప్రధాన నిందితుడు బిభవ్ కుమార్‌కు హజారీ కోర్టు ఐదు రోజుల పోలీస్ కస్టడీ విధించింది. బిభవ్ కుమార్ తనపై దాడి చేశాడని స్వాతి మాలీవాల్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు అయనను శనివారమే అరెస్ట్ చేశారు. అనంతరం కోర్టు ముందు హాజరుపరిచారు. బిభవ్ కుమార్‌ను ఏడు రోజుల తమ కస్టడీకి అప్పగించాలంటూ పోలీసులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మే 23 వరకు పోలీసు కస్టడీ విధించింది కోర్టు. ముందస్తు బెయిల్ కోసం బిభవ్ కుమార్ పిటిషన్ దాఖలు చేయగా, దానిని కోర్టు తిరస్కరించింది. అయితే కోర్టుకు ఇది చాలా తీవ్రమైన కేసు అని, ఒక పార్లమెంట్ సభ్యురాలు, ప్రజాప్రతినిధిపై దాడి జరిగిందని ఢిల్లీ పోలీసులు తెలిపారు. అలాగే సిఎం నివాసం నుంచి సీసీటీవీ ఫుటేజీని కూడా లభించిందని చెప్పారు. బిభవ్ కుమార్ అధికార హోదాలో పనిచేశారని, ప్రభావవంతమైన వ్యక్తి అని, సాక్ష్యాలను తారుమారు చేసే అవకాశం ఉందని న్యాయస్థానానికి తెలిపారు. బిభవ్ తన మొబైల్ పాస్‌వర్డ్ అడిగినా చెప్పడం లేదని, ఆధారాలు ధ్వంసం చేసేందుకు ఫోన్‌ను ఫార్మాట్ చేశారని ఆరోపించారు. అయితే తన ఫోన్ హంగ్ కావడం వల్లే ఫార్మాట్ చేయాల్సి వచ్చినట్టు బిభవ్ కుమార్ తెలిపారని పేర్కొన్నారు. ఈ కేసులో బిభవ్ మొబైల్ కీలక సాక్ష్యమని, దానిని అన్‌లాక్ చేయాల్సి ఉంటుందని, అందుకే కస్టడీకి అప్పగించాలని కోర్టుకు ఢిల్లీ పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# మోదీ వారణాసిలో మాత్రమే గెలుస్తారు

### యుపిలో బిజెపికి ఒక్క సీటు మాత్రమే వస్తాది : రాహుల్‌గాంధీ

**ప్రయోగ్‌రాజ్ :** ఉత్తరప్రదేశ్‌లో బిజెపి కేవలం ఒక్క సీటు మాత్రమే గెలుచుకుంటుందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ జోస్యం చెప్పారు. ఆదివారం ఇండియా కూటమి అభ్యర్థి ఉజ్వల్ రమణ్‌సింగ్‌కు మద్దతుగా ప్రయోగ్‌రాజ్‌లో సంయుక్తంగా నిర్వహించిన ఎన్నికల సమావేశంలో సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్‌తో కలిసి రాహుల్ మాట్లాడారు. ఉత్తరప్రదేశ్‌లో క్యోటో (వారణాసి) మాత్రమే నరేంద్ర మోదీ గెలుచుకుంటారని మీరు విన్నారా అని ఓటర్లను ప్రశ్నించారు. గతంలో ప్రధాని మోదీ వారణాసిని క్యోటోగా మారుస్తామని ప్రకటించిన విషయం విదితమే. అందువల్లే రాహుల్ వారణాసిని క్యోటోగా ఉచ్చరించారు. కాగా, రాజ్యాంగాన్ని రక్షించేందుకు పోరాటం నడుస్తోందన్నారు. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ రాజ్యాంగంపై దాడి చేస్తున్నాయన్నారు. ఏ శక్తి కూడా రాజ్యాంగాన్ని చించివేయాలని తాను చెప్పదల్చుకున్నానన్నారు. ఈ సందర్భంగా రాహుల్ చేతిలో రాజ్యాంగాన్ని పట్టుకుని అందరికీ చూపించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేస్తామని రాహుల్ మరోసారి స్పష్టం చేశారు. పార్టీ అభ్యర్థులకు మద్దతు తెలపాలని ఓటర్లను విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ ఉత్పత్తులకు ఎస్ఎస్‌పి కోసం చట్టం చేస్తామన్నారు.



యువతకు ఉపాధి కల్పిస్తామని చెప్పారు. అగ్నివీర్ పథకాన్ని బుట్టదాఖలు చేస్తామని, ఆర్మీ దళాల్లో గతంలో మాదిరిగానే నియామకాలు చేపడుతామని హామీనిచ్చారు. అంతకు ముందు అఖిలేష్ మాట్లాడుతూ ప్రజల జీవితాలను, రాజ్యాంగాన్ని బిజెపి ప్రమాదం పడేసిందన్నారు. కొవిడ్ వ్యాక్సిన్‌తో ప్రజలా జీవితాలను మరింత ప్రమాదంలోకి నెట్టివేసిందని, ఇప్పుడు రాజ్యాంగాన్ని కూడా ధ్వంసం చేయాలని కంకణం కట్టుకుందని విమర్శించారు. కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత యువతకు ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. కాగా, అలహాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ఉజ్వల్ రమణ్ సింగ్ కాంగ్రెస్ టికెట్‌పై పోటీ చేస్తున్నారు.

**కాంగ్రెస్ సభలో తొక్కిసలాట**

ఎన్నికల ప్రచారంలో భాగంగా ఫుల్‌పూర్‌లో నిర్వహించిన సభకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఎస్‌పి అధినేత అఖిలేష్ యాదవ్ హాజరయ్యారు. ఈ నేతలిద్దరూ వేదికపైకి చేరుకున్న తరువాత.. సభకు వచ్చిన జనం వేదికకు దగ్గరగా వచ్చే ప్రయత్నం చేయగా తొక్కిసలాట జరిగింది. దీంతో నేతలిద్దరూ మాట్లాడకుండా అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఎస్‌పి చీఫ్ అఖిలేష్ యాదవ్ రాగానే సభలో జనం బారికేడ్లను బద్దలుకొట్టి వేదికకు దగ్గరగా వెళ్లే ప్రయత్నం చేయడంతో జరిగిన తొక్కిసలాటలో పలువురు గాయపడ్డారు. కాంగ్రెస్ సభలో జరిగిన తొక్కిసలాటలో ఓ మీడియా సంస్థకు చెందిన కెమెరా స్టాండ కూడా పగిలిపోయింది. తొక్కిసలాటతో గందరగోళం నెలకొనడంతో రాహుల్, అఖిలేష్ ఎలాంటి ప్రసంగం చేయకుండానే వెళ్లిపోయారు. రాహుల్, అఖిలేష్ ఉమ్మడి బహిరంగ సభ ఫూల్పూర్‌లోని పందిలాలో జరగాల్సి ఉంది. ఇద్దరూ నేతలు ఈ సభకు చేరుకున్నప్పటికి తొక్కిసలాట కారణంగా నేతలిద్దరూ ర్యాలీలో ప్రసంగించకుండా వెనుదిరిగారు.

## వారు అమ్మేది చెప్పులే.. కానీ, ఆ గది నిండా నోట్ల కట్టలే..!

**లక్నో :** వారు అమ్మేది చెప్పులు.. కానీ, వారి వద్ద ఉన్న సంపద కోట్లు.. అవును, వారి వద్ద ఉన్న నోట్ల కట్టలు చూసి ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారులు ఖంగుతిన్నారు. ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా రూ. 40 కోట్ల నగదు పట్టుబడింది. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలో ముగ్గురు చెప్పుల వ్యాపారుల ఇళ్లపై ఆదాయపు పన్ను శాఖ దాడులు చేసింది. ఈ క్రమంలో వారి వద్ద లెక్కల్లో చూపని భారీగా డబ్బు బయటపడింది. ముగ్గురు చెప్పుల వ్యాపారుల వద్ద ఇప్పటివరకు రూ.40 కోట్ల నగదు దొరికినట్లు అధికారిక వర్గాలు చెబుతున్నాయి. ఇంకా లెక్కించని నగదు ఉందని.. వాటిని కూడా లెక్కించడం జరుగుతుందని అధికారులు తెలిపారు. వారి వద్ద స్వాధీనం చేసుకున్న డబ్బు ఒక గది నిండా ఉందన్నారు. రూ.500 బండిళ్లను లెక్కించే బాధ్యతను బ్యాంకు అధికారులు, ఉద్యోగులకు అప్పగించారు. 'చాలా నోట్లు ఉన్నాయి, గది మొత్తం 500 నోట్ల కట్టలతో నిండిపోయింది. ఇప్పటి వరకు రూ.40 కోట్లు లెక్కతేల్చగా ఇంకా లెక్కలు తేలాల్సిన ఉన్నాయి.

## ఆ రాష్ట్రాల్లో పెట్టుబడులు పెట్టడానికి 50 సార్లు ఆలోచిస్తారు..

### ప్రధాని మోదీ సంచలన వ్యాఖ్యలు

**రాంచీ :** కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు పెట్టడానికి 50 సార్లు ఆలోచిస్తారని ప్రధాని మోదీ ఎద్దేవా చేశారు. లోక్ సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన జార్ఖండ్‌లోని జంషెడ్‌పూర్‌లో ఆదివారం ఎన్నికల ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ మావోయిస్ట్ భాష ఉపయోగించడం వల్ల ఆ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో పెట్టుబడులు పెట్టడానికి ఆలోచిస్తారన్నారు. ఆ పార్టీ కుటుంబ రాజకీయాలను ప్రోత్సహిస్తోందని, లోక్‌సభ స్థానాలను పూర్వీకుల ఆస్తులుగా పరిగణిస్తోందని ఆరోపించారు. రాయ్‌బరేలీ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేయాలనే రాహుల్ గాంధీ నిర్ణయంపై మోదీ మండిపడ్డారు. కాంగ్రెస్ 'షెహజాదా'(ప్రిన్స్ లేదా రాజకొడుకు) రాయ్‌బరేలీకి నియోజకవర్గానికి వెళ్లి ఇది తన అమ్మ పోటీ చేసే స్థానమని, తాను పోటీ చేస్తానని అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. దేశ వ్యాప్తంగా ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించడంలో కాంగ్రెస్ విఫలమైందని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను కాంగ్రెస్, జెఎంఎం తీసేయాలని చూస్తున్నాయని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

## 3317మంది సిఐఎస్ఎఫ్ సిబ్బందితో పార్లమెంట్ సెక్యూరిటీ

### బాధ్యతల నుంచి సిఆర్‌పిఎఫ్ ఔట్

**న్యూఢిల్లీ :** ఇప్పటి వరకు సిఆర్‌పిఎఫ్‌కు చెందిన పార్లమెంట్ డ్యూటీ గ్రూప్(పిడిజి)లోని 1400 మందికిపైగా సిబ్బంది మన పార్లమెంటుకు భద్రత కల్పించేవారు. ఇకపై ఈ విధులను సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సిఐఎస్ఎఫ్) నిర్వర్తించనుంది. మే 20వ తేదీన (సోమవారం) ఉదయం 6 గంటల నుంచి సిఐఎస్ఎఫ్‌కు చెందిన దాదాపు 3,317 మందికిపైగా సిబ్బంది మొత్తం పార్లమెంటు కాంప్లెక్సుకు పహారా కాయనున్నారు. గత శుక్రవారం పార్లమెంటు కాంప్లెక్సులోని పరిపాలన, కార్యాచరణ విభాగాలను సిఐఎస్ఎఫ్ ఉన్నతాధికారులకు పిడిజి కమాండర్ అప్పగించారు. దీంతో తమ ఆయుధాలు, వాహనాలు, కమాండోలను ఉపసంహరించుకునేందుకు పిడిజి అన్ని ఏర్పాట్లు చేసుకుంది.

**గత 10 రోజులుగా జల్లెడ**

సెంట్రల్ ఢిల్లీలో ఉన్న పార్లమెంటు కాంప్లెక్స్‌లో పాత పార్లమెంటు భవనం, కొత్త పార్లమెంటు భవనం, వాటి అనుబంధ నిర్మాణాలు ఉన్నాయి. వాటన్నింటికి ఇకపై 3,317 మంది సిఐఎస్ఎఫ్ సిబ్బంది రక్షణ కల్పించనున్నారు. పార్లమెంటు కాంప్లెక్సులోని అన్ని ఫ్లాప్ ఎంట్రీ గేట్‌లు, పోస్టెడ కెనైన్ స్క్వాడ్‌లు, ఫైర్ టెండర్లు, సీసీటీవీ మానిటరింగ్ కంట్రోల్ రూమ్, కమ్యూనికేషన్ సెంటర్, వాచ్ టవర్ వంటి విభాగాల్లో ఇప్పటికే సిఐఎస్ఎఫ్ సిబ్బంది విధులను మొదలుపెట్టారు. సిఐఎస్ఎఫ్ సిబ్బంది గత 10 రోజులుగా పార్లమెంటు కాంప్లెక్స్‌ను అణువణువూ జల్లెడ పడుతున్నారు.

**కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాతే**

పార్లమెంటులో విధులు నిర్వర్తించే సిఐఎస్ఎఫ్ సిబ్బందికి సఫారీ సూట్లు, లేత నీలం రంగు ఫుల్ స్లీవ్ షర్టులు, బ్రౌన్ ప్యాంట్‌లు యూనిఫామ్‌గా ఉంటాయి. పార్లమెంట్ డ్యూటీ గ్రూప్‌లో భాగంగా సేవలందించిన పార్లమెంట్ సెక్యూరిటీ స్టాఫ్ (పిఎస్ఎస్)ను భవిష్యత్తులోనూ పార్లమెంటు ప్రాంగణంలో మార్షల్ విధుల కోసం, లాబీల పహారాకు వినియోగించే అవకాశం ఉంది. కొంతమంది పిఎస్ఎస్ సిబ్బందిని పలు కేంద్ర ప్రభుత్వ సంస్థలలో భద్రత, ప్రోటోకాల్ విధుల కోసం మోహరించనున్నారు. పార్లమెంటు నుంచి సేవలను ఉపసంహరించుకోనున్న పార్లమెంట్ డ్యూటీ గ్రూపును సిఆర్‌పిఎఫ్ ఆరో బెటాలియన్‌కు చెందిన విఐపి భద్రతా విభాగంలో విలీనం చేయాలని యోచిస్తున్నారు. అయితే ఈ అంశాలపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. ప్రస్తుతానికి తాత్కాలిక ప్రాతిపదికనే సిఐఎస్ఎఫ్‌కు పార్లమెంటు భద్రతా విధులను అప్పగిస్తున్నారని, కొత్త ప్రభుత్వం ఏర్పడగానే దాన్ని పూర్తిస్థాయి సేవల కోసం అప్‌గ్రేడ్ చేయనున్నారని తెలుస్తోంది.



**2023 డిసెంబరు 13 ఘటనతో**

గతేడాది డిసెంబర్ 13న పార్లమెంటు భద్రతా ఉల్లంఘన వ్యవహారంతో దేశంలో కలకలం రేగింది. పార్లమెంటు జీరో అవర్ టైంలో ఇద్దరు యువకులు పబ్లిక్ గ్యాలరీ నుంచి లోక్‌సభలోకి దూకి ఎంపిలపైకి రంగుల పొగలను స్ప్రే చేస్తూ హల్‌చల్ చేశారు. అప్పట్లో పార్లమెంట్ కాంప్లెక్స్ భద్రతా సమస్యలను పరిశీలించి తగిన సిఫార్సులు చేయడానికి సిఆర్‌పిఎఫ్ డిజి అధ్యక్షతన ఒక కమిటీని ఏర్పాటు చేశారు. 2001 సంవత్సరంలో పార్లమెంటుపై ఉగ్రవాదుల దాడి జరిగిన టైంలో సిఆర్‌పిఎఫ్ సిబ్బంది ఎనలేని సేవలు అందించారు. అత్యంత ధైర్యసాహసాలను ప్రదర్శించారు. అలాంటిది ఇప్పుడు పార్లమెంటు భద్రతా విధుల నుంచి వైదొలగాల్సి వస్తుండటంపై సిఆర్‌పిఎఫ్ వర్గాలు విచారం వ్యక్తం చేస్తున్నాయి.